ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698


తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 15.05.2025 | సంపుటి : 11 సంచిక : 296 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


## నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం

**భారత స్టార్ జావెలిన్ త్రోయర్‌కు టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ హోదా**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత స్టార్ జావెలిన్ త్రోయర్, డబుల్ ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం దక్కింది. టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ గౌరవ హోదాను ప్రదానం చేసినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. ఇది ఏప్రిల్ 16, 2025 నుంచి

మిగతా 2లో..



## ఈ ఏడాది వానలే వానలు

**జోరందుకున్న నైరుతీ రుతుపవనాలు!**

**మే 27న కేరళను తాకే అవకాశం**

**31లోగా రాష్ట్రమంతటా విస్తరణ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నైరుతీ రుతుపవనాలు మే 13న దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, ఆగ్నేయ బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లోకి

మిగతా 2లో..



# మధ్యప్రదేశ్ మంత్రి మతిలేని మాటలు

"కల్నల్ సోఫియా ఖురేషీ దేశం గర్వించదగ్గ భారత పుత్రిక. దేశాన్ని ప్రేమించే భారతీయులందరికీ సోదరి. ఎంతో ధైర్యం, అంకిత భావంతో ఆమె దేశసేవ చేస్తున్నారు. అటువంటి మహిళలను చూసి దేశం గర్వపడుతోంది. దేశం ప్రగతిశీల అభివృద్ధివైపు వెళ్లాలంటే స్త్రీలు ప్రతి రంగంలోనూ ముందుకొచ్చి నాయకత్వం చేపట్టాలి. మహిళలపై అగౌరవ వ్యాఖ్యలు చేయడం దేశాభివృద్ధిని అడ్డుకోవడమే"
– విజయ రహాట్కర్, జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్

## కల్నల్ సోఫియా ఖురేషి టెర్రరిస్టుల సోదరి అట!

## స్త్రీలను అవమానపరిచేలా బీజేపీ మంత్రి వ్యాఖ్యలు

**జాతీయ మహిళా కమిషన్ సీరియస్**



### మంత్రిని తొలగించాలి : ఖర్గే

మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి మన ధీరవనిత సోదరి కల్నల్ సోఫియా ఖురేషీ గురించి అత్యంత దారుణమైన, దిగజారిన వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తప్పుబట్టారు. పహల్గామ్ ఉగ్రవాదులు దేశాన్ని చీల్చాలనుకున్నా రు. కానీ ఆపరేషన్ సిందూర్ సమయంలో దేశమంతా ఏకతాటిపై నిలబడి వారికి సమాధానం చెప్పిందని గుర్తుచేశారు. మోదీజీ, ఆ మంత్రిని వెంటనే తొలగించాలని ఖర్గే డిమాండ్ చేశారు.

**తక్షణమే కేసు నమోదుకు హైకోర్టు ఆదేశాలు**

**రాజీనామా చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే డిమాండ్**

**న్యూఢిల్లీ, మే 14 (జనంసాక్షి) :** ఆపరేషన్ సిందూర్‌లో కీలకంగా వ్యవహరించి దేశవ్యాప్తంగా ప్రజలందరి మన్ననలు పొంది, మహిళా లోకానికి స్ఫూర్తిగా నిలిచిన సైనికాధికారిణి కల్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ మంత్రి విజయ్ షా అవమానకర వ్యాఖ్యలు చేశారు. మతం పేరుతో ఇరువర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించరాదనే భారతీయ న్యాయసంహిత సెక్షన్ 196కు విరుద్ధంగా వ్యవహరించారు. ఖురేషీని ఉగ్రవాదుల సోదరీగా, వాళ్ల మతం అంటూ పోల్చడంపై బీజేపీ మంత్రి పట్ల దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై జాతీయ మహిళ కమిషన్ కూడా స్పందించింది. మంత్రి విజయ్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. భారత సాయుధ దళాలలో పని చేస్తున్న మహిళల పట్ల గౌరవం చూపించాలని చురకలంటించింది. మంగళవారం రాత్రి ఓ సాంస్కృతిక కార్యక్రమంలో మంత్రి విజయ్ షా మాట్లాడుతూ.. ఉగ్రవాదులు మన సోదరీమణుల నుదుటిపై ఉన్న సిందూరాన్ని తుడిచేస్తే.. ఆ ఉగ్రమూకలకు గుణ పాఠం చెప్పేందుకు ప్రధాని మోడీ వారి మతానికి చెందిన సోదరినే పంపారు' అని వ్యాఖ్యానించారు. కీలక సమయంలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సోఫియా ఖురేషీ పట్ల మంత్రి

మిగతా 2లో..

# నేతలు చెప్పినట్టు ప్రాజెక్టులు కట్టొద్దు

**నాణ్యత విషయంలో ఇంజినీర్లు ఎవరి ఒత్తిళ్లకు లొంగవద్దు**

**రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టిన కాళేశ్వరం మూడేళ్లలోనే కూలింది**

- నెహ్రూ శంకుస్థాపన చేసిన నాగార్జునసాగర్, శ్రీశైలంతోనే ఇప్పుడు మనకు నీళ్లు అందుతున్నాయి
- అవి ఎన్నో వరదలు, ఉపద్రవాలను తట్టుకుని నిలబడ్డాయి
- కాళేశ్వరంతో అదనంగా వెయ్యి ఎకరాలకు కూడా నీరు అందలేదు
- ఎస్ఎల్‌బీసీ, సీతారామ, దేవాదుల, నెట్టెంపాడు, సమ్మక్క సారక్క ప్రాజెక్టులను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేస్తాం
- కొలువుల పండుగ కార్యక్రమంలో పలువురికి నియామకపత్రాలు అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



త్వరలోనే 'గ్రూప్స్' ఉద్యోగ నియామకాలు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రాజెక్టుల నాణ్యత విషయంలో ఇంజినీర్లు ఎవరి ఒత్తిళ్లకు లొంగవద్దని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ జలసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కొలువుల పండుగ కార్యక్రమంలో నీటిపారుదల శాఖలో ఏఈ, జేటీవో పోస్టులకు ఎంపికైన వారికి సీఎం చేతుల మీదుగా నియామక

మిగతా 2లో..

## ప్రణాళిక ప్రకారం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ అనుమతులు

**సమగ్ర అధ్యయనంతో త్వరగా నివేదిక సమర్పించాలి**

**అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం**

2లో

## ఓరుగల్లు.. అందాల జల్లు

**సంప్రదాయ చీరకట్టులో బతుకమ్మ ఆడిన అతివలు**

**వరంగల్‌లో చారిత్రక కట్టడాలను సందర్శించిన ప్రపంచ సుందరీమణులు**



**వరంగల్(జనంసాక్షి):** మిస్ వరల్డ్ కంటెస్టంట్లు– వరంగల్‌లో సందడి చేశారు. వివిధ దేశాలకు చెందిన సుందరాంగులు బుధవారం వరంగల్ చేరుకున్నారు. బుధవారం వరంగల్ చేరుకున్న వీరికి

మిగతా 2లో..




## కర్రెగుట్ట ఆపరేషన్ విజయవంతమైంది

**31 మంది మావోయిస్టులు మృతి: డీజీపీ అరుణ్‌దేవ్ గౌతం**

**చర్ల(జనంసాక్షి):** తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు బీజాపూర్ జిల్లా ఉసురు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్రెగుట్ట కేంద్రంగా జరిగిన ఆపరేషన్‌లో 31మంది మావోయిస్టులు మృతి చెందినట్లు సీఆర్పీ ఎఫ్ డీజీ జీపీ సింగ్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతం తెలిపారు. బుధవారం బీజాపూర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆపరేషన్ జరిగిన 21 రోజుల్లో 31 మంది

మిగతా 2లో..

## మన పోరాట స్ఫూర్తి అభినందనీయం

**సీడీఎస్, త్రివిధ దళాధిపతుల భేటీలో రాష్ట్రపతి ముర్ము**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్‌తో పాటు త్రివిధ

## 52వ సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్

- ప్రమాణ స్వీకారం చేయించిన రాష్ట్రపతి ముర్ము
- కార్యక్రమంలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి, మాజీ రాష్ట్రపతి, ప్రధాని
- 2005లో శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా విశేష సేవలందించిన గవాయ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయ్ భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా స్థానంలో బుధవారం 52వ సీజేఐ బీఆర్ గవాయ్ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ బీఆర్ గవాయ్ చేత ప్రమాణం చేయిం చారు. సీజేఐగా బీఆర్ గవాయ్ ప్రమాణ స్వీకా రం చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేం ద్ర మోడీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధనర్, మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్, ఇతర ప్రము ఖులు పాల్గొన్నారు. తాజా ప్రమాణ స్వీకారంతో భారతదేశంలో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన తొలి బౌద్ధుడిగా చరిత్ర సృష్టించారు. ఈ ఏడాది నవంబర్ 23న గవాయ్ పదవి విరమణ చేయనున్నారు. 1960 నవంబరు 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించారు బీఆర్ గవాయ్. ఆయన తండ్రి రామకృష్ణ

మిగతా 2లో..





## నేటినుండి కాళేశ్వరం సరస్వతి పుష్కరాలు

**అన్ని ఏర్పాట్లు పూర్తి • రూ.25 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం**

**హారతి కార్యక్రమాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**కాళేశ్వరం(జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి కాళేశ్వరంలో నేటి నుంచి ఈ నెల 26వ తేదీ వరకు సరస్వతి నది పుష్కరాలు జరగనున్నాయి. 12 ఏళ్లకోసారి నిర్వహించే ఈ పుష్కరాలు ఈ ఏడాది నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పుష్కరాలకు తెలంగాణతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి కూడా ఆ భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు..ప్రధానంగా ఈ కాళేశ్వరం వద్ద త్రివేణి సంగమం సరస్వతి నది అంతర్వాహినిగా ప్రవహిస్తుందని నమ్ముతారు. దక్షిణ భారతదేశంలో సరస్వతి పుష్కరాలు జరిగే ఏకైక పుణ్యక్షేత్రం కాళేశ్వరం కూడా కావడం అత్యంత విశేషం సంతరించుకున్నది. ఇక ఈ ఏడాది 2025 తెలంగాణలోని కాళేశ్వరం సరస్వతి పుష్కరాలు మే 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు అంటే 12 రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఈ పుష్కరాలు గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంఘమం అయిన కాళేశ్వరం వద్ద జరుగుతుంది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం

మిగతా 2లో..

## స్వదేశీ కౌంటర్ డ్రోన్ వ్యవస్థ 'భార్గవాస్త్ర'

**సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ అభివృద్ధి**

**ఒడిశాలో విజయవంతమైన పరీక్షలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశ రక్షణ రంగంలో మరో ముందడుగు పడింది. శత్రు డ్రోన్ల సమూహాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'భార్గవాస్త్ర' కౌంటర్ డ్రోన్ వ్యవస్థను విజయవంతంగా పరీక్షించారు. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (ఎస్‌డీఏఎల్) ఈ అత్యాధునిక వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఇటీవలి కాలంలో పెరుగుతున్న డ్రోన్ల ముప్పును ఎదుర్కోవడంలో ఇది కీలక పాత్ర పోషించనుంది.ఒడిశాలోని గోపాల్‌పూర్

మిగతా 9లో..



## బీఎస్ఎఫ్ జవాన్‌ను అప్పగించిన పాక్

**ఇండియన్ ఆర్మీ హెచ్చరికలకు తలొగ్గిన దయాది**

**పాక్ రెంజర్‌ను వదిలేసిన ఇండియన్ ఆర్మీ**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్, పాక్ ల మధ్య కాల్పుల విరమణ అంగీకారం నడుస్తుంది. ఈ క్రమంలో.. భారత్ జవాన్..పూర్ణమ్ కుమార్ షా.. 2025 ఏప్రిల్ 23న అనుకోకుండా బోర్డర్ దాట డంతో పాక్ రేంజర్స్ పూర్ణమ్ షాను అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి ఇండియన్ ఆర్మీ పాక్ తో చర్చలు జరుపుతుంది.ఈ నేపథ్యంలో.. పాక్ రేంజర్ల అదుపులో ఉన్న జవాన్ పూర్ణమ్ కుమార్ షాను భారత్ కు అప్పగించారు. బీఎస్ఎఫ్.. జవాన్ పూర్ణమ్ సాహును అటారీ బార్డర్ వద్ద సరిహద్దు దళాలకు పాక్ అప్పగించింది. దీన్ని బీఎస్ఎఫ్ అఫిషియల్ గా తెలిపింది. బీఎస్ఎఫ్ 182 కబెటాలియన్ కు చెందిన

మిగతా 2లో..

# సింధూ జలాలపై పునఃసమీక్షించండి

**భారత్‌కు పాకిస్థాన్ విజ్ఞప్తి**

**ఇస్లామాబాద్(జనంసాక్షి):** సింధూ జలాల ఒప్పందం నిలిపివేత వల్ల జరిగే నష్టం ఏంటో పాకిస్థాన్‌కు తెలుసొచ్చింది. మొన్నటి వరకు ఈ అంశంలో తీవ్ర స్వరంతో మాట్లాడిన దాయాది ఇప్పుడు ఆత్మరక్షణలో పడినట్లు తెలుస్తోంది. కాల్పుల విరమణకు అంగీకరించిన భారత్.. సింధూ జలాల విష యంలో వెనక్కి 'తగ్గేదే లే' అని ప్రకటించడంతో ఇప్పుడు కాళ్ల బేరానికి వచ్చింది. నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలంటూ కోరింది. ఈ మేరకు భారత ప్రభుత్వానికి లేఖ రాసింది. సింధూ జలాలు నిలిపివేస్తే పాక్‌లో తీవ్ర దుర్భిక్షం నెలకొంటుందంటూ భారత జలశక్తి మంత్రిత్వ శాఖకు పాక్ జలవనరుల శాఖ లేఖ రాసినట్లు సమాచారం. ఈ విషయంలో చర్చించేందుకు పాక్ సిద్ధంగా ఉందని పేర్కొంది. ప్రోటోకాల్‌లో భాగంగా ఈ అంశాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపినట్లు తెలుస్తోంది. అయితే, రక్తం, నీరు రెండూ కలిసి ప్రవహించలేవంటూ ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని ప్రధాని మోదీ ఇప్పటికే స్పష్టం చేశారు. పాక్‌తో చర్చలంటూ జరిగితే ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పైనే అని పేర్కొన్నారు. పహల్గాంలో



మిగతా 2లో..

## పాక్ దాడుల్లో దెబ్బతిన్న ఇళ్లను పునర్నిర్మిస్తాం

**బాధితులకు జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా హామీ**



**శ్రీనగర్(జనంసాక్షి):** నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ బలగాలు జరిపిన షెల్లింగ్‌లో ధ్వంసమైన ఇళ్లను జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పరిశీలించారు. నష్టానికి సంబంధించి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న ఇళ్లను పునర్నిర్మించడానికి అవసరమైన సాయాన్ని ప్రభుత్వం తరఫు నుంచి అందిస్తామని ఈ సందర్భంగా బాధితులకు ఆయన హామీ ఇచ్చారు. వారి బాధను తాను అర్థం చేసుకోగలనని అన్నారు.ఉత్తర కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలోని సలామాబాద్, లాగామా, బందీ, గింగల్ సహా ఉరీలోని షెల్లింగ్ ప్రభావిత ప్రాంతాల్లో ఒమర్ అబ్దుల్లా పర్యటించారు. ఈ ప్రాంతాల్లో వ్యక్తిగత బంకర్లను

మిగతా 2లో..

## పేదల ఇళ్లెందుకు కూలుస్తున్నారు?



- వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారు
- మిస్ వరల్డ్ పోటీదారుల కోసం మూర్ఖపు చర్య
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్(జనంసాక్షి):** మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ వరంగల్, ములుగు జిల్లాల పర్యటనకు రానున్నారని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ప్రజాగ్రహానికి గురిచేస్తున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్

మిగతా 2లో..

## భారత్‌లో మరో సెమీ కండక్టర్ యూనిట్

- ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- రూ.3,707 కోట్లతో యూపీలో ఆరో యూనిట్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సెమీ కండక్టర్ల విషయంలో దేశం స్వావలంబన సాధించే దిశగా కేంద్రం మందడుగు వేసింది. మరో సెమీ కండక్టర్ యూనిట్ ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ. 3,707 కోట్ల పెట్టుబడితో ఉత్తంప్రదేశ్‌లోని జెవార్‌లో ఆరో యూనిట్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి రంగంలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన 'హొన్ హాయ్ టెక్నాలజీ' గ్రూప్‌నకు చెందిన 'ఫాక్స్‌కాన్' హెచ్‌సీఎల్ సంయుక్తంగా ఈ సెమీకండక్టర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇది మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఆటోమొబైల్స్ ఇతర పరికరాల కోసం డిస్‌ప్లే డ్రైవర్ చిప్‌లను తయారు చేస్తుందని పేర్కొన్నారు. సెమీ కండక్టర్ల రంగాన్ని మరింత ప్రోత్సహించే

మిగతా 2లో..

# నేటినుండి కాళేశ్వరం సరస్వతి పుష్కరాలు..

ఈ పుష్కరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. డ్రైనేజీ వ్యవస్థ, రోడ్డు విస్తరణ అన్ని సౌకర్యాలు చేపట్టింది. ప్రధానంగా ఈ పుష్కరాలకు తెలంగాణ ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఇక్కడ భక్తులు పుష్కర సమయంలో ప్రత్యేక పూజలు అమ్మవారికి నిర్వహిస్తారు. పుణ్యస్నానాలు చేసి హెూమం వంటివి నిర్వహిస్తారు. సరస్వతి నదిలో స్నానం చేయటం వల్ల పాపములు నశించిపోతాయని నేను విశ్వసిస్తారు. ఈ నేపథ్యంలో ఎక్కువ శాతం మంది భక్తులు దేశం నలుమూలల నుంచి కూడా వచ్చే అవకాశం ఉంది. ప్రధానంగా దక్షిణ భారతదేశంలో సరస్వతి పుష్కరం ఇది ఒకటే కాబట్టి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. పుష్కరాల కోసం పోలీసుల పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసారు..మొత్తం 3 షిఫ్టుల్లో సుమారు 3500 మంది పోలీసుల విధులు నిర్వహిస్తారుపుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుంచి మే 26 వరకు సరస్వతి పుష్కరాలు జరుగనున్నాయి. మే 15 ఉదయం 5 గంటల 44 నిముషాలకు సరస్వతీ పుష్కరాలను శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి ఘనంగా ప్రారంభిస్తారు. ఇదే రోజు సాయంత్రం ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా కాళేశ్వరం చేరుకుంటారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. పుష్కరస్నానం ఆచరించిన తర్వాత కాళేశ్వరం ఆలయాన్ని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా సరస్వతీ మాత విగ్రహావిష్కరణ, గోదావరి హారతి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలనియాజమాన్యం నిర్ణయించింది. ఉప్పల్, కూకట్ పల్లి, జీడిమెట్ల, మేడ్చల్ సహా నగరంలో పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. 40 మంది కలిసి పుష్కరాలకు వెళ్లాలని అనుకుంటే వారికోం ప్రత్యేక బస్సులు పంపేలా ఏర్పాట్లు చేశామన్నారు.పన్నెండేళ్లకోసారి జరిగే పవిత్రమైన పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సురక్షితంగా వారంతా పుష్కర స్నానం ఆచరించేలా టీజీఎస్ఆర్టీసీ అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. గ్రేటర్ హైదరాబాద్ జోన్ టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ఈ నెల 14 బుధవారం నుంచి 24వరకు ప్రత్యేక బస్సులను నడపనుందిభక్తుల రద్దీకి అనుగుణంగా ఈ బస్సులు ప్రధాన పుష్కర ఘాట్లకు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించారుగ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాలైన జేబీఎస్, ఎంజీబీఎస్, ఉప్పల్, కూకట్ పల్లి, జీడిమెట్ల, మేడ్చల్ నుంచి మెట్రో డీలక్స్ బస్సులు నడుపనున్నారు. వివిధ ప్రాంతాల్లో ప్రత్యేకంగా.. ఒకే కాలనీలో 40 మంది ప్రయాణికులు ఉంటే ఆ కాలనీకే బస్సు పంపించే ఏర్పాట్లు చేశారు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు. ఇలాంటి ప్రత్యేక బస్సుల కోసం 9676671533, 9959226154, 9959226160 నంబర్లు సంప్రదించండి.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి 790 ప్రత్యేక %=ఙ% బస్సులు ఈ పుష్కరాలను వెళ్లనున్నాయి.

## కర్రెగుట్ట ఆపరేషన్ విజయవంతమైంది

మావోయిస్టులు మృతి చెందారని, వీరిలో 16 మంది మహిళా మావోయిస్టులు ఉన్నట్లు తెలిపారు.ఈ ఆపరేషన్లో మృతి చెందిన మావోయిస్టులపై రూ.1.72 కోట్ల రివార్డు ఉందని పేర్కొన్నారు. 18 మంది జవాన్లు గాయపడినట్లు చెప్పారు. మృతి చెందిన మావోయిస్టుల్లో 20 మందిని గుర్తించామని, ఇంకా 11 మందిని గుర్తించాల్సి ఉందన్నారు. 31 మంది మావోయిస్టుల నుంచి 35 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 21 నుంచి మే 11 వరకు కర్రెగుట్ట ఆపరేషన్ నిర్వహించామన్నారు. ఈఏడాది మావోయిస్టులకు వ్యతిరేకంగా జరిగిన ఆపరేషన్లో 174 మంది హార్డ్ కోర్ మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

## పేదల ఇళ్లెందుకు కూలుస్తున్నారు?

వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి బుల్డోజర్ కంపెనీలతో రహస్య ఒప్పందం ఉందా? అని రాహుల్ గాంధీని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. రోజువారీ కూలి పనులు చేసుకుని జీవించే నిరుపేద ప్రజల ఇండ్లతో పాటు వారి జీవనోపాధిని నాశనం చేయడానికి నిరంతర ప్రయత్నం చేయడానికి కారణం ఏంటి ? వరంగల్లో కూల్చివేతలు ఎందుకు జరుగుతున్నాయని రాహుల్ను కేటీఆర్ ప్రశ్నించారు. ఈరోజు (మే 14న) మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించే మార్గాన్ని 'అందం'గా చేయడానికి అని ప్రజలకు చెబుతున్నారు. అలాంటి చర్యలు చేస్తున్న మీ కాంగ్రెస్ నేతలు మీది ప్రజా పాలన అని, ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడానికి సిగ్గుపడాలంటూ ఘాటుగా స్పందించారు. రాజభవనాలలో విలాసవంతమైన విందులు, మరోవైపు 200 కోట్ల రూపాయలకు పైగా ప్రజా ధనాన్ని వృథా ఖర్చు చేశారు. బుల్డోజర్లతో పేదల ఇండ్లు కూల్చివేస్తున్నారు. పేదల జీవితాలను బుల్డోజర్ల కింద ఎందుకు నలిపేయాల్సి వచ్చింది?. మీ సిగ్గులేని కాంగ్రెస్ ప్రభుత్వం మేం అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేటీఆర్ షేర్ చేసిన వీడియోలో ఏముందంటే.. రోడ్డు పక్కన ఉన్న పేదల గుడిసెలు, వారి చిన్న చిన్న షాపులను సిబ్బంది తొలగిస్తున్నారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్ లో పాల్గొనే అందెగత్తెలు నేడు వరంగల్ జిల్లాకు రానున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వెయ్యి స్తంభాల గుడి, రామప్ప టెంపుల్ లాంటి ప్రముఖ కట్టడాలను వారు సందర్శించనున్నారు. దాంతో తమ లాంటి పేదలకు నష్టం కలిగించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు. వారెవరో విదేశాల నుంచి అందగత్తెలు వస్తే మాకు అన్యాయం ఎందుకు చేస్తున్నారు. మా పొట్ట ఎందుకు కొడుతున్నారు. కాంగ్రెస్ కు ఓట్లు వేసింది మేమా, లేక మిస్ వరల్డ్ అందెగత్తెలు వచ్చి ఓట్లు వేశారా అని కొందరు పేదలు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## బీఎస్ఎఫ్ జవాన్ను అప్పగించిన పాక్

పూర్ణమ్.. పంజాబ్ లోని ఫిరోజ్ పూర్ సెక్టార్ లో.. విధులు నిర్వర్తిస్తున్నారు.ఆయన ఏప్రిల్ 23న సరిహద్దు వద్ద కొంత మంది రైతులతో కలిసి గస్తీ కాస్తుండగా.. అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే చెట్టు కన్పించడంతో.. అక్కడ విశ్రాంతి తీసుకున్నాడు. అది పాక్ భూభాగంలో ఉన్న విషయం గుర్తించలేకపోయాడు. దీంతో పాక్ రేంజర్స్ పూర్ణమ్ ను కస్టడీలోకి తీసుకున్నాయి.ఈ క్రమంలో జవాన్ విడుదల కోసం.. రెండు దేశాల మధ్య భద్రత దళాలు చర్చలు జరిపాయి. ఈ క్రమంలో ప్రెగ్నెంట్ అయిన జవాన్ భార్య..కేంద్రాన్ని తన భర్తను విడిపించాలని అభ్యర్థించింది. ఈ క్రమంలో ఇండియన్ ఆర్మీ పలు పర్యాయాలు పాక్ తో సంప్రదింపులు జరిపింది. ఈ నేపథ్యంలో దిగొచ్చిన పాక్.. పూర్ణమ్ ను విడుదల చేసింది. ప్రస్తుతం పూర్ణమ్ షాను అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే.. ప్రస్తుతం మనదేశ జవాన్ కు ఇండియన్ ఆర్మీ వెంటనే సీక్రెట్ ప్రదేశంలో తీసుకెళ్లి పలు మెడికల్ టెస్టులు చేయిస్తుందని తెలుస్తోంది.గతంలో భారత వైమానిక దళం వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ భారత్ బార్డర్ దాటి పాక్ భూభాగంలోకి విమానం లాండ్ చేశాడు. దీంతో పాక్ రేంజర్ లు..అభినందన్ వర్ధమాన్ ను అదుపులోకి తీసుకున్నారు. అప్పుడు కూడా ఇండియా.. దాయాదితో చర్చలు జరిపింది. 10 రోజుల తర్వాత వింగ్ కమాండర్ అభినందన్ వర్తమాన్ ను పాక్ విడుదల చేసింది. ఆయనకు నిర్వహించిన టెస్టులే ఇప్పుడు బీఎస్ఎఫ్ జవాన్ కు కూడా నిర్వహిస్తారు.ముఖ్యంగా బీఎస్ఎఫ్ జవాన్ శరీరంలో ఏదైన బగ్ లేదా మరేదైన గూఢాచార్య పరికరాలు, చిప్ లు అతని శరీరంలో అమర్చారా..? అన్నదానిపై ఇండియన్ ఆర్మీ మెడికల్ అధికారులు నిర్వహిస్తారు. కొన్నిరోజుల పాటు.. బీఎస్ఎఫ్ జవాన్ ను సీక్రెట్ గా అబ్జర్వేషన్ లో ఉంచి, అతని కదలికల్ని ప్రత్యేకంగా అబ్జర్వ్ చేస్తారు.

# మధ్యప్రదేశ్ మంత్రి మతిలేని మాటలు

చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి విజయ్ షా వ్యాఖ్యలపై దాఖలైన పిటిషన్లను సుమోటోగా స్వీకరించిన మధ్యప్రదేశ్ హైకోర్టు ఆయనపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఎట్టిపరిస్థితుల్లోనూ నాలుగు గంటల్లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాష్ట్ర డీజీపీకి సూచించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో విఫలమైతే కోర్టు ధిక్కార చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కొంత సమయం ఇవ్వాలని అడ్వొకేట్ జనరల్ కోర్టుకు విజ్ఞప్తి చేయగా న్యాయస్థానం నిరాకరించింది. మరోవైపు మహిళా కమిషన్ చైర్ పర్సన్ స్పందిస్తూ.. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు ఇలాంటి ప్రకటనలు చేయడం చాలా దురదృష్టకరమన్నారు. ఈ తరహా వ్యాఖ్యలు మహిళల పట్ల అవమానకరమైనవి, ఆమోదయోగ్యం కానివన్నారు. ఈ వ్యాఖ్యలు మన సమాజంలోని మహిళల గౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా, జాతీయ భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్న దేశ కుమార్తెలను కూడా అవమానించేవని అభిప్రాయపడ్డారు. కల్నల్ ఖురేషి ధైర్యవంతమైన నిబద్ధత గల అధికారి అని.. ఆమెను దేశవ్యాప్తంగా ఆరాధిస్తారని పేర్కొన్నారు. సోఫియా వంటి ధైర్యవంతమైన మహిళలకు భారత్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. సోఫియా ఖురేషి దేశానికి గర్వకారణమైన ఆడబిడ్డ.. ఆమె ప్రతి దేశభక్తిగల భారతీయుడికి సోదరి లాంటిదన్నారు. దేశ కోసం ఎంతో అంకితభావంతో పని చేసిన ఆమెపై ఇటువంటి అవమానకరమైన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు.

## ఓరుగల్లు.. అందాల జల్లు..

అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. వరంగల్ హరిత హోటల్లో బస చేసిన వీరు, సంప్రదాయ చీరకట్టులో హోటల్ ముందు బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..బంగారు బతుకమ్మ ఉయ్యాలో..అని పాటలుపాడుతూ బతుకమ్మ ఆడారు. ప్రపంచ సుందరీమణుల రాకతో వరంగల్ లో కోలాహలం మొదలైంది. హరిత హోటల్ దగ్గర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు లావణ్య, డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వారికి స్వాగతం పలికారు.అనంతరం 22 మంది సుందరీమణులు వేయిస్తంభాల గుడి, ఖిలా వరంగల్ ను సందర్శించారు. ఆ తర్వాత ములుగు జిల్లా రామప్పకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర ఎస్పీ శబరిష జిల్లా అధికారులు టూరిజం శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. గుస్సాడీ నృత్య ప్రదర్శన ఒగ్గుడోలు ప్రదర్శన ద్వారా కళాకారులు వారికి ఆత్మీయ స్వాగతం పలికారు. రామప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నీరజ్ చోప్రాకు అరుదైన గౌరవం

**భారత స్టార్ జావెలిన్ త్రోయర్కు టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ హెూదా**

అమల్లోకి వస్తుందని అధికారిక ప్రకటనలో తెలిపింది. నీరజ్ చోప్రా గతంలో భారత సైన్యంలో సుబేదార్గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. టోక్యో ఒలింపిక్స్లో నీరజ్ స్వర్ణ పతకం సాధించి చరిత్ర సృష్టించాడు. అనంతరం ఇతడిని కేంద్ర ప్రభుత్వం 'పరమ విశిష్ట సేవా పతకం'తో సత్కరించింది. భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్చంద్ ఖేల్రత్న పురస్కారాన్ని 2021లో అందుకున్న నీరజ్ చోప్రా.. 2022లో పద్మశ్రీ అవార్డును స్వీకరించాడు. గతేడాది జరిగిన పారిస్ ఒలింపిక్స్లో ఈ బల్లెం వీరుడు రజత పతకం సొంతం చేసుకున్నాడు. నీరజ్ మే 16న దోహా డైమండ్ లీగ్లో, జూన్ 24న ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ 2025 అథ్లెటిక్స్ మీట్లో పోటీపడనున్నాడు. నీరజ్ కంటే ముందు పలువురు సెలబ్రిటీలు టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ స్థాయి అధికారులుగా ఉన్నారు. ఈ జాబితాలో స్టార్ నటుడు మోహన్ లాల్, భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ, సచిన్ పైలట్, కపిల్ దేవ్, అనురాగ్ ఠాకూర్, అభినవ్ బింద్రా ఉన్నారు.

# నేతలు చెప్పినట్టు ప్రాజెక్టులు కట్టొద్దు



పత్రాలు అందజేశారు.హైదరాబాద్: ప్రాజెక్టుల నాణ్యత విషయంలో ఇంజినీర్లు ఎవరి ఒత్తిళ్లకు లొంగవద్దని సీఎం రేవంత్రెడ్డి సూచించారు. హైదరాబాద్ జలసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కొలువుల పండుగ కార్యక్రమంలో నీటిపారుదల శాఖలో ఏఈ, జేటీవో పోస్టులకు ఎంపికైన వారికి సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. "ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రాష్ట్రానికి ఎప్పుడూ ప్రాధాన్యత ఇచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలోనే ఏపీలో భారీ ప్రాజెక్టులకు నెహ్రూ శంకుస్థాపన చేశారు. నెహ్రూ శంకుస్థాపన చేసిన నాగార్జునసాగర్, శ్రీశైలంతోనే మనకు నీళ్లు అందుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం 50, 60 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాజెక్టులే ఈనాటికి మనకు నీళ్లు ఇస్తున్నాయి. నాగార్జున సాగర్, శ్రీరామ్సాగర్ ఎన్నో వరదలు, ఉపద్రవాలను తట్టుకుని నిలబడ్డాయి. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టిన కాళేశ్వరం మాత్రం మూడేళ్లలోనే కూలింది. కట్టిన మూడేళ్లలోనే కూలిన ప్రాజెక్టు ప్రపంచంలో మరెక్కడా లేదు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరంతో అదనంగా వెయ్యి ఎకరాలకు కూడా నీరు అందలేదు. కనీసం మట్టి పరీక్షలు కూడా చేయకుండా ప్రాజెక్టు నిర్మించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ది" అని సీఎం రేవంత్రెడ్డి విమర్శించారు. ఎస్ఎల్బీసీ, సీతారామ, దేవాదుల, నెట్టెంపాడు, సమ్మక్క సారక్క ప్రాజెక్టులను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేస్తామన్నారు. గ్రూప్-1 నియామకాలు అడ్డుకోవడం వెనుక ఉన్న రాజకీయ నాయకులు ఎవరో ప్రజలకు తెలుసన్నారు. త్వరలోనే గ్రూప్స్ నియామకాలు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళిక ప్రకారం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ అనుమతులు

### సమగ్ర అధ్యయనంతో త్వరగా నివేదిక సమర్పించాలి

### అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో చేపట్టే వివిధ రకాల నిర్మాణాలు, ఇతర సదుపాయాల కల్పనకు సంబంధించిన పౌర సేవలు, అనుమతుల ప్రక్రియ సరళంగా, సులభతరంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ చెప్పారు. ఇందుకు సంబంధించి సమగ్ర అధ్యయనంతో సాధ్యమైనంత త్వరగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో పౌర సేవలు, అనుమతుల మంజూరు వంటి అంశాలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి గారు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగు రోడ్డు పరిధిలోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్లో వివిధ రకాల నిర్మాణాలకు ప్రజలు పలు విభాగాలకు దరఖాస్తులు చేసుకొని ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే ప్లాట్ఫామ్పై దరఖాస్తు చేసుకుని సింగిల్ విండోలో అనుమతి లభించేలా వ్యవస్థ ఉండాలని ఆదేశించారు. ఇందుకు రెవెన్యూ, పురపాలక, జల వనరులు, నీటి సరఫరా, మురుగు నీటి పారుదల, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ తదితర విభాగాలు సంయుక్తంగా పని చేయాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. ఆయా శాఖలు వసూలు చేసే బిల్లులు సైతం ఒకేసారి, ఒకే విండో ద్వారా చెల్లించే విధానానికి రూపకల్పన జరగాలన్నారు. వినియోగదారులు చెల్లించే మొత్తాన్ని ఆయా విభాగాల ఖాతాల్లో జమయ్యే విధానాన్ని రూపొందించాలన్నారు. ఈ క్రమంలో ఆస్తులు, వనరుల గుర్తింపునకు లైడార్ సర్వే చేయాలని, మరింత సులభతర విధానాల అధ్యయనానికి నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు.అనుమతుల ప్రక్రియలో అనవసరమైన జాప్యం జరగరాదని, ఏ కారణం లేకుండా అనుమ తులను నిరాకరించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఏదైనా కారణం చేత అనుమతులకు ఆలస్యమైతే వివరాలను దరఖాస్తుదారుడి తెలియజేసి వాటి పరిష్కారానికి మార్గాలను కూడా అధికారులే సూచించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తో పాటు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఈ ఏడాది వానలే వానలు

ప్రవేశించాయి. ఇంత త్వరగా రావడం గత ఏడు సంవత్సరాల్లో ఇదే తొలిసారి. ఈ కారణంగా.. ఆల్రెడీ అండమాన్ సముద్రం దగ్గర మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ గాలులు ఇప్పుడు కేరళవైపు తమ ప్రయాణం సాగిస్తాయి. ఇవి మే 27 నాటికి కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా. ఐతే.. ఇప్పటికే కేరళతోపాటూ.. దక్షిణాది రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి. నైరుతీ ఆగమన సమయంలో ఇలా వర్షాలు కురుస్తుండటం కలిసొచ్చే అంశం.వాతావరణంలో వచ్చిన మార్పులు.. ఈ సంవత్సరం అతి భారీ, కుండపోత వర్షాలు కురిపించేందుకు అనుకూలంగా ఉన్నాయి. పైగా నాలుగు రోజులు ముందే వస్తున్నాయి కాబట్టి.. ఈ సంవత్సరం సాధారణంగా కంటే కొంత ఎక్కువగా.. 104 శాతం వర్షం కురిసే అవకాశం ఉంది అని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది.

## పాక్ దాడుల్లో దెబ్బతిన్న ఇళ్లను పునర్నిర్మిస్తాం..

నిర్మించాలనే డిమాండ్ను కేంద్రంతో చర్చిస్తానని చెప్పారు. ఈ ప్రాంతంలో దెబ్బతిన్న ఇళ్లను పునర్నిర్మించుకోవడానికి ప్రజలకు సాయం అందించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఉరీ ప్రాంతంలోని ప్రజలు అనేకసార్లు బాధను భరించారని.. అయితే, ప్రతిసారి ఎంతో ధైర్యంతో తిరిగి కోలుకున్నారని అబ్దుల్లా అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ దళాలు సరిహద్దుల్లోని ప్రజలకు ఎక్కువ హాని తలపెట్టాలనే ఉద్దేశంతోనే దాడులు చేశాయని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. ప్రస్తుతం కాల్పుల విరమణ ఒప్పందం అమలవుతండటం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతాలు రెండు రోజులుగా నిశ్శబ్దంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో నష్టాన్ని అంచనా వేస్తున్నామని.. బాధితులందరికీ సాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

## మన పోరాట స్ఫూర్తి అభినందనీయం

దళాదిపతులు భేటీ అయ్యారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పం దనగా భారత్ బలగాలు ఆపరేషన్ సిందూం"ను విజయవంతంగా పూర్తి చేసిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన వివరాలను అధికారులు రాష్ట్రపతికి వివరించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా త్రివిధ దళాలు పోరాడిన తీరును ఈసందర్భంగా అభినం దించారు.

## సింధూ జలాలపై పునఃసమీక్షించండి..

పర్యటకులపై ఉగ్రదాడి అనంతరం సింధూ జలాల ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్లు భారత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సింధూ, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి వరల్డ్ బ్యాంకు మధ్యవర్తిత్వంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందంపై అప్పటి భారత ప్రధాని నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ సంతకాలు చేశారు. ఈ డీల్ ప్రకారం సింధు ఉప నదుల్లో తూర్పున పారే రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారత్ కు హక్కులు లభించాయి. సింధూ నదితోపాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్లపై పాకిస్థాన్కు హక్కులు దక్కాయి.


# 52వ సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయ్

గవాయ్ రాజ్యసభ మాజీ సభ్యుడు. మహారాష్ట్రలో ప్రముఖ నేత. బీఆర్ గవాయ్ నాగ్పూర్ యూనివర్శిటీలో లా డిగ్రీ పొందారు. 25 ఏళ్ల వయసులో 1985 మార్చి 16న న్యాయవాదిగా కెరీర్ మొదలుపెట్టారు. వృత్తిలో రాణిస్తూ అంచెలంచెలుగా ఎదిగిన ఆయన 2003 నవంబరులో బాంబే హైకోర్టులో అడిషనల్ జడ్జిగా నియమితులయ్యారు. 2005 నవంబర్ నెలలో శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ముంబై, నాగ్పూర్, ఔరంగాబాద్, పనాజీ ధర్మాసనాల్లో బీఆర్ గవాయ్ న్యాయమూర్తిగా సేవలందించారు. ఈ క్రమంలో 2019 మే 24న సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. దాదాపు గత ఆరేళ్ల కాలంలో ఆయన కొన్ని వందల ధర్మాసనాల్లో భాగస్వామ్యం పంచుకొని ఎన్నో రాజ్యాంగ, సివిల్, క్రిమినల్ చట్టాలు, ఆర్బిట్రేషన్, వాణిజ్య వివాదాలు విద్య, పర్యావరణం లాంటి పలు కేసుల విచారణ చేపట్టారు. తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లోకి ఫిరాయించిన పిటిషన్లను గవాయ్ బెంచ్ విచారిస్తున్న విషయం తెలిసిందే. 51వ సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవి విరమణ చేయడం, తన తరువాత బీఆర్ గవాయ్ పేరును సిఫార్సు చేశారు. 52వ సీజేఐగా ఇటీవల నియమితులైన జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం నాడు రాష్ట్రపతి భవన్లో ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టులో జస్టిస్ భూషణ్ గవాయ్ కీలక తీర్పులు ఇచ్చారు. 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయాన్ని సమర్థించిన సుప్రీంకోర్టు ధర్మాసనంలో గవాయ్ సభ్యులు. నోట్ల రద్దు కేసు గురించి జస్టిస్ గవాయ్ తీర్పు చెబుతూ.. 'భారతీయ రిజర్వ్ బ్యాంక్ చట్టంలోని సెక్షన్ 26(2) కింద ఇచ్చిన అధికారాలను ఉపయోగించి అన్ని రకాల నోట్లను నిషేధించవచ్చు. ఈ విభాగంలో ఉపయోగించిన 'ఏదైనా' అనే పదాన్ని పరిమితంగా కాకుండా విస్తృత కోణంలో అర్థం చేసుకోవాలి' అని వ్యాఖ్యానించారు. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) రిజర్వేషన్ ఫ్రేమ్వర్క్లో ఉప-వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా అనుమతించొచ్చని 2024లో సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చింది. జస్టిస్ భూషణ్ గవాయ్ ఈ ధర్మాసనంలో భాగం. ఈ కేసులో భాగంగా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ నిబంధనను ప్రవేశపెట్టాలని తీర్పు చెప్పిన వారిలో జస్టిస్ గవాయ్ ఒకరు. ఈ కేసు తీర్పులో భాగంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ 'రాజ్యాంగంలో పొందుపరిచినట్లుగా ప్రతి ఒక్కరినీ సమానంగా చూసేలా ఈ దశ సహాయపడుతుంది. అయితే, ఇతర వెనుకబడిన తరగతుల(ఓబీసీలు) మాదిరిగానే షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) కోసం కూడా క్రీమీలేయర్ను అమలు చేయడానికి ప్రభుత్వం నిర్దిష్ట ప్రమాణాలను రూపొందించాలి. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రమాణాలు భిన్నంగా ఉండవచ్చు' అని అన్నారు. జమ్మూ కశ్మీర్కు ప్రత్యేక హోదాను కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసినప్పుడు, ఆ నిర్ణయాన్ని కొందరు సుప్రీం కోర్టులో సవాలు చేశారు. అయితే, కేంద్ర ప్రభుత్వ చర్యను సమర్థిస్తూ సుప్రీంకోర్టు డిసెంబర్ 2023లో తీర్పును వెలువరించింది. ఈ తీర్పు ఇచ్చిన రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ భూషణ్ గవాయ్ కూడా ఒకరు.'ఎలక్టోరల్ బాండ్ స్కీం' రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించిన సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలోనూ గవాయ్ సభ్యులు. దాతల వివరాలు చెప్పకపోవడమనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(జీ) కింద పౌరుల సమాచార హక్కును ఉల్లంఘిస్తోందని ఈ ధర్మాసనం అభిప్రాయపడింది.ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్లలో నిందితుల ఇళ్ల కూల్చివేతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనానికి జస్టిస్ గవాయ్ నాయకత్వం వహించారు.కూల్చివేతలను ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది, తగిన ప్రక్రియను పాటించకుండా ఆస్తులను ధ్వంసం చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంది. నిందితుల ఇళ్లపై ఇటువంటి చర్యలు తీసుకునే ముందు అనుసరించాల్సిన విధానపరమైన చర్యలను కోర్టు నిర్దేశించింది. ఈ మార్గదర్శకాలను దేశవ్యాప్తంగా వర్తింపజేయడం జరిగింది. ఈ నియమాలను అమలు చేయడానికి తగిన సర్క్యులర్లను జారీ చేయాలని అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను కూడా సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. రాహుల్ గాంధీపై దాఖలైన పరువు నష్టం కేసులో సూరత్ సెషన్స్ కోర్టు ఆయనకు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, గరిష్ఠ శిక్ష విధించడానికి దిగువ కోర్టు నిర్దిష్ట కారణాలను అందించలేదని పేర్కొంటూ సుప్రీంకోర్టు శిక్షను నిలిపివేసింది. జస్టిస్ భూషణ్ గవాయ్ నేతృత్వంలోని బెంచ్ ఈ కేసును విచారించింది. అయితే, విచారణ సమయంలో జస్టిస్ గవాయ్ తన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో ఉన్న దీర్ఘకాల అనుబంధాన్ని పేర్కొంటూ స్వచ్ఛందంగా కేసు నుంచి తప్పుకునేందుకు ముందుకొచ్చారు. చివరికి, కేసును గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనమే విచారించింది. జస్టిస్ భూషణ్ గవాయ్ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం 2023లో సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్కు బెయిల్ మంజూరు చేసింది. 2002లో గుజరాత్ అల్లర్లకు కుట్ర పన్నారనే ఆరోపణలు తీస్తాపై ఉన్నాయి. 'లిక్కర్ స్కాం' కేసులో అరెస్టయిన ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు 2024లో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తులు భూషణ్ గవాయ్, కె.వి. విశ్వనాథన్లతో కూడిన ధర్మాసనం ముందు సిసోడియా బెయిల్ విచారణ జరిగింది. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో, 17 నెలలు కస్టడీలో గడిపిన సిసోడియా జైలు నుంచి విడుదలయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తికి సంబంధించి సోషల్ మీడియా ఎ÷-లాట్ఫాం 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేసి సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని సుప్రీంకోర్టు భావించింది. ఈ విషయాన్ని కోర్టు సుమోటోగా స్వీకరించింది. ఈ కేసును న్యాయమూర్తులు అరుణ్ మిశ్రా, భూషణ్ గవాయ్, కృష్ణ మురారిలతో కూడిన ధర్మాసనం విచారించింది.

# భారత్లో మరో సెమీ కండక్టర్ యూనిట్

క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.ఈ సెమీకండక్టర్ యూనిట్ నిర్మాణంతో దాదాపు 2వేల మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు. సెమీ కండక్టర్ యూనిట్లలో నెలకు 3.6 కోట్ల చిప్లను ఉత్పత్తి చేస్తామని పేర్కొన్నారు. కండక్టర్లకు వాడే పరికరాలు కూడా భారత్లో తయారు చేయడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం దాదాపు 60 శాతం సెమీకండక్టర్ల పరికరాలను అమెరికా కంపెనీలే ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు.ఈ సాంకేతికతపై దాదాపు 70 స్టార్టప్లు పని చేస్తున్నాయని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కొత్త విద్యా విధానం ద్వారా అకడమిక్ విద్య, పరిశ్రమల అనుసంధానానికి అవకాశాలు ఉన్నాయన్నారు. పరిశ్రమల అవసరాల మేరకు విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 270 విద్యా సంస్థల్లో విద్యార్థులకు సెమీ కండక్టర్ల సాంకేతికతపై శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు రూపొందించిన చిప్లను మొహాలీలో ఉత్పత్తి చేశారని..వాటి తయారీలో గణనీయమైన మార్పులు వచ్చినట్లు పేర్కొన్నారు. టెలికాం విభాగం కోసం యూనివర్సిటీలో 5జీ ల్యాబ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం యూనివర్సిటీల్లో ఇన్క్యుబేటర్ల ఏర్పాటు జరుగుతోందని అన్నారు.

**ఉగ్రవాద కట్టడి పుస్తకాన్ని భారత్ పునర్ లిఖిస్తోంది: కేంద్ర మంత్రి**



పహల్గాం ఘటన అమాయక ప్రజలపై జరిగిన దాడి కాదని.. అది భారత్ మనస్సాక్షిపై జరిగిన దాడి అని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.పాకిస్థాన్లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు. బుధవారం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలో ఆయన ఈమేరకు మాట్లాడారు.'పహల్గాంలో జరిగిన ఊచకోత అమాయక ప్రజల జీవితాలపై జరిగిన దాడి మాత్రమే కాదు. అది భారతదేశ మనస్సాక్షిపై జరిగిన దాడి. దానికి ప్రతిస్పందనగా ఉగ్రవాద కట్టడి పుస్తకాన్ని తిరిగిరాయాలని భారత్ నిర్ణయించుకుంది. ప్రధాని మోదీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్ చేపట్టాం. ఉగ్రవాదాన్ని సహించేది లేదనే గట్టి సందేశాన్ని పాకిస్థాన్కు ఇచ్చాం' అని వైష్ణవ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆపరేషన్ సిందూర్లో మోదీ తీసుకున్న పలు కీలక చర్యల గురించి వైష్ణవ్ ప్రస్తావించారు. పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం భారత్- పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈక్రమంలో భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్లో ఉగ్రస్థావరాలే లక్ష్యంగా దాడులు చేసింది. అది జీర్ణించుకోలేని పాకిస్థాన్.. జమ్మూకశ్మీర్లోని సరిహద్దు గ్రామాల ప్రజలపై దాడులకు పాల్పడింది. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రతరమయ్యాయి. ఇటీవల ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరగా.. ప్రస్తుతం అది కొనసాగుతోంది.

# వెయ్యిస్తంభాల గుడిలో అందగత్తెలు

- ఆధ్యాత్మిక శోభ, చారిత్రాత్మక నేపథ్యం తెలుసుకున్న అందాల భామలు
- స్వాగత గీతంతో ఆహ్వానం పలికిన చిన్నారులు



**వరంగల్, మహబూబాబాద్ ప్రతినిధులు, మే 14 (జనం సాక్షి):** చారిత్రాత్మక ఓరుగల్లు నగరంలోని వేయి స్తంభాల దేవాలయాన్ని సందర్శించారు. పరమ శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రపంచం సుందరీ మనులు, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో విచ్చేసిన అందాల భామలకు ఆలయ సాంప్రదాయం ప్రకారం సంస్కృతిలో భాగంగా దైవిక సంబంధమైన ఆధ్యాత్మికంగా రుద్రేశ్వర స్వామికి నంది విగ్రహం గొప్పతనాన్ని సంప్రదాయ బద్దంగా పూజలు నిర్వహించి అందాల భామలను అలరింప చేశారు. ప్రపంచ సుందరీమణులకు తెలంగాణ చీరకట్టు, పట్టుచీరను ధరింపచేసి పర్యటకశాఖ తెలుగుతనాన్ని ఉట్టిపడేలా తెలంగాణ వారసత్వాన్ని అలరింప చేసేనా ధరింపచేసి ఆలయంలో సందడి చేశారు.

వరంగల్ అంటేనే వేయి స్తంభాల గుడి, భద్రకాళి ఆలయం కాకతీయుల సామ్రాజ్యానికి సంబంధించిన చారిత్రాత్మక నేపథ్యమున్న ప్రాంతంగా విలసిల్లిన ఈ నేలపై ప్రపంచంలోనే వివిధ దేశాలకు చెందిన సుందరిమణులు 1000 స్తంభాల గుడి ఆలయాన్ని రుద్రేశ్వరుని మండపాన్ని సందర్శించి భక్తి భావంతో సంప్రదాయ సిద్ధంగా తెలంగాణ సంస్కృతిలో భాగంగా చీరకట్టు తో ప్రపంచ సుందరిమణులు పూజలు నిర్వహించి ఆలయ విశిష్టతను రుద్రేశ్వరుడి మహిమను పర్యటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భాష అనువాదకులు గైడ్ల సహాయంతో ఆలయ నేపథ్యాన్ని స్థల విశిష్టతను స్థల పురాణాన్ని వారికి వివరించి చెప్పడంతో సుందరిమణులు మైమరిచిపోయారు వందల సంవత్సరాలుగా ఆలవాలమైన పోరుగల్లు కట్టడం చూపరులను ఆకట్టుకుంటూ చరిత్ర కలిగి ఉండడం అందాల భామలు అబ్బురపడ్డారు. వరంగల్ నగరం అందాల భామలకు ఆతిథ్యం ఇవ్వడంతో రుద్దేశ్వరుడు నందీశ్వరుల విగ్రహాలను కూడా ప్రసన్నం చేసుకున్నారు ఈ నేపథ్యంలో 1000 స్తంభాల ఆలయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పర్యటకశాఖ ఆధ్వర్యంలో వచ్చిన సుందరీమణులకు అత్యంత ప్రాధాన్యతతో పర్యటనను సజావుగా నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా పోలీస్ యంత్రాంగం, రెవెన్యూశాఖ మూడంచల భద్రతతో పర్యటన సజావుగా జరిగేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాకతీయుల కాలం నాటి పురాతన కట్టడాలను సందర్శించి కాకతీయులు గొప్పతనాన్ని వారి చరిత్రను తెలుసుకున్న సుందరీమణులు మైమరిచి మురిసిపోయారు. వేయి స్తంభాల గుడి పర్యటన అధికారులు చేపట్టిన మాంత్రాంగంతో ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా ముగిసింది..

### సుందరీమణులకు ఘనస్వాగతం

చారిత్రాత్మక నేపథ్యం ఉన్న ఓరుగల్లు నగరానికి ప్రపంచ సుందరీమణులు బుధవారం సాయంత్రం హనుమకొండలోని హరిత కాకతీయ హెూటల్లో జిల్లా అధికారులు, వరంగల్ కలెక్టర్ సత్య శారదా దేవి, హన్మకొండ కలెక్టర్ ప్రావీణ్య ఆధ్వర్యంలో ప్రపంచ సుందరీమణుల పోటీదారులకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా సుందరీ మణులకు బతుకమ్మలు వివిధ సంగీత వాయిద్యాలతో పూలమాలలు ధరింపచేసి పూలు చల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణలో ప్రపంచ సుందరి మనుల పోటీల సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పర్యటనలో భాగంగా ఓరుగల్లు నగరానికి ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు హరిత కాకతీయ హెూటల్ కు రాగానే పోలీస్ అధికారులు జిల్లా ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికి హెూటల్లో వారికి ఘనంగా ఏర్పాట్లు చేశారు.



## సరస్వతీ పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు

- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజా రామయ్యార్

**కాళేశ్వరం, మే 14,( జనం సాక్షి)** 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరిగే సరస్వతి పుష్కరాల సందర్భంగా విచ్చేస్తున్న భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ తెలిపారు. బుధవారం సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రేపు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరస్వతి మాతా విగ్రహం, ఘాట్ ప్రారంభోత్సవం చేస్తారని, పుష్కర స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకుంటారని, అనంతరం త్రివేణి సంగమంలో మొట్ట మొదటి సారిగా కాశీ పండితులు నిర్వహించనున్న నదీ హారతిలో పాల్గొంటారని తెలిపారు. మన రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా పెద్ద ఎత్తున పుష్కరాలు నిర్వహిస్తున్నామని జిల్లా యంత్రాంగం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అధికారులు అప్రమ త్తంగా ఉండాలని, భక్తుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## జీవన్ రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట

- భూకబ్జా కేసులో సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్
- దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని షరతులు

**న్యూఢిల్లీ, మే 14 (జనంసాక్షి) :** ఆర్మూర్ మాజీ శాసనసభ్యుడు జీవన్ రెడ్డికి సర్వోన్నత న్యాయస్థానంలో ఊరట లభించింది. మొయినాబాద్ ప్రాంతంలో ప్రైవేటు భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారన్న ఆరోపణలకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ వ్యవహారంలో దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. గతంలో ఇదే భూ వివాదానికి సంబంధించి జీవన్ రెడ్డి దాఖలు చేసుకున్న పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. దర్యాప్తు ప్రక్రియకు సంపూర్ణంగా సహకరించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ జీవన్ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టులో ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా, జీవన్ రెడ్డి తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది, ఇదే కేసుకు సంబంధించి ఆయన కుటుంబ సభ్యులకు ఇప్పటికే బెయిల్ లభించిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ పార్థివాలా నేతృత్వంలోని ధర్మాసనం, జీవన్ రెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని, విచారణ ప్రక్రియలో ఎటువంటి ఆటంకాలు కల్పించరాదని స్పష్టం చేసింది. ఒకవేళ దర్యాప్తునకు సహకరించని పక్షంలో, సంబంధిత విచారణాధికారులు చట్టప్రకారం తగిన చర్యలు తీసుకునేందుకు సుప్రీంకోర్టు వెసులుబాటు కల్పించింది.

## రిజర్వాయర్ల పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దు
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**పాలకుర్తి, మే 14(జనంసాక్షి) :** పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పురోభివృద్ధిపై నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకు ముందు పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెన్నూరు రిజర్వాయర్లో మిగిలిన లైనింగ్ పనులు వారు రోజుల్లో పూర్తి చేయాలని అన్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేస్తే నీటి నిల్వలు పెరుగుతాయని అన్నారు. లైనింగ్ పనులు పూర్తి కాగానే తాను వచ్చి పరిశీలించనున్నట్లు తెలిపారు. అదికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని అన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## సరస్వతీ నది పుష్కరాలు- 2025 పోస్టర్ విడుదల చేసిన మంత్రి సురేఖ



**హైదరాబాద్, మే 14 (జనంసాక్షి) :** తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుండి 26– వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాలు కోసం తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారిక పోస్టర్ను అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా పర్యవరణ పరిరక్షణ ఆవశ్యతని సూచిస్తూ తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారిక పోస్టర్ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ, నదులను పరిరక్షించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లు నిషేదించడం, బట్టలు ఉతకడం, వ్యర్థాలను సరిగ్గా నిర్వహణ నీటి కాలుష్యం నుండి చర్మ వ్యాధులను నివారించడానికి పరిసరాలను శుభ్రంగా ఉంచడం అవసరాన్ని నొక్కి చెప్పారు. ప్రజా రవాణాను ఉపయోగించడం వల్ల వాహన కాలుష్యం, రద్దీ తగ్గుతుందని తెలిపారు. మనం సమిష్టి బాధ్యత తీసుకొని మన పర్యావరణాన్ని కాపాడుకోవడానికి పుష్కరాల పవిత్రతను కాపాడుకోవడానికి చేతులు కలపాలని మంత్రి కొండా సురేఖ అన్నారు.

## ముఖ్యమంత్రి రాక సందర్భంగా పటిష్ట భద్రతా ఏర్పాటు



**కాళేశ్వరం, మే 14 (జనం సాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి గురువారం కాళేశ్వరం పర్యటనకు రానున్న సందర్భంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, ముఖ్యమంత్రి భద్రతా అధికారి వాసుదేవరెడ్డి తెలిపారు. బుధవారం కాళేశ్వరంలో ఈఓ కార్యాలయంలో ముఖ్యమంత్రి పర్యటనపై అధికారులతో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలెవ్వరూ అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. హెలికాప్టర్ ద్వారా గురువారం సాయంత్రం 5 గంటలకు కాళేశ్వరం చేరుకుంటారని ముఖ్యమంత్రి రవాణా చేయు మార్గంలో పోలీస్ బందోబస్తు, బాంబ్ స్క్వాడ్, ట్రాఫిక్ కంట్రోల్, ఆయా విభాగాల సమన్వయంతో భద్రతా చర్యలు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డిఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాల సేవలు వినియోగించనున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, ప్రత్యామ్నాయంగా జనరేటర్ సిద్ధంగా ఉంచాలని విద్యుత్ అధికారులకు సూచించారు. బందోబస్తు ప్రతి ఒక్కరి బాధ్యతని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ రవి, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్‌లకు జీవన భృతి కల్పిస్తాం




**హైదరాబాద్, మే 14 (జనంసాక్షి) :** సమాజంలో ట్రాన్స్ జెండర్ లకు గౌరవమైన జీవన భృతి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, చంద్ర కాంత్ రెడ్డి లు అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్‌లో ట్రాన్స్ జెండర్‌ల ప్రతినిధులు, ఎన్‌జిఓలతో యుసిడి విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ట్రాన్స్ జెండర్‌ల సేవలను జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాలలో వినియోగించే అంశంపై వారి సూచనలు, అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్‌ల ఆసక్తి, అర్హతల మేరకు జీహెచ్ఎంసీలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి చేపట్టే చర్యల్లో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జీహెచ్ఎంసీలో మాత్రమే కాకుండా ఇతర విధాల ఉపాధి పొందడానికి వారికి శిక్షణలు కూడా ఇస్తారని తెలిపారు. యుసిడి అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జీహెచ్ఎంసీలో పలు ఉద్యోగ అవకాశాలు, ట్రాన్స్ జెండర్ వినియోగించుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే ముఖ్యమంత్రి నిర్ణయమని, అందుకు తమ తమ విద్యా అర్హతలు, నైపుణ్యత, ఆసక్తుల మేరకు అనువైన రంగాన్ని ఎంచుకోవాలని, దానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ఉద్యోగ అవకాశాలు కు అర్హత లేని ట్రాన్స్ జెండర్లను స్వయం సహాయక గ్రూపులు ఏర్పాటు చేసి ఆర్థిక ఎదుగుదలకు దోహద పడే విధంగా కూడా జిహెచ్ఎంసి కృషి చేస్తుందన్నారు ఇప్పటికే మూడు ట్రాన్స్ జెండర్‌ల ఎస్‌హెచ్‌జి గ్రూపులను ఏర్పాటు చేసి బ్యాంకు లింకేజీ లభించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరిన్ని ఎస్‌హెచ్‌జి గ్రూప్ ల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం గొప్ప నిర్ణయం తీసుకుందన్నారు. జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల్లో పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా వివిధ ఎన్‌జీఓల ద్వారా పలు రంగాల్లో శిక్షణనిచ్చి స్వయం ఉపాధికి చేయుతనివ్వనున్నట్లు తెలిపారు. సెక్యూరిటీ గార్డ్స్, క్లీన్ డ్రైవ్ అమలులో గ్రీన్ మార్షల్స్, పార్కులు, హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బి రిజర్వాయర్ల వద్ద, స్పోర్ట్స్ గ్రౌండ్స్ వద్ద సెక్యూరిటీ గార్డ్ లుగా, మెట్రో స్టేషన్ లో ఉద్యోగ అవకాశాలు, అమృత్ స్కీం కింద నీటి నాణ్యత పరీక్షలో సహకారం, శిక్షణ అనంతరం స్ట్రీట్ లైట్ల నిర్వహణ, బస్తీ దవాఖానాలలో ప్యారా మెడికల్ గా ఉపాధి పొందే అవకాశం ఉందని, అర్హత గల వారందరిని భర్తీ చేస్తామన్నారు. స్పోర్ట్స్ అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు మాట్లాడుతూ... స్పోర్ట్స్ విభాగంలో ఎలాంటి విద్యార్హత లేని అభ్యర్థుల నుండి అత్యధిక విద్యార్హతలు ఉన్న వారి వరకు పలు రకాల ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఆయా వివరాలను వివరించారు. సమావాశానికి హాజరైన ట్రాన్స్ జెండర్ ఎన్‌జిఓలు పలువురు ఈ సందర్భంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా అందిస్తున్న శిక్షణలను వారికి వివరించారు. ఆయా శిక్షణ సంస్థలు ఇస్తున్న ట్రైనింగ్స్, మార్కెట్ లింకేజి తదితర విషయాలను వివరించారు. పలువురు ట్రాన్స్ జెండర్ ల ప్రతినిధులు వారి వారి అభిప్రాయాలను తెలియజేయడంతో పాటు ఉద్యోగ ఉపాధి తో జీవనోపాధికి సంబంధించిన వివిధ అంశాల పై గల సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్.పి శ్రీనివాస్, హార్టికల్చర్ ఆఫీసర్ డా. సునంద, అడ్మినిస్ట్రేషన్ జె.సి శ్రీనివాస్, ఎన్.జి.ఓ లు, వివిధ ట్రాన్స్ జెండర్స్ అసోసియేషన్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ ప్రాంతాలపై సైనికదాడులు అమానవీయం

- పీస్ డైలాగ్ కమిటీ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** శత్రు దేశంతో చర్చలతో సమస్యలు పరిష్కారం చేసుకుంటున్నపుడు మధ్య భారతంలోని ఆదివాసీ ప్రాంతాలపై సైనిక దాడులు చేయడం అమానవీయమని పీస్ డైలాగ్ కమిటీ అభిప్రాయపడింది. గతంలో ప్రభుత్వంపై సాయుధ పోరుకు పూనుకున్న గూర్ఖాలాండ్, నాగాలాండ్, ఇతర సంస్థలతో శాంతి ఒప్పందాలు చేసుకున్న ప్రభుత్వం మావోయిస్టులతో అదే ప్రాతిపాదికన శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేసింది. ఆదివాసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న దాడులను ఆపాలని కోరంది. మావోయిస్టు పార్టీ తో కేంద్ర ప్రభుత్వం మొండి పట్టుదలకు పోకుండా వెంటనే షరతులు లేకుండా సీజ్ ఫైర్ ప్రకటించి కుంబింగ్ ఆపి చర్చల ప్రక్రియను మొదలు పెట్టాలన కోరింది. బీజాపూర్ జిల్లాలో ఇటీవల జరిగిన 22 ఎన్‌కౌంటర్ మరణాలపై అనుమానాలు బలంగా వ్యక్తం అవుతున్న కారణంగా సుప్రీం కోర్టు వెంటనే సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని కోరింది. రాష్ట్రపతి వెంటనే జోక్యం చేసుకుని కగార్ ఆపరేషన్ ఆపి చర్చలకు ప్రభుత్వం ను ఒప్పుకునేలా సూచన చేయాలని కోరారు. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ 6 నెలల కాల్పుల విరమణ ప్రకటించడాన్ని స్వాగతంచింది. ఈ కాల్పుల విరమణ సమయంలో కొన్ని వార్తలు వస్తున్నాయని, ఇన్ ఫార్మర్ల పేరున కొన్ని హత్యలు జరిగినట్టు మీడియాలలో కథనాలు వస్తున్నాయని, మావోయిస్టు పార్టీ కూడా చర్చల వాతావరణానికీ భంగం కలిగించే ఎటువంటి భౌతిక చర్యలకు దిగకూడదని పీస్ డైలాగ్ కమిటీగా మావోయిస్టు పార్టీకి సూచించింది. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీ వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు చేయాలని పీస్ డైలాగ్ కమిటీ గత 2 నెలలుగా రౌండ్ టేబుల్ సమావేశాలు, ప్రెస్‌మీట్లతో, ర్యాలీలతో ప్రజా అభిప్రాయాన్ని ప్రభుత్వాలకు వివిధ పద్ధతులలో తెలియజేస్తున్నది. కేంద్రాన్ని చర్చలకు ఒప్పించాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున లేఖ రాయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని పీస్ డైలాగ్ కమిటీ కలసి రాష్ట్రంలో ఎన్ కౌంటర్లు , సాయుధ ఘర్షణ లేకుండా సంయమనం పాటించాలని ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలను జరపాలని పీస్ డైలాగ్ కమిటీ కోరింది. దీనికి స్పందనగా మావోయస్టు ఉద్యమం శాంతి భద్రతల సమస్యగా చూడమని అది సామాజీక ఆర్ధిక , రాజకీయ సమస్యగా చూస్తామని తెలిపారు.

## టర్కీ మార్బుల్స్ దిగుమతి నిలిపివేత

**న్యూఢిల్లీ, మే14 (జనంసాక్షి) :** భారత–పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో, పాకిస్థాన్‌కు మద్దతుగా నిలుస్తున్న టర్కీకి వాణిజ్యపరంగా గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పుణేలోని వ్యాపార వర్గాలు టర్కీ నుంచి యాపిల్స్ దిగుమతులను నిలిపివేయగా... అదే కోవలో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ మార్బుల్ వ్యాపారులు టర్కీ నుంచి మార్బుల్ దిగుమతులను పూర్తిగా నిలిపివేయాలని సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ చర్య ద్వారా భారత ప్రభుత్వానికి తమ సంఘీభావాన్ని ప్రకటించడంతో పాటు, దేశీయ మార్బుల్ పరిశ్రమకు ఊతమివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆసియాలోనే అతిపెద్ద మార్బుల్ ఎగుమతి కేంద్రంగా పేరుగాంచిన ఉదయ్‌పూర్‌లో, మార్బుల్ ప్రాసెసర్స్ కమిటీ ఈ మేరకు కీలక తీర్మానం చేసింది. కమిటీ అధ్యక్షుడు కపిల్ సురానా ఈ విషయాన్ని వెల్లడిస్తూ, "పాకిస్థాన్‌కు టర్కీ అందిస్తున్న మద్దతును నిరసిస్తూ, మా కమిటీ సభ్యులందరూ ఏకగ్రీవంగా టర్కీతో వ్యాపార సంబంధాలను తెంచుకోవాలని నిర్ణయించారు" అని తెలిపారు. భారతదేశానికి దిగుమతి అయ్యే మొత్తం మార్బుల్‌లో దాదాపు 70 శాతం టర్కీ నుంచే వస్తుందని ఆయన గుర్తుచేశారు. ఈ నిర్ణయం కేవలం ఉదయ్‌పూర్‌కే పరిమితం కాకూడదని సురానా ఆకాంక్షించారు. "దేశంలోని అన్ని మార్బుల్ సంఘాలు టర్కీతో వాణిజ్యాన్ని నిలిపివేస్తే, అది ప్రపంచానికి ఒక బలమైన సందేశాన్ని పంపుతుంది. భారత ప్రభుత్వం ఒంటరి కాదని, దేశంలోని పరిశ్రమలు మరియు యావత్ భారతీయులు ప్రభుత్వానికి అండగా నిలుస్తారని స్పష్టమవుతుంది," అని ఆయన అభిప్రాయపడ్డారు. టర్కీతో వాణిజ్యం నిలిచిపోవడం వల్ల భారతీయ మార్బుల్‌కు డిమాండ్ గణనీయంగా పెరుగుతుందని, తద్వారా దేశీయ పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని కపిల్ సురానా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ 'బాయ్‌కాట్ టర్కీ' పిలుపు ఇతర రంగాలకు కూడా విస్తరించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్య టర్కీ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపడంతో పాటు, అంతర్జాతీయ వేదికలపై పాకిస్థాన్‌కు మద్దతిచ్చే దేశాలకు ఒక హెచ్చరికగా నిలుస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం టర్కీ అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డోగాన్ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ను కలిసి మద్దతుగా నిలిచారు. అంతేకాదు, ఓ సైనిక రవాణా విమానం నిండా డ్రోన్లను పాక్‌కు అందించినట్టు కథనాలు వచ్చాయి.

## చైనా, టర్కీలు భారత్‌కు శత్రుదేశాలే!

- యుద్ధ సమయాన బయటపడిన చైనా, టర్కీ బుద్ధి
- చైనా, పాకిస్థాన్ మధ్య లోతైన సంబంధాలు
- పాకిస్థాన్‌కి అండగా ఉంటామని చైనా ముందే ప్రకటన

**న్యూఢిల్లీ, మే14 (జనంసాక్షి) :** జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో హిందూ పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడి తర్వాత భారత్ దానికి కారణమైన వారిని శిక్షించేందుకు 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం పాకిస్థాన్ లోపల ఉగ్రవాద కేంద్రాలపై దాడి చేసి, ప్రపంచానికి తన సైనిక శక్తిని చాటింది. ఈ విజయాన్ని అంతర్జాతీయ వేదికపై పంచుకునేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ ఢిల్లీలో 70 దేశాల రక్షణ ప్రతినిధులను ఒక ప్రత్యేక సమావేశానికి ఆహ్వానించింది. కానీ, ఈ సమావేశానికి చైనాను ఆహ్వానించలేదు. ఎందుకంటే.. చైనా.. పాకిస్థాన్‌కి అండగా ఉంటామని ముందే ప్రకటించింది. ఇక పాకిస్థాన్‌కు సన్నిహితంగా మారిన టర్కీని సమావేశానికి భారత్ ఆహ్వానించినప్పటికీ, ఆ దేశ రక్షణ ప్రతినిధి రావడం అవసరం లేదని భావించారు. చైనా, పాకిస్థాన్ మధ్య లోతైన సంబంధాలు ఉన్నాయి. పాకిస్థాన్‌ని నిరంతర స్నేహితుడిలా మారిన చైనా, భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్‌కి ఆయుధాలు సరఫరా చేస్తోంది. అంతేకాదు.. పాక్‌తో కలిసి.. భారత్‌కి వ్యతిరేకంగా చాలా కుట్రలు పన్నుతోంది. అందుకే భారత్ ఈ సమావేశానికి చైనాను పూర్తిగా దూరం పెట్టింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్, పాకిస్థాన్ సరిహద్దులో చైనా తయారుచేసి, ఇచ్చిన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లను ధ్వంసం చేసింది. ఈ సమాచారం చైనా ముందు బహిర్గతం కాకూడదని భారత్ భావించింది. అందుకే ఈ సమావేశానికి చైనాను ఆహ్వానించడం వ్యూహాత్మకంగా సరైనది కాదని నిర్ణయించింది. పాకిస్థాన్‌కు మరో సన్నిహిత స్నేహితుడైన టర్కీని ఈ సమావేశానికి ఆహ్వానించారు, కానీ ఆ దేశ ప్రతినిధి రాకుండా నిరాకరించారు. టర్కీ ఒక జూనియర్ అధికారిని పంపాలని భావించింది, కానీ భారత్ అలాంటి తక్కువ స్థాయి ప్రాతినిధ్యాన్ని అంగీకరించబోమని స్పష్టం చేసింది. దీని అర్థం స్పష్టం. భారత్ ఇప్పుడు దౌత్యపరంగా కూడా తన స్నేహితులు, శత్రువులు ఎవరనే విషయాన్ని నిర్ణయిస్తోంది. ఈ సమావేశంలో లెఫ్టినెంట్ జనరల్ డీఎస్ రాణా 70 దేశాల ప్రతినిధులకు ఆపరేషన్ సిందూర్ విజయాల గురించి వివరించారు. సైన్యం, వాయుసేన, నౌకాదళం, అంతరిక్షం, సైబర్, ఎలక్ట్రానిక్ యుద్ధ సామర్థ్యాలను కలిపి, ఉగ్రవాద కేంద్రాలను ఎలా నాశనం చేశారో వివరించారు. ఈ దాడి కేవలం ఉగ్రవాదులపైనే జరిగిందనీ, పాకిస్థాన్‌లో సామాన్య పౌరులపై కాదని స్పష్టం చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
15 మే 2025
తెలంగాణ

# ఆపరేషన్ సిందూర్: యుద్ధ విరమణతో ఏం సాధించాం?

*భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఇటీవల జరిగిన ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక జారీ చేసిన భారత్, అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఈ సంఘటన రెండు అణ్వస్త్ర శక్తుల మధ్య యుద్ధం యొక్క తీవ్రతను, దాని పరిణామాలను, అంతర్జాతీయ ఒత్తిళ్లను స్పష్టంగా వెల్లడించింది. ఈ ఆపరేషన్ ఏం సాధించింది? భారత్ దీని నుంచి ఏ పాఠాలు నేర్చుకోవాలి? ఈ ఘటనలు భవిష్యత్తులో భారత విదేశాంగ, రక్షణ విధానాలను ఎలా ప్రభావితం చేయనున్నాయి? ఈ సంపాదకీయం ఈ అంశాలను విశ్లేషిస్తుంది.*




పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టింది. ఈ ఆపరేషన్ ద్వారా భారత్ తన సైనిక సామర్థ్యాన్ని, గగనతల రక్షణ బలాన్ని ప్రపంచానికి చాటింది. ఎస్-400, ఆకాష్, రాఫెల్ ఫైటర్ జెట్లు వంటి అత్యాధునిక రక్షణ వ్యవస్థలు డ్రోన్ల నుంచి అణ్వస్త్ర మిసైళ్ల వరకు ఏ దాడినైనా తిప్పికొట్టగలవని నిరూపించాయి. భారత్ అధికారికంగా ప్రకటించిన విధంగా, ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ ప్రకటనగా భావిస్తామని స్పష్టం చేసింది. ఈ ఆపరేషన్ పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పడమే కాక, భవిష్యత్తులో ఇలాంటి దాడులకు ప్రతీకారం తీవ్రంగా ఉంటుందనే సంకేతాన్ని ఇచ్చింది.

పాకిస్థాన్ సైనిక స్థావరాలకు జరిగిన నష్టాల వివరాలు త్వరలో మీడియా ద్వారా వెల్లడవుతాయని అంచనా. ఈ ఆపరేషన్ ద్వారా భారత్ తన ఖచ్చితమైన సైనిక వ్యూహాలను, విభాగాల మధ్య సమన్వయాన్ని ప్రదర్శించింది. ఈ ఘటన పాకిస్థాన్ యొక్క ఆర్థిక, సైనిక బలహీనతలను కూడా బహిర్గతం చేసింది. చైనా, ఉత్తర కొరియా సరఫరా చేసిన నాసిరకం ఆయుధాలు, పాకిస్థాన్ యొక్క నాలుగు రోజుల యుద్ధ సామర్థ్యం లేని స్థితి పరిహాసాస్పదంగా మారాయి. అంతర్జాతీయంగా అప్పుల కోసం బిచ్చమెత్తినా ఎవరూ సహాయం చేయకపోవడం పాకిస్థాన్ యొక్క ఒంటరితనాన్ని స్పష్టం చేసింది.

### అంతర్జాతీయ ఒత్తిడి: అమెరికా మధ్యవర్తిత్వం

రెండు అణ్వస్త్ర శక్తుల మధ్య యుద్ధం ప్రపంచ శాంతికి ముప్పు కాబట్టి, అంతర్జాతీయ సమాజం ఈ ఉద్రిక్తతను సహించలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలో మధ్యవర్తిత్వం జరిగింది, ఇది భారత్, పాకిస్థాన్ రెండింటికీ తప్పనిసరి అయింది. భారత్ అమెరికా ఒత్తిడికి అయిష్టంగానైనా లొంగాల్సి వచ్చింది, ఎందుకంటే యూరోపియన్ యూనియన్, అమెరికా మిత్రదేశాలు భారత్‌ను ఏకాకిని చేసే ప్రమాదం ఉంది. పాకిస్థాన్‌కు ఈ ఒప్పందం మరింత కీలకం, ఎందుకంటే యుద్ధం కొనసాగితే అది అత్యంత తీవ్రమైన నష్టాలను చవిచూసేది. అంతర్జాతీయ ఆర్థిక సంస్థ (ఐఎంఎఫ్) అప్పులు యుద్ధ అవసరాలకు కాక, ఇప్పటికే ఆమోదించినవి కావడం గమనార్హం.

ఈ ఒప్పందం పాకిస్థాన్‌కు ఊరటనిచ్చినప్పటికీ, దాని ఒంటరితనం స్పష్టమైంది. టర్కీ, అజర్‌బైజాన్ తప్ప మిగతా ఇస్లామిక్ దేశాలు, ప్రపంచ దేశాలు దానికి మద్దతు ఇవ్వలేదు. టర్కీ యొక్క మద్దతు భారత్‌కు ఆందోళనకరం, కానీ అజర్‌బైజాన్ యొక్క ప్రభావం నామమాత్రమే. చైనా కూడా కీలక సమయంలో పాకిస్థాన్‌కు అండగా నిలవలేదు, దాని సరఫరా ఆయుధాల నాణ్యత కూడా ప్రశ్నార్థకంగా మారింది. బలూచిస్థాన్, టీటీపీ తీవ్రవాద సమస్యలు పాకిస్థాన్‌ను మరింత బలహీనపరిచాయి.

### భారత్‌కు లభించిన స్పష్టతలు

ఈ ఆపరేషన్ భారత్‌కు అనేక కీలక స్పష్టతలను అందించింది. అంతర్గతంగా కొన్ని శక్తులు యుద్ధ సమయంలో వ్యవహరించిన తీరు, సోషల్ మీడియాలో విష ప్రచారం చేసే అకౌంట్లు దేశ భద్రతకు ముప్పుగా మారాయని తెలిసింది. ఈ విషయంలో కఠిన చర్యలు కొనసాగించాల్సిన అవసరం ఉంది. దేశ వ్యతిరేక ప్రచారాలు చేసే మీడియా, సోషల్ మీడియా ఖాతాలపై కొరడా ఝుళిపించడం తప్పనిసరి. మరోవైపు, భారత ముస్లిం సమాజం ఈ సంక్షోభంలో దేశపక్ష పాతంతో వ్యవహరించడం అభినందనీయం. ఒవైసీ వంటి నాయకులు దేశ ఐక్యతకు మద్దతు ఇవ్వడం సానుకూల సంకేతం. భారత్ యొక్క సెక్యులర్ స్ఫూర్తిని ముస్లిం, సిక్కు యువతులు దేశ జెండా పక్కన నిలబడి యుద్ధ విశేషాలను ప్రపంచానికి వివరించిన తీరు ఫేక్ సెక్యులరిస్టులకు గట్టి సమాధానం. ఈ దృశ్యాలు భారత ఐక్యత, బహుసాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటాయి.

### సైనిక సామర్థ్యం, సమన్వయం

ఆపరేషన్ సిందూర్ భారత సైనిక విభాగాల ఖచ్చితత్వాన్ని, ఉన్నతాధికారుల మధ్య సమన్వయాన్ని ప్రదర్శించింది. గగనతల రక్షణ వ్యవస్థల బలం, సైనిక వ్యూహాల సమర్థత ప్రపంచ దేశాలకు స్పష్టమైంది. పాకిస్థాన్ డ్రోన్లు, మిసైళ్లు భారత సరిహద్దుల్లోకి ప్రవేశించకముందే నాశనం చేయబడ్డాయి. ఈ సామర్థ్యం భారత్ యొక్క రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలనే అవసరాన్ని గుర్తు చేస్తుంది.

### నిరాశ: పీవోకే స్వాధీనం

కార్గిల్ యుద్ధం తర్వాత భారత జాతి ఇంత ఐక్యంగా, ఉత్సాహంగా కనిపించిన సందర్భం ఈ ఆపరేషన్ సమయంలోనే. దేశ ప్రజలు ఈ వేడిలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే) స్వాధీనం చేసుకోవాలని ఆశించారు. ఈ అవకాశం కోల్పోవడం దేశ ప్రజలను నిరాశపరిచిన అంశం. అయితే, యుద్ధ విరమణ అనేది తాత్కాలిక విరామం మాత్రమే, పూర్తి సమాప్తి కాదు. భవిష్యత్తులో మోడీ నాయకత్వంలో కొత్త వ్యూహాలతో పీవోకే సమస్యను పరిష్కరించే అవకాశం ఉందని ఆశిద్దాం.

### భవిష్యత్ వ్యూహాలు

పాకిస్థాన్ యొక్క బలహీనతలు బయటపడినప్పటికీ, అది తన ఉగ్రవాద విధానాలను మార్చుకునే అవకాశం లేదు. భారత్ కొత్త వ్యూహాలను రూపొందించాలి. టర్కీ వంటి దేశాలతో దౌత్యపరమైన సంబంధాలను జాగ్రత్తగా నిర్వహించాలి. అంతర్గతంగా దేశ వ్యతిరేక శక్తులపై కఠిన చర్యలు కొనసాగించాలి. సోషల్ మీడియా, మీడియా ద్వారా విష ప్రచారం చేసే వారిని నియంత్రించడం తప్పనిసరి. భారత్ యొక్క సెక్యులర్ స్ఫూర్తిని, ఐక్యతను మరింత బలోపేతం చేయడం ద్వారా దేశ భద్రతను మెరుగుపరచాలి. ఆపరేషన్ సిందూర్ భారత్ యొక్క సైనిక, దౌత్యపరమైన బలాన్ని ప్రపంచానికి చాటింది. పాకిస్థాన్ యొక్క బలహీనతలను బహిర్గతం చేస్తూ, భవిష్యత్ ఉగ్రదాడులకు గట్టి ప్రతీకారం ఉంటుందనే సందేశాన్ని ఇచ్చింది. అయితే, యుద్ధం శాశ్వత పరిష్కారం కాదు. పంచశీల సిద్ధాంతాలను అనుసరించే భారత్, శాంతి మార్గంలోనే ముందుకు సాగాలి. ఈ సంక్షోభం దేశ ఐక్యతను, సెక్యులర్ స్ఫూర్తిని మరింత బలపరిచింది. భవిష్యత్తులో మరింత సమర్థవంతమైన వ్యూహాలతో పాకిస్థాన్‌ను నియంత్రించి, పీవోకే సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేయాలి.

**రచయిత: ఉమాశేషారావు వైద్య,**
లెక్చరర్ ఇన్ పాలిటిక్స్, కామారెడ్డి
సంప్రదించండి: 9440408080

# అరుణాకాశంలో ఉజ్వల తార
# బండారి రాజిరెడ్డి




*తరమేల్లిపోతుంది త్యాగాల వరవడిలో చెక్కు చెదరని మనిషి ఉక్కుమనిషి జీవితంలో ఎన్నో అటుపోటులు ఎదురైనా ప్రజల కోసం నమ్మిన ప్రజల కోసం పరితపించాడు. మడమ తిప్పని యోధుడు ప్రజలకు ఇచ్చినటువంటి వాగ్దానాలను అమలు చేయడంలో ఆయనకు సాటివ్వెరు. రాజకీయలలో నిబద్ధత నిజాయితీ కల్గినటువంటి మహా నాయకుడు.*

కాకలు తీరిన రాజకీయ యోధుడు అందుకే ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వెసుకున్నాడు రాజుకీయ రంగంలో రణధీరుడతడు. మాటకు కట్టుబడి ఉన్నవాడు అతడు పాతతరం నాయకుడు కావచ్చు. కానీ నేటి తరానికి ఆయన చూపినటువంటి మర్గదర్శకం దశ దిశ నిర్దేశించిన వాడు చిన్నప్పటి నుంచి రైతుగా కష్టజీవిగా బతికినాడు. కష్టాలను ఎదుర్కొంటునే కాంగ్రెస్ పార్టీ రాజకీయలలో కాప్రా మున్సిపాలిటీ అధ్యక్షుడిగా మొదలైన బండారి రాజిరెడ్డి జీవితం అంచెలు అంచెలుగా ఎదిగి కాప్రా మున్సిపాలిటీకి మొట్టమొదటిసారిగా తొలి చైర్మన్ అయ్యారు అలాగే ఉప్పల్ నియోజకవర్గం ఏర్పడడంతో (తొలి) ఎమ్మెలేగా గెలుపు పొందారు బండారి రాజిరెడ్డి ఆయన మురికివాడలలో నివసిస్తున్న పేద ప్రజలపై మమకారం ప్రత్యేక చొరవ తీసుకొని మురికివాడల అభివృద్ధికి ఎనలేని పోరు సల్పారు. కాంగ్రెస్ పార్టీలో అప్పటి దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అభిమానాన్ని చురగొన్నారు వైయస్ హయంలో వందలాది కోట్ల రూపాయల నిధులను ఉప్పల్ నియోజకవర్గానికి తీసుకువచ్చి అభివృద్ధికి బాటలు వేసినారు ఉప్పల్ నియోజకవర్గంలో ఏ మూలకు వెళ్లిన ఏ కాలనీకి వెళ్లిన ఏ మురికివాడలకు వెళ్లిన బండారి రాజిరెడ్డి చేసినటువంటి సేవ కార్యక్రమాలను అభివృద్ధి పనులను ప్రజలు చెప్పుకుంటారు బండారి రాజిరెడ్డి ఉదయం 6 గంటలకే కాలనీలలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను నేరుగా అడిగి తెలుసుకునేవారు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేవాడు నిరంతరం ప్రజల కోసం పరితపించేవాడు. పేదలంటే ఆయనకి ఎనలేని అభిమానం ఏ సమస్య ఉందని పోయిన సానుకూలంగా స్పందించి తక్షణమే పరిష్కారానికి చొరవ చూపేవాడు కుషాయిగూడ జమ్మిగడ్డలో ప్రజా వైద్యశాలను అందుబాటులోకి తీసుకురావడంలో బండారు రాజిరెడ్డి పాత్ర మరువలేనిది. నేడు వందల సంఖ్యలో నియోజకవర్గ ప్రజలు ఉచిత వైద్య సేవలను అందుతున్నాయి అంటే అది రాజిరెడ్డి ప్రత్యేక చొరవే. కైలాసగిరి గుట్టపై శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం మల్లికార్జున స్వామి దేవాలయం గోశాల ఏర్పాటు చేసి బండారి రాజిరెడ్డి తన సొంత నిధులతో దేవాలయాలనీ కట్టించారు ప్రతి సంవత్సరం వందల సంఖ్యలో అయ్యప్ప స్వాములకు అన్నదానం గత 23 సంవత్సరాలుగా నిరంతరంగా కొనసాగిస్తున్నారు. అప్పటి మంత్రి తుల్లా దేవేందర్ గౌడ్ 2002లో బండారి రాజిరెడ్డి పై తప్పుడు కేసులు పెట్టిన అవి నిలువలేకపోయినావి బండారి రాజిరెడ్డి జీవితం సాదాసీదాగా జరిగింది. అప్పటి టిడిపి ప్రభుత్వం బండారి రాజిరెడ్డిని ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన చెక్కుచెదరకుండా కాంగ్రెస్ పార్టీని కార్యకర్తలని అండగా నిలిచి వారిని కాపాడినారు నిరంతరం ప్రజలకు పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రజా నాయకుడిగా ఎదిగాడు ఎంతోమంది యువతి యువకులను రాజకీయాల వైపు మళ్ళించి రాజకీయ బిక్ష పెట్టినాడు. టీటీడీ మెంబర్గా పని చేసినారు బండారి రాజిరెడ్డి తన జీవితంలో ఎన్నో పదవులు వచ్చిన గర్వంగా ఉండకుండా సాధాసీదాగా బతికి నాడు. ఆయన మరణం తీరని లోటు గొప్ప మానవతావాది ముక్కు సూటిగా మాట్లాడే నైజం అతనిది ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే వ్యక్తిత్వం అయినది బండారి రాజిరెడ్డి నుండి నేటి సమాజం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. నేటి తరానికి దిక్కు సూచి ఆయన ఎప్పుడు ప్రజల హృదయాలలో మెదులుతూనే ఉంటారు బండారి రాజిరెడ్డి మరణ వార్త విన్న ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు కంటతడి పెట్టి కన్నీళ్లతో నివాళులు అర్పించారు ఆయన అంతిమ యాత్రలో హబ్సిగూడ నుండి మొదలైన అంతిమయాత్ర చీర్యాల వరకు వేలాదిమంది అభిమానుల మధ్య అంతిమయాత్ర జరిగింది జోహార్ బండారి రాజిరెడ్డి అంటూ నినాదాలు ఆకాశానికి అంటేలా మారుమోగినాయి కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి దశ నుండి మొదలైన రాజకీయ జీవితం తుది శ్వాస విడిచే వరకు ఆయన కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ కాంగ్రెస్ పార్టీలోనే మరణించారు. ఎందరో నేతలు పదవుల కోసం డబ్బుల కోసం పార్టీలు మారే నేతలు మనం ఎంతో మందిని చూశాము ఎవరు ఏ రాజకీయ నాయకుడు ఏ ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉంటాడో తెలియని అయోమయం నేటి రాజకీయం కానీ రాజిరెడ్డి మాత్రం ఎన్నో అవకాశాలు వచ్చినప్పటికీ ప్రలోభాలు పెట్టినప్పటికీ వేటికి లొంగకుండా నేను నమ్ముకున్న పార్టీలోనే ఉంటానని తుది శ్వాస విడిచే వరకు ఉండిపోయారు రాజిరెడ్డి ఆయన జీవితం నేటి భవిష్యత్ తరాలకు మార్గదర్శకం కావాలి ఆయన లేని లోటు ఉప్పల్ నియోజకవర్గానికి కనిపిస్తుంది. నిస్వార్థంగా నిడంబరంగా బతికినాడు బండారి రాజిరెడ్డి సోదరుడు బండారి లక్ష్మారెడ్డి ఉప్పల్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నాడు బండారి నీలం రెడ్డి ఉప్పల్ నియోజకవర్గ రాజకీయాలలో చురుకైన పాత్ర పోషిస్తున్నాడు జోహార్ బండారి రాజిరెడ్డి
కన్నీటి జోహార్లు బండారి రాజిరెడ్డి....

**- దామరపల్లి నర్సింహ్మా రెడ్డి**
9581358696

# వెలుగు దివ్వేలు
## ఆవిష్కరణల కాంతిలో విశ్వమానవ ప్రగతి




తూర్పున ఉదయించే సూర్యకాంతి రేఖలు ప్రతి రోజూ మానవాళికి నవ శకానికి స్వాగతం పలుకుతాయి. అరుణ కిరణాలు ఆకాశంలో వ్యాపిస్తుంటే, అది కేవలం ప్రకృతి యొక్క రమణీయ దృశ్యం మాత్రమే కాదుబీ ఇది మానవ జాతి అనంత ప్రగతి పథానికి శుభసూచకం. కాంతి, కేవలం భౌతిక దృగ్విషయం కాదుబీ ఇది నూతన ఆలోచనలకు, సృజనాత్మక ఆవిష్కరణలకు ఊపిరి పోసే అక్షయ శక్తి. శాస్త్రం, సాంకేతికత, వైద్యం, వ్యవసాయం, సమాచారం, పర్యావరణ రంగాలలో విప్లవాత్మక మార్పులకు కాంతి నాంది పలుకుతోంది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో పేదరికం, అసమానత, ఆహార కొరత, వాతావరణ మార్పు వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు కాంతి ఆధారిత సాంకేతికతలు ఆశాకిరణంగా మారాయి.

ప్రతి సంవత్సరం మే 16న జరుపుకునే అంతర్జాతీయ కాంతి దినోత్సవం మన జీవితాల్లో కాంతి యొక్క ప్రాముఖ్యతను గుర్తుచేస్తుంది. 2025 సంవత్సర థీమ్, "కాంతి, ఆవిష్కరణ, సమాజం," ఈ ప్రాముఖ్యతను మరింత విశదీకరిస్తుంది. శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలు, సమాజ శ్రేయస్సులో కాంతి ఆధారిత సాంకేతికతల పాత్రను ఈ థీమ్ నొక్కి చెబుతుంది. శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, కళాకారులు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతలు కాంతి శాస్త్రం ద్వారా శాంతి, సమానత్వం, విద్య వంటి యునెస్కో లక్ష్యాలను సాధించేందుకు కలిసి కృషి చేయాలని ఈ రోజు ప్రోత్సహిస్తుంది.

లేజర్ ఆవిష్కరణ నుంచి నేటి క్వాంటం సాంకేతికతల వరకు, కాంతి శాస్త్రం మానవ మేధస్సు యొక్క అద్భుత విజయాలకు నిదర్శనం. ఐక్యరాజ్యసమితి యొక్క అంతర్జాతీయ క్వాంటం సైన్స్ మరియు టెక్నాలజీ సంవత్సరంతో ఈ థీమ్ అనుసంధానం కాంతి యొక్క సమకాలీన ప్రాముఖ్యతను స్పష్టం చేస్తుంది. ఒక శతాబ్దం క్రితం ఊహించలేని సాంకేతికతలు ఈ రోజు మన జీవితాలను సులభతరం చేస్తున్నాయి.

మానవ సమాజం వాతావరణ మార్పులు, ఆరోగ్య సంరక్షణలో అసమానతలు, నాణ్యమైన విద్య అందుబాటు వంటి సవాళ్లను ఎదుర్కొంటోంది. కాంతి ఆధారిత ఆవిష్కరణలు ఈ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలను అందిస్తున్నాయి. పర్యావరణ అనుకూల లైటింగ్ టెక్నాలజీలు శక్తి ఉత్పత్తి, వినియోగంలో సమర్థతను పెంచుతున్నాయి. సౌర శక్తి, ఎల్ఈడీ లైటింగ్ వంటివి శక్తి వనరులను స్థిరంగా ఉపయోగించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలలో కాంతి ఆధారిత సాంకేతికతలు అద్భుత ఫలితాలను అందిస్తున్నాయి. వ్యవసాయంలో 'అగ్రి-ఫోటోనిక్స్' ద్వారా పంట దిగుబడి పెరుగుతోంది, నీటి వినియోగం హేతుబద్ధమవుతోంది, తెగుళ్లను పర్యావరణ అనుకూలంగా నియంత్రించడం సాధ్యమవుతోంది. వైద్య రంగంలో లేజర్ ఆధారిత చికిత్సలు, అత్యాధునిక ఇమేజింగ్ టెక్నిక్‌లు రోగ నిర్ధారణ, చికిత్సలను మరింత కచ్చితమైనవిగా, సమర్థవంతమైనవిగా మార్చాయి. సమాచార సాంకేతికతలో ఆప్టికల్ ఫైబర్‌లు ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్‌గా అనుసంధానిస్తున్నాయి. విద్యలో కాంతి ఆధారిత సాంకేతికతలు బోధనను ఆకర్షణీయంగా, ఇంటరాక్టివ్‌గా మార్చి, విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరుస్తున్నాయి.

### భవిష్యత్తు కాంతులు: సమిష్టి కృషి

అంతర్జాతీయ కాంతి దినోత్సవం సందర్భంగా, కాంతి యొక్క అపార శక్తిని, దాని సాంకేతికతల ప్రాముఖ్యతను గుర్తెరుగుదాం. ఆవిష్కరణలు పరిశోధనా సంస్థలకే పరిమితం కాక, సమాజంలోని ప్రతి వర్గానికి అందుబాటులోకి రావాలి. విద్య, ఆరోగ్యం, స్థిరమైన అభివృద్ధి రంగాలలో కాంతి ఆధారిత ఆవిష్కరణలను విస్తృతంగా ఉపయోగించడం ద్వారా సమతాపూర్వక సమాజాన్ని నిర్మించవచ్చు. శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, కళాకారులు, విధాన నిర్మాతలు కలిసి కాంతిని సృజనాత్మకంగా ఉపయోగించే మార్గాలను అన్వేషించాలి. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కాంతి మార్గదర్శకంగా నిలవాలి.

కాంతి, ఆవిష్కరణలకు వెలుగు దివ్వెగా, సమాజానికి ఆశాజ్యోతిగా నిలుస్తుంది. ఈ కాంతిమయ ప్రయాణంలో ప్రతి ఒక్కరి ఆలోచనలు, కృషి అమూల్యం. కలిసి సాగి, కాంతివంతమైన భవిష్యత్తును నిర్మిద్దాం.



**కింజరాపు అమరావతి**
8247286357

# విశ్వవ్యాప్తంగా డోనాల్డ్ ట్రంప్ వ్యక్తిత్వంపై విమర్శలు

*డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పదవి అంతర్జాతీయ సంబంధాల్లో వివాదాస్పద ప్రవర్తనలో ఇమిడి ఉంది. ఆయన ఆక్షేపణీయ మాటలు, దౌత్య సంప్రదాయాలను పట్టించుకోకపోవడం, దృఢమైన వైఖరి దేశాల సార్వభౌమాధికారాన్ని, ప్రపంచ నాయకత్వ గౌరవాన్ని దెబ్బ తీస్తున్నాయని విమర్శకులు ఆరోపిస్తున్నారు. భారత్-పాకిస్తాన్ సంఘర్షణలో, ముఖ్యంగా కాశ్మీర్ విషయంలో ఆయన జోక్యం, ఇతర దేశాల పట్ల ఆయన ప్రవర్తన అమెరికా ప్రపంచ స్థాయి గౌరవాన్ని తగ్గిస్తున్నాయి. ఈ వ్యాసం ట్రంప్ దౌత్య అతిక్రమణలు, అవమానకరమైన భాష, భారత్-పాకిస్తాన్ వివాదంలో ఆయన అనవసర జోక్యం పాత్ర గురించి, ధనిక దేశంగా లేదా సైనిక శక్తి బలంగా ఉన్న దేశానికి ప్రపంచ పోలీసుగా వ్యవహరించే హక్కు ఉంటుందా? అనే ప్రశ్నలను లేవనెత్తుతుంది.*



ట్రంప్ బహిరంగ వ్యాఖ్యలు తరచుగా అసభ్యత, అవమానం దిశగా దిగిజారుతుంటాయి. స్నేహితులు, శత్రువులు అనే విచక్షణ లేకుండా... నిర్లక్ష్యంగా మాటలు మీరుతుంటారు. వాణిజ్య చర్చల్లో కెనడా, మెక్సికోలను అమెరికాను "వాడుకునే" దేశాలుగా పేర్కొన్నారు. సుంకాలతో బెదిరించి సన్నిహిత స్నేహ దేశాలతో సంబంధాలను దెబ్బ తీశారు. యూరోపియన్ మిత్ర దేశాలను అమెరికా సైనిక రక్షణపై ఆధారపడే "ఉచిత సవారీ దారులు" అంటూ ఎగతాళి చేసి, నాటో దేశాలలో విశ్వాసాన్ని క్షీణింప జేశారు. ఆసియాలో ఉత్తర కొరియా నాయకుడు "కిమ్ జాంగ్-ఉన్"ను "లిటిల్ రాకెట్ మాన్" అని హేళన చేసి, తర్వాత పొగడ్తలకు దిగడం దక్షిణ కొరియా, జపాన్ ను గందరగోళాని కి గురిచేసింది. ఇటువంటి పరుషమైన భాష వారి సహకారాన్ని పెంపొందించక పోగా మిత్ర దేశాలను దూరం చేసింది.ట్రంప్ వ్యక్తి గత అహంకారం అమెరికా నైతిక ప్రతిష్టను గౌరవాన్ని తగ్గిస్తుంది. '%శ%' లోని పోస్టులు ట్రంప్ ను "హిందీ సినిమాలో విలన్"తో పోల్చాయి. ఆయన భాష ప్రపంచ నాయకుడి హోదాకి తగని విధంగా ఉందని అనేక దేశాల విజ్ఞులు విమర్శించారు. ఒక్క మాటలో చెప్పాలంటే "అమెరికా గొప్పతనం" ట్రంప్ (పిచ్చోడి చేతిలో రాయిలా) తయారయ్యింది.ఆయన నిలకడలేని మాటలు, ప్రవర్తన విదూషకుడిని తలపిస్తాయి.

భారత్-పాక్ సంఘర్షణ, ముఖ్యంగా కాశ్మీర్ విషయంలో ట్రంప్ అసంబద్ధ దౌత్యం స్పష్టంగా కనిపిస్తుంది. మొన్న ఆయన కాశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం చేయగలనని, భారత ప్రధాని నరేంద్ర మోదీ తన సహాయం కోరారని పేర్కొన్నారు. (ఇది అసత్యం అని) భారత్ ప్రభుత్వం ఈ వాదనను తక్షణం ఖండించింది. ఇటీవల, 2025 మేలో, భారత్ "ఆపరేషన్ సిందూర్", పాకిస్తాన్ ప్రతి స్పందనలతో ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, ట్రంప్ తన "ట్రూత్ సోషల్" లో రెండు దేశాలు తన జోక్యంతో కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించారు. ఈ వాదన ఆయన పాత్రను అతిశయోక్తి గా ప్రజలు అనుకుంటున్నారు. అతని మాటలు ద్వైపాక్షిక చర్చల గతిశీలతను పట్టించుకోలేదు. కాశ్మీర్ భారత్ లో అంతర్ భాగం అనే విషయం మరచి అసందర్భంగా మాట్లాడటం హద్దు మీరటమే. మూడవ పక్ష మధ్య వర్తిత్వాన్ని తిరస్కరిస్తున్నట్లు భారత్ స్థిరంగా ఏనాడో చెప్పింది.ఇప్పటికీ చెబుతోంది. ట్రంప్ కాశ్మీర్ "సమస్యను పరిష్కరిస్తా ను" అనే అనవసర ప్రతిపాదన భారత్ సార్వభౌమాధికారాన్ని అగౌరవ పరిచినట్టే. ఆయన మాటలు పాకిస్తాన్ కు ఊతం ఇచ్చినట్లు అవుతుంది. '%శ%' లో నెటిజన్లు ట్రంప్ అతిగా జోక్యం చేసుకోవడాన్ని ఘాటుగా దుయ్యబట్టారు. కాశ్మీర్ చరిత్రను సరిగ్గా అర్థం చేసుకోకుండా ఏది పడితే అది మాట్లాడటం వదురుబోతు లక్షణంగా విమర్శించారు.

ట్రంప్ జోక్యం అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లం ఘించటమే. , భారత సార్వభౌమాధికారాన్ని ధిక్కరించటమే అవుతుంది. అమెరికా దేశానికి ఆర్థికంగా బలమైన దేశం కావచ్చు. అలాగే సైనిక శక్తి కూడా గొప్పగా ఉండవచ్చు. అంత మాత్రం చేత ఇతర దేశాల అంతర్గత లేదా ద్వైపాక్షిక వ్యవహారాల్లో జోక్యం చేసుకునే హక్కు, అధికారం ఆయనకు లేదు .అమెరికాకు ధనం, ఆయుధాలు, అణుబాంబులు ఉన్నంత మాత్రాన ట్రంప్‌కు ప్రపంచపై పోలీసు అధికారాన్ని ఇవ్వవు. ఐక్యరాజ్య సమితి చార్టర్ లో సార్వభౌమాధికారం గల దేశాల స్వయం పరిపాలనను గౌరవించమని చెబుతుంది.అన్ని సార్వభౌమత్వం గల దేశాలు సమానమే.చిన్న దేశం అయినా, పెద్ద దేశం అయినా సమానం హోదాను కలిగి ఉంటాయి. "కాల్పుల విరమణకు ఒప్పుకోకపోతే భారత్, పాకిస్తాన్‌తో వాణిజ్యాన్ని నిలిపివేస్తానని ట్రంప్ బెదిరించటం" చెల్లదు. అమెరికా బలవంతపు వ్యూహాలు, చర్యలు ఉద్రిక్తతలను పరిష్కరించక పోగా మరింత పెంచుతాయి. దేశాల మధ్య గల స్నేహ, సహకార సంబంధాలను దూరం చేస్తాయి. అమెరికా "పెద్దన్న నాయకత్వ హోదా" పై విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి.

ట్రంప్ "సుంకాల విధానాలు" దౌత్య నిబంధనలను లెక్కచేయని వైఖరిని చూపిస్తాయి. భారత్, చైనా, యూరోపియన్ యూనియన్ లపై సుంకాలు విధించడం లేదా బెదిరించడం ద్వారా ప్రపంచ వాణిజ్య యుద్ధ భయాలను రేకెత్తించారు. ఇతర దేశాలు అమెరికా మార్కెట్‌ను దోపిడీ చేస్తున్నాయని ఆయన అర్థం లేని ఆరోపణలు వర్తక, వాణిజ్యం యొక్క పరస్పర ప్రయోజనాలను విస్మరిస్తుంది. మిత్ర దేశాలను శత్రువులుగా చిత్రీకరిస్తుంది. ఇది ఆర్థిక స్థిరత్వాన్ని భంగం చేస్తుంది, అమెరికా నమ్మకమైన భాగస్వామిగా ఉన్న ఖ్యాతిని దెబ్బతీస్తుంది. ట్రంప్ "అమెరికా ఫస్ట్" విధానం అమెరికా యువతకు ఆకర్షణీయ నినాదం గా ఉన్నప్పటికీ, ఇతర దేశాలను అమెరికాకు దూరం చేస్తుంది. పర్యావరణం సమతుల్యత, భద్రత వంటి అంశాల్లో నిధులు రద్దు చేసి, సభ్యత్వం, సహకారాన్ని అందించని ఆయన నిర్ణయాలు ప్రపంచ దేశాలను ఇబ్బంది పెడుతున్నాయి.

ట్రంప్ ప్రవర్తన, ఆయన ఇతర దేశాల నేతలను అవమాన కరంగా మాట్లాడటం, ఇతర దేశాల అంతర్గత విషయాల్లో అనవసర జోక్యం, సుంకాల బెదిరింపులు... అమెరికా పై ఉన్న గౌరవంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. అధ్యక్షుడి ప్రవర్తన అమెరికా దేశం ప్రతిష్టను పెంచేలా లేవు. ట్రంప్ విదేశీ నాయకులను ఎగతాళి చేసినప్పుడు లేదా దేశాలను బలవంతంగా ఒప్పించినప్పుడు, అమెరికా ప్రజాస్వామ్య, సహకార స్ఫూర్తిని తగ్గించినట్లు అవుతుంది.ఆయన చర్యలు "మైట్ ఈజ్ రైట్" (శక్తియే హక్కు) అనే ప్రమాదకర దృక్పథాన్ని సూచిస్తాయి. ఇలాంటి దృక్పథం నాగరిక లక్షణం కాదు. ఇది ఇతర దేశాల పై చెడు వ్యూహాలను అనుసరించేలా ప్రేరేపించవచ్చు. అమెరికాను "మళ్లీ గొప్పగా" చేస్తానని ట్రంప్ చెప్పడం మంచిదే. గొప్ప ఆదర్శంమే అందరూ ఆ లక్ష్యాన్ని గౌరవిస్తారు.ఐతే అందుకు అనుసరించే పద్ధతులు కూడా ఆదర్శంగా ఉండాలి. అంతే కానీ విడ్డూరంగా ఉండకూడదు . ఆయన చర్యలు మిత్ర దేశాలను దూరం చేసుకొనే విధంగా ఉన్నాయి.ఆయన ప్రవర్తన తో అమెరికా కు శత్రువులను పెంచుతుంది.మిత్ర దేశాలు మధ్య విభజన జరుగుతుంది.

చివరిగా, ట్రంప్ దౌత్య వైఫల్యాలు, ఆయన ఆక్షేపణీయ మాటల నుండి వస్తున్నాయి. భారత్-పాకిస్తాన్ వంటి ద్వైపాక్షిక వివాదాల్లో అనవసర జోక్యం తగదు. ప్రపంచ నాయకత్వం పట్ల లోతైన అవగాహనను ఆయన పెంచుకోవాలి. కాశ్మీర్ విషయంలో పూర్వ చరిత్ర తెలియని ఆయన మాటలు అర్థం లేనివి. అమెరికా ఆర్థిక శక్తి, ఆయుధ శక్తి తోనే పెద్దరికం రాదు. అతని మాటలు అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు అనుగుణంగా లేవు. ఆయన బల ప్రదర్శన, వత్తిళ్లు సమర్థనీయం కావు. ఆయన మాటలు దేశాల సార్వభౌమాధికారాన్ని అగౌరవ పరిచాయి. సున్నితమైన భౌగోళిక సమస్యలను సంక్లిష్టం చేశాయి. ప్రపంచాన్ని శాసించే గౌరవం, అధికారం కేవలం ధనం లేదా ఆయుధాలతో రాదు, పరస్పర గౌరవం, సహకారం , మర్యాద ద్వారా లభిస్తుంది. ట్రంప్ నిరంతరం ఈ లక్ష్యాలను, విలువలను దెబ్బ తీశారు. అమెరికా తన గౌరవాన్ని పునరుద్ధరించాలీ అంటే, విభజన, ఆధిపత్య వైఖరిని వదిలి, పరస్పర గౌరవం, సమన్వయం తో కూడిన దౌత్యాన్ని అనుసరించాలి.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

## మనం

నీవు కత్తిని నమ్మావు
వాడు శాంతిని నమ్మాడు
నీవు తూటాను నమ్మావు
వాడు ఓటును నమ్మాడు
నీవు పోరుతో రాజ్యమన్నావు
వాడు ఓటుగెలుపుతో గద్దె అన్నాడు
నీ దారి అడవి ముళ్లదారి
వాడిదారి నల్లేరుపై నడక...
పంచసప్తతి దాటిన
అడవులు తగలబడుతున్నాయి
ఆకలి పులికి బలి అవుతునే ఉన్నారు
నేలపై నెత్తుటి మరకలు పరుచు కున్నా
ఆశల పంటలు పరులపాలు అవుతున్నా
నిశబ్ధం మౌనం అచేతనం మూడు కోతులు
కదలక వదలక ఉడుములా పట్టుకున్నాయి...
వాడు నీవు కలిస్తే
ఎండుతున్న పైరుపై వర్షం కురిసి నట్లే
పచ్చదనం లో స్వేచ్ఛకేకి పురివిప్పినటే

**రేడియమ్**
9291527757



## కొత్త మాట

ఎవరి కోసం
ఎవర్ని.. ఎలా.. ఎందుకు
దూరం చేసుకుంటున్నారో
ఎప్పుడైనా గ్రహించారా
సరే,. ఇప్పుడు
మీతో కలిసి ఉన్నవారు
మీరు నిషేధించిన వారి కంటే
యోగ్యులైతే
మీరు తీసుకున్న నిర్ణయం సరైంది
లేకపోతే.. అసలైన
నిషేధితులు మీరే.

**కొత్త అనిల్ కుమార్**

# ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా మెలగాలి

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్
- సమయపాలనా పాటిస్తూ క్రమశిక్షణ, నీతి నిజాయితితో విధులు నిర్వర్తించాలి
- జిల్లా పోలీసు సిబ్బందితో అవగాహనా నిర్వహించిన ఎస్పీ



**వనపర్తి బ్యూరో, మే 14 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ భవనంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ జిల్లాలో వివిధ పోలీస్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధుల్లో ఉన్న సమయంలో క్రమశిక్షణతో సమయపాలన పాటిస్తూ, విధులు గర్వంగా మంచి టర్న్ అవుట్ తో అప్పగించిన విధులు గర్వంగా నిబద్ధతతో నిర్వహించమన్నారు. క్రమశిక్షణతో సమయపాలన పాటిస్తూ అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ అధికారుల మన్ననలు పొందాలని వివరించారు. విధులుపరంగా ఎలాంటి సమస్యలు తలెత్తిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. నీతి, నిజాయితీతో పనిచేసే వారికి పోలీస్ శాఖలో ఎల్లప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు. ఏదైనా పిర్యాదు వస్తే వారిని ఎక్కువసేపు వెయిట్ చేయించకుండా వారి బాధలను తెలుసుకొని వారి దగ్గర నుండి సమాచారం తీసుకుని వారి ఫోన్ నెంబర్ని కూడా తీసుకొని ఎస్పై లేనియెడల వారిని తక్షణమే పంపాలని తెలిజేసారు. వచ్చిన ప్రతి పిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడటం ద్వారా చిన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. పోలీస్టేషన్కు వచ్చే పిర్యాదుల ద్వారా ఇన్ఫర్మేషన్ సిస్టం ను డెవలప్ చేసుకోవాలని తెలియజేసారు. వనపర్తి పోలీస్ మీ పోలీస్ అనే నినాదంతో ప్రతి మాటలోనూ ప్రతి పనిలోనూ ప్రతి అడుగులోను మన పోలీస్ సిబ్బంది చూపించాలని అన్నారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక పనులు చేసే వారిపైన చట్ట పరమైన మరియు శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేసారు. ప్రజలతో మరియు గ్రామ పెద్దమనుసులతో దగ్గరయ్యి గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించాలని సూచించారు. పెట్రోలింగ్ రాత్రిపూట ఎక్కువగా చేస్తూ దొంగతనాలు జరుగకుండా చూడాలన్నారు. పాత నేరస్తులను యొక్క పనులపై ఒక కంట కనిపెడుతూ ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. మైనర్ డ్రైవింగ్ మీద స్పెషల్ చేపట్టి సోమవారం. వారి తల్లిదండ్రులకు వాహన యజమానులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మనం డిసిఆర్బి డిఎస్పీ, ఉమామహేశ్వరరావు, వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, వనపర్తి సీఐ, కృష్ణ, కొత్తకోట సీఐ, రాంబాబు, ఆత్మకూరు సీఐ, శివకుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు శ్రీనివాస్, జిల్లా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేతకీ ఆలయానికి సీఎం వచ్చే అవకాశం

- అందరూ అప్రమత్తంగా ఉండాలి
- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



**ఝరాసంగం, మే 14 (జనం సాక్షి) :** ఝరాసంగంలోని శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి ఆలయానికి త్వరలో రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వచ్చే అవకాశాలు ఉన్నాయని, అందరూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగం ఎంపీడీవో కార్యలయంలో ఆయా శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. సీఎం వచ్చే మార్గంలో పారిశుధ్య, మొక్కల సంరక్షణ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అదే విధంగా గ్రామల్లో త్రాగు నీటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. త్రాగు నీటి సమస్య గ్రామాలను ముందుగా గుర్తించి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు అందజేయలన్నారు. మేదపల్లి గ్రామంలో పారిశుధ్య పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని గ్రామస్తులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సమావేశంలో డిపివో సాయిబాబా, ఆర్డీవో రాజీరెడ్డి, సీఈఓ, తహసీల్దార్ తిరుమల రావు, ఎంపిడివో సుధాకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై దాడి

- 29 వేల నగదు స్వాధీనం



**కృష్ణ, మే 14 (జనం సాక్షి) :** కృష్ణ మండల కేంద్రం కృష్ణ రైల్వే బ్రిడ్జి సమీపంలో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆడుతున్న వ్యక్తులను 29 వేల 420 రూపాయలను పట్టుకున్నారు. బుధవారం పేకాట స్థావరంపై మధ్యాహ్నం 02:00గంటల సమయంలో కృష్ణ ఎస్పై నవీద్ సిబ్బంది కలిసి కృష్ణా గ్రామ శివారులోని కృష్ణా రైల్వే బ్రిడ్జి సమీపంలో పేకాట స్థావరంపై దాడి చేసి అందర్ బహర్, ఆడుతున్న హెచ్. నాగేష్, రాజు, మహమ్మద్ గుర బసయ్య, తాండూరు లక్ష్మప్ప కొత్తపల్లి, మాగనూర్ కరియప్ప గుల్బర్గా అనే ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా దాడి చేసి వారి నుండి పేక ముక్కలు, 29420 రూపాయల స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణ తెలిపినారు.

# వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు దోచిపెడుతున్న ప్రభుత్వం

- జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఎం అంజనేయులు



**వీపనగండ్ల, మే 14 (జనం సాక్షి) :** వీపనగాండ్ల మండలం తూముకుంట గ్రామ ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం ఆంజనేయులు గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు రామచంద్రయ్య గౌడు సిఐటి నాయకులు బాలకృష్ణ చారి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రభీ సీజన్లో రైతులు పండించిన వడ్లను ఐకెపి కేంద్రాల ద్వారా, సహకార సంఘాల ద్వారా వడ్లు కొనుగోలు చేసి జిల్లాలో ఉన్న రైస్ మిల్లర్లకు ఏమాత్రం తాలు లేకుండా పెట్టాలని ప్రభుత్వ మే నిబంధనలు పెట్టి రైతులను దోపిడీ చేసి రైస్ మిల్లర్ల యొక్క కడుపులో నింపే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. వరి ధాన్యంలో తాలు శాతం ఉందని సాకు చెప్పి మినిమం తాలు శాతాన్ని కూడా మొత్తం లెక్కలో తాలు లెక్కన ఒక బ్యాగుకు ఒక కేజీ నుంచి మూడు కేజీల వరకు తాలు పేరు చెప్పి తీయడం, ఆ తాలును ఆ రైస్ మిల్లర్లు కేజీకి 60 పైసలు చొప్పున అమ్ముకోవడం జరుగుతుంది అని అన్నారు. రైతులతో ఉచితంగా తాలు పేరు చెప్పి ఉచితంగా తీసుకోవడం జరుగుతుంది. రైస్ మిల్లులకు అప్పజెప్పిన తర్వాత రైస్ మిల్లర్లు ఆ తాలును పొట్టుతో అమ్ముకోవడం జరుగుతుంది. ఈరోజు ప్రభుత్వం రైతులను దోపిడీ చేసి రైస్ మిల్లర్ల కడుపు నింపే విధంగా చేస్తూ రైతులకు నష్టం జరిగే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గతం మాదిరిగానే తాలు ఇతరత్రా ఎలాంటి నిబంధన లేకుండా యధావిధిగా కొనుగోలు చేయాలి ప్రతి గ్రామానికి లారీలను కొరత లేకుండా పంపాలి అని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- శాంతినగర్ ఎస్సై నాగశేఖర్ రెడ్డి



**రాజోలి, మే 14 (జనంసాక్షి) :** మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని శాంతినగర్ ఎస్సై నాగశేఖర్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం శాంతినగర్ పట్టణంలోని ప్రధాన రహదారిపై ఎస్సై నాగశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్ ద్వారా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని, మృతుడిపై ఆధారపడ్డ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వాహనాలకు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడిపిన మందుబాబులకు జరిమానాలు విధించినట్లు ఎస్సై తెలిపారు.

# ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

- భయాందోళనతో పరుగులు తీసిన జనం



**న్యాల్కల్, మే 14 (జనం సాక్షి) :** భారీగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు, ఏకధాటిగా కురిసిన వర్షంతో జనం భయాందోళనకు గురై బందేలెత్తిపోయారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు తీవ్రమైన ఉక్కపోత, వేడిమితో జనం ఇంట్లో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సాయంత్రం అవ్వగానే చల్లని గాలులతో ఉపశమనం కల్పించిన వాతావరణం జనానికి కొంత ఊరటను కలిగించి. ఉన్నట్టుండి ఒక్కసారిగా బుధవారం సాయంత్రం 4:40 గంటల సమయంలో దాదాపు అరగంట పాటు భారీ ఉరుములు, మెరుపులు, కుండపోతగా కురిసిన వర్షం జనాన్ని తీవ్ర భయాందోళననికి గురిచేసింది. మండల కేంద్రమైన న్యాల్ కల్ తో పాటు మండలంలోని ఇబ్రహీంపూర్, చాల్కి, అత్తునూర్, డప్పూర్, చినిగేపల్లి, రాఘవపూర్, మిర్జాపూర్ (ఎన్), ముంగి, తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. గత పాతిక రోజుల వ్యవధిలో తరచుగా కురుస్తున్న వర్షంతో ఆరుతడి పంటలుగా సాగుచేసిన రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. మండలంలోని వివిధ గ్రామాల్లో చేతికి వచ్చిన మామిడి పంటకు అధిక నష్టాన్ని కలిగించింది. న్యాల్ కల్ లోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రానికి విక్రయించేందుకు వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

# దారిదోపిడి కేసులో ముగ్గురు నిందితులు అరెస్ట్

- తూప్రాన్ ఎస్సై జి.శివానందం



**తూప్రాన్, మే 14 (జనం సాక్షి) :** మూడు రోజుల క్రితం తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటోలో వెళుతున్న మధ్యప్రదేశ్ చెందిన మనీష్ కుమార్ పై దాడి చేసి సెల్ ఫోన్ , నగదు ఎత్తుకెళ్లిన కేసులో మల్లేశం (మేడ్చల్), శ్రీకాంత్ (బొల్లారం), మధు (నేరేడ్మెట్) లను బుధవారం పట్టుకుని రిమాండ్ చేసినట్లు ఎస్సై శివానందం తెలిపారు.

# గోరక్షణకు ప్రత్యేక చెక్ పోస్ట్ ఏర్పాటు

- జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హణమంతు




**న్యాల్కల్, మే 14 (జనం సాక్షి) :** జిల్లా పోలీస్ ఉన్నత అధికారుల ఆదేశం మేరకు, నిబంధనలకు విరుద్ధంగా గోవులు, గోసంపదను అడ్డుకునేందుకు ప్రత్యేకంగా చెక్ పోస్ట్ ను ఏర్పాటు చేసినట్లు జహీరాబాద్ గ్రామీణ వలయాధికారి (సీ ఐ) జక్కుల హనుమంతు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, గంగ్వర్ ప్రధాన కూడలి వద్ద చెక్ పోస్ట్ ను ఏర్పాటు చేసి తెలిపారు. తెలంగాణ - కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో ముందస్తు గస్తీ మేరకు ఏర్పాటు చేశారు. మరో పాతిక రోజుల్లో జరుగనున్న బక్రీద్ పండుగను దృష్టిలో ఉంచుకొని చెక్ పోస్ట్ ను ఏర్పాటు చేశారు. హద్నూర్, ఝరాసంగం, రాయికోడ్ పోలీస్ స్టేషన్ లకు చెందిన ముగ్గురు సిబ్బందిని 24 గంటల పాటు గస్తీ నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటల నుండి తెల్లవారు జాము వరకు గస్తీ చేపట్టనున్నారు. ఈ నెల 14 నుండి జూన్ 8 వరకు గస్తీ చేపట్టనున్నారు.

# నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవో కృష్ణయ్య



**ఊరుకొండ, మే 14 (జనం సాక్షి) :** మండలంలోని నర్సంపల్లి, ఊర్కొండపేట్ నర్సరీలను ఎంపీడీవో కృష్ణయ్య సందర్శించడం జరిగింది. వనమహోత్సవం కార్యక్రమం క్రింద రాబోయే రెండు సంవత్సరాలకు పెద్దమొక్కలు నాటుటకు ఊర్కొండ మండలానికి 41670 లక్ష్యంగా నిర్ణయించినందున ఊర్కొండపేట నర్సరీలో స్థలాన్ని పరిశీలించడం జరిగింది. నర్సంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయినా ఇంకా పనులు ప్రారంభించని లబ్ధిదారులకు త్వరగా పనులు ప్రారంభించుటకు సూచనలు సలహాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్సింహా (ఎపీఓ), మంజుల, శ్రీ ఇబ్రహీం పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలుపరచాలి

- కలెక్టర్ సిక్త పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 14 (జనంసాక్షి) :** సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో బాలికల సాంఘిక సంక్షేమ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. వృత్తి నైపుణ్యాలు మెరుగుపరచుకోవడానికి విద్యార్థులకు అర్థమయ్యేలా సులభకరమైన బోధనా విధానాలు అమలు పరచడానికి ఈ వృత్యంతర శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, నూతన విద్యా సంవత్సరంలో మరింత పుష్టి కలిగిన వృత్తి నైపుణ్యాలను సొంతం చేసుకోవాలని అన్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల పట్ల సాధారణ ఉపాధ్యాయులకు కూడా అవగాహన కల్పించాలని ఆయా విద్యార్థులకు అంతే అన్ని సోలాభ్యాలను అందించేందుకుగాను నిబద్ధతతో పనిచేయాలని కోరారు. ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయులతో ముచ్చటిస్తూ, గతంలో అమలుపరిచిన రోషిణి (వెలుగు::అభ్యాసమిత్ర) వర్క్ పుస్తకాలను జిల్లా వ్యాప్తంగా మరోమారు సంసిద్ధత కార్యక్రమంలో భాగంగా అమలుపరిస్తే విద్యార్థుల సామర్థ్యాలు తప్పనిసరిగా మెరుగవుతాయని ఉపాధ్యాయులు కోరగా దానికి కలెక్టర్ తను పూర్తిగా సహకరిస్తానని తప్పనిసరిగా అటువంటి వర్క్ బుక్ లను వెంటనే వినియోగంలోకి తెచ్చేలా ,ప్రింట్, డిస్ట్రిబ్యూట్ చేసేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ ని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమాలు శాఖపరమైన పనితీరు మెరుగుపరచుకోవడంతోపాటు విద్యార్థుల అవగాహన నేర్చుకునే సామర్థ్యాలను మరింత సులభతరం చేసేలా బోధన విధానాలు నేర్చుకునేందుకు ఉపయోగపడతాయని అన్నారు. శిక్షణలో అనుపస్థితి అయిన వారిని వెంటనే హాజరు కావాల్సిందిగా అదేశిస్తూ, తగు చర్యలు చేపట్టమని డీఈఓను ఆదేశించారు. వెంట డిఇఓ గోవిందరాజు కోర్స్ కోఆర్డినేటర్ మహమ్మద్ సిరాజుద్దీన్ సీనియర్ డైట్ లెక్చరర్, ఏఎమ్ఓ విద్యాసాగర్ ఉన్నారు.

# ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి భూ పరిశీలన



**దోమ, మే 14 (జనం సాక్షి) :** పరిగి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎండీ.గణపతి రెడ్డి పరిగి మున్సిపాలిటీ పరిధిలోని విద్యారణ్య పూరి (తుంకుల్ గడ్డ)లో 200కోట్ల రూపాయలతో నిర్మించబోతున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి కావాల్సిన స్థల పరిశీలన చేయడం జరిగింది. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని కులాల,మతాలకు సంబంధించిన విద్యార్థులు ఒకే పాఠశాలలో చదవాలని, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలని లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో 200 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణం పూర్తి చేసి విద్యాసంవత్సరం ప్రారంభించాలనే లక్ష్యంతో ఇప్పటికే రాష్ట్రంలోని పలు నియోజకవర్గాలలో పనులు ప్రారంభమయ్యాయని, ముఖ్యమంత్రి పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దాలని ప్రధాన లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్లు నిర్మిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పరిగి నియోజకవర్గానికి సంబంధించి తుంకలగడ్డ విద్యారణ్యపూరిగా పేరుగాంచి అన్ని రకాల పాఠశాలలు కళాశాలలు ఉన్నటువంటి ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాల నిర్మాణానికి కావలసిన స్థలం మరియు వసతులను సంబంధిత శాఖ ఎండి గణపతి రెడ్డి మరియు స్థానిక ఎమ్మార్వో సర్వేయర్లతో కలిసి స్థల పరిశీలన చేశారు. త్వరలో కావలసినంత స్థలాన్ని సేకరించి పాఠశాల నిర్మాణం చేపడుతామని తెలిపారు.

# తాగునీరు సమస్యను తీర్చిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**వీపనగండ్ల, మే 14 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కల్వరాల గ్రామంలో త్రాగునీరు సమస్య ను గ్రామ నాయకులు మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లగా మిషన్ భగీరథ నీళ్లు గత 20 రోజుల నుంచి రాకపోవడంతో పుల్గచర్ల గ్రామంలో మూడు చోట్ల మిషన్ భగీరథ గ్రామానికి వచ్చే పైపులైన్ పగిలిపోవడం వలన గ్రామానికి త్రాగునీరు సమస్య ఏర్పడడం జరిగింది, తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక పురావస్తు సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు నీళ్లు వదలి ఎక్కడ లీకేజీ ఉందో పరిశీలించడం జరిగింది పైపులైను తిరిగి నీళ్లు వచ్చే విధంగా చేయాలని ఆదేశించారు. కల్వరాల్ల గ్రామానికి పూర్తిస్థాయి నీటి సమస్య ఏర్పడకుండా నిర్ణయం తీసుకోవాలని మంత్రి ఆదేశించారు త్రాగునీటి స మస్య తలెత్తకుండా ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ వెంకటరమణ త్రాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు ఆర్డబ్ల్యూఎస్ ఈ వెంకటరమణ అన్నారు. మండల పరిధిలోని కల్వరాల్ల గ్రామంలో మిషన్ భగీరథ పైప్ లైన్ ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చక్రా వెంకటేష్ గ్రామ కాంగ్రెస్ నాయకులు వెంకట రాజయ్య, అఖిల్, నరసింహ వెంకటస్వామి, రమేష్ గౌడ్ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లారు మంత్రి అధికారులతో మాట్లాడి అధికారులను గ్రామానికి వెళ్లి పరిశీలన చేసి త్రాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించడంతో మంగళవారం రోజు సాయంత్రం అధికారులు గ్రామానికి వచ్చి పరిశీలించారు. పుల్గర్ చర్ల గ్రామంలో కల్వరాలకు వచ్చు మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ కావడం వల్ల త్రాగునీటి సరఫరా గ్రామస్తులు నిలిపివేయడం జరిగిందని, లీకేజీ పనులు సరిచేసి త్రాగునీటిని సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని ఎస్సీ పేర్కొన్నారు. అదేవిధంగా కల్వరాల గ్రామంలో నీటి సమస్య తీర్చడానికి బోరు వేయడం జరిగింది ఆ బోరు నుండి వాటర్ ట్యాంక్ వరకు పైప్ లైన్ పనులు చేపట్టడానికి పరిశీలించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూ ఎస్ ఈ ఈ మెగా రెడ్డి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ విశ్వనాథ్ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, గ్రామ రైతులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# విజయవంతంగా ముగిసిన అరుణోదయ స్ఫూర్తి సభ

- **హాజరైన పలువురు ప్రముఖులు**



**కుత్బుల్లాపూర్, మే 14 (జనం సాక్షి) :** అరుణోదయ సంస్కృతి సమైక్య ఏర్పడి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసుకున్న సభ విజయవంతంగా ముగిసింది. సుందరయ్య పార్క్ నుండి జీవీస్టీ హాల్ వరకు వందలాది మంది కళాకారులతో ప్రదర్శన కొనసాగింది. అరుణోదయ జెండాలు ధరించిన కళాకారులు చేసిన నృత్యాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. అరుణోదయ సీనియర్ కళాకారుడు రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ రాములు జెండాను ఎగరవేశారు. అమరుల స్తూపానికి సలాంలు చెప్తూ విప్లవ గీతాలను ఆలపించారు. కామ్రేడ్ విమలక్క సభకు అధ్యక్షురాలు గా వ్యవహరించారు.తమ్మారెడ్డి భరద్వాజ, దివి కుమార్, ఏకే ప్రభాకర్, ఇది శెట్టి శంకర్, కొల్లాపురం విమల, భుజంగరావు, ప్రొఫెసర్ లక్ష్మి, లాంటి ప్రముఖులు వేదిక నలంకరించారు. సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 50 వసంతాలు పూర్తి చేసుకున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సంఘానికి అభినందనలు తెలియజేశారు. నక్సల్ బరి ఉద్యమం నుండి శ్రీకాకుళం ఉద్యమాల ప్రేరణతో కన్నుదయ సంస్థ 50 సంవత్సరాల చరిత్ర ఎంతో గణనీయమైనది అన్నారు. పాట ప్రజలది, కష్టజీవులదనీ అరుణోదయ పాటను ప్రజల నుండి సేకరించిందని కొనియాడారు. రైతుల గురించి, స్త్రీల గురించి, వివిధ ప్రజల గురించి అనేక పాటలను అరుణోదయ సమాజం ముందుకు తీసుకువచ్చిందని వక్తలు కొనియాడారు. అరుణోదయ తన మాటను పాటను ప్రజలకు అంకితం చేసిందని అన్నారు. బహుజన బతుకమ్మ లాంటి ఎన్నో కార్యక్రమాలు అరుణోదయం ముందుకు తీసుకెళ్లిందని గుర్తు చేశారు. సాంస్కృతిక ఉద్యమంలో ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన కళాకారులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. కుల పోరాటాలు, పర్యావరణ, బహుజన బతుకమ్మ, స్త్రీల సమస్యలను అరుణోదయ ప్రజల్లోకి తీసుకెళ్లడం గర్వంగా ఉందన్నారు. ఎంతోమంది కళాకారులు తయారు చేయడమే కాకుండా సమాజం పట్ల బాధ్యతను నేర్పడం కేవలం అరుణోదయ సంస్థకు మాత్రమే దక్కింది అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ పోతుల, ఏపూరి మైసూర్, రాకేష్, అనిత, ప్రొఫెసర్ కాసిం, ఓయూ జాబ్ చైర్మన్ దరువు అంజన్న, మోత్కూరు శ్రీనివాస్, అరుణ, పట్లోళ్ల నాగిరెడ్డి, సుజ్ఞానమ్మ, సుధాకర్, రాము పవర్, బి ఎస్ రాములు, ప్రొఫెసర్ లక్ష్మి, కాకి భాస్కర్, విరసం వరలక్ష్మి, జిలకర శ్రీనివాస్, కూలర్ శాంతమ్మ, కరీం భాష, మస్తాన్, డప్పు భాస్కర్, గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయి



- **తాసిల్దార్ మన్నన్**

**చిన్నశంకరంపేట్, మే 14 (జనం సాక్షి) :** బుధవారం చిన్న శంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు ఈ క్రీడల్లో తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది విన్నర్ గా నిల్వగా ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది రన్నర్ గా నిలిచారు ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు క్రీడల్లో గెలుపు ఓటమి సహజమని ఓడిన వారు నిరుత్సాహపడకుండా గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎంపీడీవో కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు కృషి చేయాలి



**మొయినాబాద్, మే 14 (జనం సాక్షి) :** విద్యార్థుల భవిష్యత్తు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులపై విద్యా యజమాన్యంపై ఉందని ఇంటర్నేషనల్ పల్లవి పాఠశాల ప్రిన్సిపాల్ హేమ మాడభూషి పేర్కొన్నారు. బుధవారము మండల మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ సమీపంలో గల పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలు బిఎస్సి ఫలితాల సందర్భముగా పాఠశాల యజమాన్యం ఎమ్మెల్సీ పాఠశాల చైర్మన్ మల్కా కొమురయ్య ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందిస్తూ సన్మానించారు ఆమె మాట్లాడుతూ ఇంటర్నేషనల్ పల్లవి పాఠశాలలో 100% ఉత్తీర్ణత 85 4% అత్యుత్తమ సంఘటన సాధించడంతో విద్యార్థులు ఉపాధ్యాయులు గర్వపడేలా ఫలితాలు సాధించాలని తెలిపారు 2024.. 25 విద్యా సంవత్సరం బిఎస్సి బోర్డు ఫలితాల్లో అసాధారణ ప్రతిభను ప్రదర్శించారు ఈ బ్యాచ్ పాఠశాల మొట్టమొదటి గ్రేడ్ 12 బ్యాచ్ కావడంతో యజమాన్యం విద్యార్థులను వారి తల్లిదండ్రులకు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు ఈ ఫలితాలు పాఠశాలకు గర్వకారణమని అన్నారు 12 వ తరగతి టాపర్లలో స్నేహ కుమారి 96% టీజర్ సోమాని 90% పగవి రెడ్డి 94% సాధించడం గర్వకారమన్నారు పదవ తరగతిలో టాపర్గా రాపు రిషి 98 శాతం కీర్తికుప్ప 97% గౌరీ కుమారి 97% సాధించారని సూచించారు విద్యార్థుల పట్టుదల కృషి క్రమశిక్షణను హామీ అభినందించారు ఉపాధ్యాయులకు కృషితో పాటు విద్యాసంస్థల సహకారం తల్లిదండ్రుల కృషి విద్యార్థులకు మంచి ఫలితాలను అందించిందని పేర్కొన్నారు ఈ విజయోత్సవ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ భవనాల నిర్మాణం పర్యవేక్షణ చేసే అధికారులెక్కడ..?

- **మామూళ్ల మత్తులో కిందిస్థాయి అధికారులు**




**హైదరాబాద్ సిటీ/అల్వాల్, మే 14 (జనంసాక్షి) :** జిహెచ్ఎంసి పరిధిలోని అల్వాల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పర్యవేక్షించే అధికారులే కరువయ్యారు. అక్రమ సెల్లార్లు,అక్రమ అదనపు అంతస్తులు, సెట్ బ్యాక్‌లు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. భవన నిర్మాణ అనుమతులు రెసిడెన్షియల్ తీసుకుని మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా కమర్షియల్ నిర్మాణాలు నిర్మిస్తున్నారు. సర్కిల్ ఆఫీసుకి టౌన్ ప్లానింగ్ ఏసీపీ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది మామూళ్ల మత్తులో పడి ఈ అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. గతంలో నోటీసులు ఇచ్చినవి, కోర్టు పరిధిలో ఉన్నవి కూడా పూర్తి నిర్మాణాలను నిర్మిస్తున్నా కూడా పర్యవేక్షించే అధికారులు లేకపోవడంతో వారి దందా మూడు పువ్వులు,ఆరు కాయలు లాగా కొనసాగుతుంది. అల్వాల్ డివిజన్ రాజీవ్ గాంధీ స్టాచ్యు దగ్గర సిండికేట్ రైతుల సేవా సహకర సంఘం లిమిటెడ్ భవనం ఎటువంటి సెట్ బ్యాక్ లు లేకుండా నాలుగు అంతస్తులు కలిగిన నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణంలో అక్రమంగా మూడు కమర్షియల్ నిర్మాణాన్ని నిర్మించారు. ఓల్డ్ అల్వాల్ నుండి లయోలా కాలేజ్ వెళ్లే రోడ్ లో గతంలో జిహెచ్ఎంసి సీల్ చేసిన 5 అంతస్తుల భవనంలో ప్రస్తుతం వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఐజి స్టాచ్యు దగ్గర ఓల్డ్ అల్వాల్ నుండి జొన్న బండ వెళ్లే రోడ్డులో లక్ష్మీ ఎంక్లేవ్ లో అక్రమ 3 అంతస్తుల కమర్షియల్ నిర్మాణం. అదే రోడ్డులో మూడు అంతస్తు ల భవనం. వీబీఆర్ గార్డెన్ పక్కన ,శ్రీ బేకరీ ముందు, ఫాథర్ బాలయ్య నగర్ బస్ స్టాప్ ముందు అక్రమ సెల్లార్లు నిర్మిస్తున్నా మామూళ్ల మత్తులో పడి టౌన్ ప్లానింగ్ అధికారులు లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదు.

## అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి

- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**రఘునాథపాలెం, మే 14 (జనంసాక్షి) :** అభివృద్ధి పనులు పది కాలాలపాటు ఉండేలా నాణ్యతతో చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు రఘునాథపాలెం మండలం చింతగుర్తి గ్రామం ఎస్.సి. కాలనీలో సి.ఆర్.ఆర్. (ఎస్.సి.పి.) నిధులు 40 లక్షల అంచనా విలువతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్ ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రఘునాథపాలెం మండలంలో అభివృద్ధి పనులను క్రమపద్ధతిలో చేపట్టామని తెలిపారు. సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులను వర్షాకాలం లోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని, ప్రస్తుతం చేసే పనులు పది కాలాలపాటు ఉండేలా నాణ్యతతో పూర్తి చేయాలని అన్నారు. మన పరిసరాలను మనం శుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్యం పాటిస్తేనే మన ఆరోగ్యం బాగా ఉంటుందని అన్నారు. రైతులు పంట మార్పిడి విధానం అమలు చేయాలని, ఆయిల్ పామ్ వంటి లాభ సాటి పంటలు సాగు చేయాలని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపట్టిందని మంత్రి తెలిపారు. రఘునాథ పాలెం మండలంలో వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని, ఆదర్శ మండలంగా దీనిని అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు పకడ్బందీగా చేపట్టామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ ఎర్రగర్ల హనుమంతరావు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు, పోక్స్ చట్టాలపై అవగాహన



**మల్దకల్, మే 14 (జనంసాక్షి) :** మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం,మల్దకల్ మండలంలోని సద్దలోనిపల్లి గ్రామం ఉపాధి హామీ కూలీలతో జనరల్ స్పెషలిస్ట్ మాట్లాడుతూ బేటి బచావో బేటి పడావో బాలికలని రక్షిద్దాం బాలికలను చదివిద్దాంఅనగా లింగ సమానత్వం సాధించడం,ఆడపిల్లలు కచ్చితంగా చదువుకునేటట్లు చూడాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను అక్రమాలను దృష్టిలో పెట్టుకొని,బాల్య వివాహాల నిరోధక చట్టం,గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిరోధక చట్టం, గురించి అవగాహన కల్పించడం జరిగింది.గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం ద్వారా ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే వారిపై ఈ చట్ట ప్రకారం శిక్ష విధించబడుతుంది.సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుంది జీరో నుంచి పది సంవత్సరాల ఆడపిల్లలకి ఈ యొక్క పథకం ఉపయోగపడుతుంది దీనిని గ్రామంలో ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోగలరు, బాల్య వివాహాలు ఫోక్సో ఆక్ట్ గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఆపదలో ఎవరైనా బాలలు కనిపించినట్టయితే 1098 కి సమాచారం అందించగలరు,ఈ 1098 తో పాటు 181, 1930 ,100, మొదలైన హెల్ప్ లైన్ ల గురించి అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రకాష్ ,చైల్డ్ లైన్ కళావతి, పంచాయతీ సెక్రెటరీ రేణుకా,ఫీల్డ్ అసిస్టెంట్ లావణ్య, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## డప్పూర్‌లో పిడుగుపాటుకు బాలుడు మృతి

- **మరో నలుగురికి తప్పిన పెను ప్రమాదం**



**న్యాల్‌కల్, మే 14 (జనం సాక్షి) :** పిడుగుపాటుకు గురై ఓ బాలుడు మృతి చెందగా, కుటుంబ సభ్యులకు తృటిలో ప్రాణాపాయం తప్పిన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా పిడుగుపాటు ప్రమాదం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఘటన స్థలి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా, న్యాల్‌కల్ మండలం, డప్పూర్ గ్రామానికి చెందిన మల్గి ఇస్మాయిల్ గ్రామానికి చెందిన పెద్ద సుభాష్ సేట్ వ్యవసాయ పొలాన్ని కౌలుగా తీసుకొని గత కొన్ని సంవత్సరాలుగా సాగు చేస్తున్నాడు. బుధవారం ఉదయం ఇస్మాయిల్ తో పాటు కుమారుడు సాబేర్ (15), మరో నలుగురు కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పొలానికి వెళ్లారు. సాగు చేసిన ఉల్లి పంటను ఓ వాహనంలో నిలువ చేస్తుండగా.. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. భారీవర్షం, ఉరుములు, మెరుపులతో బాలుడు సాబేర్ (15) ఓ చెట్టు కింద సేద దీరుతుండగా ఒక్క సారిగా పిడుగుపాటుకు గురయ్యాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు బీదర్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. ఇస్మాయిల్ (45)కు, కూతురికి స్వల్ప గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులకు తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఘటన విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై చెల్లా రాజశేఖర్ తో పాటు పోలీసుల బృందం పరిశీలించారు. మృత దేహన్ని జహీరాబాద్ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## డాలర్‌హిల్స్‌లో భారీ ప్రభుత్వ భూమిని పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



**రాజేంద్రనగర్, మే 14 (జనం సాక్షి) :** మణికొండ మున్సిపాలిటీలో హైడ్రా కమిషనర్ రంగనాథన్ హైడ్రా స్పెషల్ టీం తో బుధవారం పర్యటించారు. వివరాలు ప్రకారం గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీ డాలర్ హిల్స్ కాలనీలో ని సర్వే నెంబర్ 104/పి.106/113 లలో 13440 గజాల కాలనీ పార్కు, రోడ్ల స్థలాన్ని కాపాడాలని గత కొన్ని రోజుల క్రితం స్థానిక కాలనీవాసులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. స్పందించిన హైడ్రా కమిషనర్ కాలనీ వాసులతో కలిసి ఆయా సర్వే నెంబర్లలో పర్యటించారు. ప్రభుత్వ స్థలంలో కోర్టు కేసులో ఉన్నను కూడా నిర్మాణాలు ప్రారంభిస్తున్న ఎన్సిసి నిర్మాణ సంస్థ పై పనులు ఎలా ప్రారంభిస్తారని హెచ్చరించి, జరుగుతున్న పనులను నిలిపివేయించారు. ఈ స్థలంలో ఓ నిర్మాణ సంస్థ 98 సం, లో లేఅవుట్ వేసి ఎన్సిసికి 2006 సం.లో విక్రయించింది. ఎన్సిసి నిర్మాణ సంస్థ వ్యవసాయ భూమిగా కొనుగోలు చేసిందని తిరిగి దీనిని ప్లాట్లుగా విభజించి నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ స్థలంలో సుమారు రెండున్నర ఎకరాలకు పైగా కాలనీ పార్కు స్థలము, రోడ్లకి సంబంధించిన స్థలం కబ్జా చేసి నిర్మాణాలు చేపడతారని కాలనీవాసులు లేఔట్‌తో కమిషనర్ కు వివరించగా పూర్తిస్థాయిలో పరిశీలించిన కమిషనర్ హైడ్రా పనులను నిలిపి వేయించి, పూర్తిస్థాయి వివరణకు హైడ్రా కమిషనర్ ఆదేశించారు. హైడ్రా కమిషనర్ తో డాలర్ హిల్స్ కాలనీ అధ్యక్షులు విజయ కరుణాకర్, కార్యదర్శి పీటర్ మ్యాక్చుస్, ప్రతాప్ రెడ్డి, భువనేశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి పాండురంగ మూర్తి, రాజా రామ్మోహన్ రాయ్ లు కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## కళ్యాణిలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**శంషాబాద్, మే 14 (జనంసాక్షి) :** శంషాబాద్ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అందించే డబ్బులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తహసిల్దార్ కె రవీందర్ దత్ మాట్లాడుతూ 53 మంది లబ్ధిదారులకు రూ . 530 6,148/- చెక్కులు అందజేయడం జరిగిందన్నారు. శంషాబాద్ మండలంలో 31 , మంది లబ్ధిదారులకు, మున్సిపాలిటీ పరిధిలో 22 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలోనయాబ్ తహసిల్దార్ వేణు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు కృష్ణ, సారిక, చిన్న గోల్కొండ సొసైటీ చైర్మన్ బొమ్మ దావనాకర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ సుష్మా రెడ్డి, నీరటి రాజు ముదిరాజ్, మార్కెట్ సొసైటీ డైరెక్టర్ అనేగౌని శ్రీకాంత్ గౌడ్, కిట్టు, సత్యానంద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధను కనబరచండి

**శేరిలింగంపల్లి, మే 14 (జనంసాక్షి) :** ఈ మధ్యకాలంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుని పిల్లలు మృత్యువాత పడుతున్నారని, చిన్నపిల్లలను కలిగిన తల్లిదండ్రులు ఏ మాత్రం అశ్రద్ధ వహించినా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంనుండి ఓ ప్రత్యేక ప్రకటనను చారి చేశారు. ఇటీవలి కాలంలో పార్క్ చేసిన వాహనాల్లోకి అనుకోకుండా వెళ్ళిన పిల్లలు ఊపిరాడక మృతి చెందుతున్న సంఘటనలు ఆందోళనను కలిగిస్తున్నాయన్నారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉండడానికి సైబరాబాద్ పోలీస్ అధికారులు ప్రజలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరడమైనది. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే విలువైన చిన్నారుల ప్రాణాలను కాపాడుకోవడం పెద్ద కష్టమేమీ కాదని, ప్రత్యేకించి ఆయా పిల్లల తల్లిదండ్రుల పైనే ఈ బాధ్యత అధికంగా ఉంటుందని తెలియజేశారు. తల్లిదండ్రులు పిల్లల విషయంలో తీసుకోవాల్సిన ప్రధానమైన జాగ్రత్తలలో భాగంగా వాహనాన్ని లాక్ చేయకముందు వాహనంలో ఎవరైనా ఉన్నారా లేరా అని పూర్తిగా తనిఖీ చేసుకోవాలి. అనుమానం వస్తే ముందు, వెనుక సీట్లను మరోమారు పరిశీలించుకోవాలి. కారు లాంటి వాహనాలలో, వాహనం చుట్టుపక్కల పిల్లలను ఒంటరిగా వదిలివెళ్ళకూడదు. వాహన తాళాలను పిల్లలకు అందుబాటులో ఉంచకూడదు. కారు తాళం చెవిలో పిల్లలకు అందుబాటులోకి వస్తే అనుకోకుండా వాహనంలోకి వెళ్లి చిక్కుకుపోయే ప్రమాదం ఉంటుంది. వాహనాలు ఆడుకునే ప్రదేశాలు కాదని పిల్లలకు స్పష్టంగా అర్థమయ్యేలా తెలియజెప్పాలి. వాహనాల్లో ఒంటరిగా ప్రవేశించరాదని వారికి అర్థమయ్యేలా వివరించి చెప్పాలి. వాహనాన్ని ఎప్పుడైనా లాక్ చేసేముందు కారులోని ప్రతి ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పొరపాటున పిల్లలు, పెంపుడు జంతువులవంటివి ఏమైనా లోపల లేవు అని నిర్ధారించుకోవాలి. వాహనం ఎక్కడ పార్క్ చేసినా, చివరకు ఇంటివద్ద అయినా సరే తప్పకుండా కారు డోర్లను లాక్ చేసి ఉంచాలి. రియర్ సీట్ రిమైండర్, చైల్డ్ డిటెక్షన్ అలర్ట్ వంటి భద్రతా పరికరాలను వాహనాల్లో అమర్చడం చాలా ఉత్తమం. వాహనాల విండోలకు బ్లాక్ ఫిల్ములు లేదా అధిక టింటింగ్ ఉపయోగించడం సరికాదు. తద్వారా వాహనంలో ఎవరైనా ఉంటే గుర్తించలేని ప్రమాదం ఉంటుంది. వాహనం వాడకంలో లేకపోయినప్పటికీ నిరంతరం డోర్లు, విండోలను పూర్తిగా మూసి లాక్ చేసి ఉంచాలి. పిల్లలు కనిపించకుండా పోతే, వాహనాల్లో, సమీప ప్రదేశాల్లోని వాహనాల్లో ముందుగా పరిశీలించాలి. వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నపుడు పార్క్ చేసిన వాహనాల చుట్టూ పిల్లలు ఆడుకుంటుంటే వారిపై ఓ కన్నేసి ఉంచాలి.

# మూఢనమ్మకాలను, నాటు వైద్యాన్ని నమ్మొద్దు

## ఆదివాసీల గూడాల్లో మెగా మెడికల్ క్యాంపు

## జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్




**ఆదిలాబాద్ ప్రతినిధి. (జనంసాక్షి):**

మారుమూల గ్రామాల్లో ఆదివాసీ గిరిజనులు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో మూడ నమ్మకాలు, నాటు వైద్యాన్ని నమ్మొద్దని జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. మారుమూల ఆదివాసి గ్రామాలలో ఉంటున్న ప్రజలకు వైద్య సేవలను అందించాలనే ఉద్దేశ్యం తో బుదవారం జిల్లా పోలీసు యంత్రాంగం ఆద్వర్యంలో బోథ్ మండలం పట్నాపూర్ గ్రామంలో ఈరోజు జిల్లా వైద్యశాఖ మరియు నిర్మల్ స్వప్న సూపర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. ముందుగా ఎస్పీకి గూడెం వాసులు డప్పు వాయిద్యాలు నడుమ స్వాగతం పలికి ఆహ్వానించారు. ముఖ్యంగా ఈ వైద్య శిబిరం జనరల్ మెడిసిన్, యూరాలజీ, గైనకాలజీ, న్యూరాలజీ, పీడియాట్రిషన్, ఆర్థోపెడిక్ లలో నిష్ణాతులైన వైద్య బృందం చే చికిత్స నిర్మల్ స్వప్న మల్టీస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో వైద్య చికిత్సలను అందజేయడం జరిగింది. ఈ వైద్య శిబిరం బోథ్ మండలం పట్నాపూర్, ఇన్కర్పల్లి, సుర్దాపూర్ మేడిగుడ్ గ్రామ ల నుండి దాదాపు 250 మంది ఆదివాసి ప్రజలు వైద్య శిబిరం లో పాల్గొని వైద్య చికిత్సలను పొందడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీలు వైద్యులను సంప్రదించిన తర్వాతనే మందులను, టాబ్లెట్లను, గోలీలను వాడాలని సూచించారు. అనవసరంగా జ్వరం టాబ్లెట్లు, నొప్పి టాబ్లెట్లను వాడటం వల్ల కిడ్నీ సమస్యలు, నరాలకు సంబంధించిన సమస్యలు సంభవిస్తాయని తెలిపారు. త్వరలోనే జిల్లా పోలీసు యంత్రాంగం తరపున జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని, నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కేటాయించిన ప్రదేశాలలో విధులను నిర్వర్తించాలని సూచించారు.

కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, బూత్ సీఐ ఏ వెంకటేశ్వర్ రావు, ఎస్సై ఎల్ ప్రవీణ్, అడిషనల్ డిఎం అండ్ హెచ్ ఓ రవీంద్ర ప్రసాద్, ఏ జి పి పంతం శంకర్, డాక్టర్లు శశికాంత్, స్వప్న, మల్లేష్, సచిన్ బాబు, ధ్రువన్ కుమార్, రాహుల్, దినేష్, బోథ్ పీహెచ్సీ వైద్య సిబ్బంది, బోథ్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను త్వరగా నిర్మించుకోవాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 14 (జనం సాక్షి)**

ఇందిరమ్మ ఇండ్లను త్వరగా నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ లబ్ధిదారులకు సూచించారు. బుధవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ గ్రామం వార్డ్ నెంబర్ 1 లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మార్కవట్, ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం పేదల కోసం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 5 లక్షలతో నిర్మించే ఈ పథకం ఇండ్లను త్వరగా నిర్మించుకోవాలని అన్నారు. అడ్లూర్ గ్రామానికి చెందిన గండ్ల హేమలత కు ఇందిరమ్మ పథకం క్రింద తనకున్న 575 స్క్వేర్ ఫీట్స్ లో ఇంటి స్థలంలో ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. తన భర్త మరణించాడని, తన ఇద్దరు కొడుకులతో బీడీలు తయారు చేస్తూ పిల్లలను చదివిస్తున్నానని, తనకు ప్రభుత్వం నుండి ఇండ్ల నిర్మాణానికి మంజూరు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. తొలుత భూమి పూజ చేసి మంజూరు ఉత్తర్వులు కలెక్టర్ అందజేశారు. పేద వర్గాల కోసం ప్రభుత్వం ఆసరా కల్పిస్తున్నాదని తెలిపారు. అర్హత ఉన్న వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. తొందరగా ఇంటి నిర్మాణం చేసుకోవాలని, బేస్మెంట్ లెవెల్ వరకు నిర్మించుకున్న తర్వాత ప్రభుత్వం ఒక లక్ష తొలి విడతగా అందిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, హౌసింగ్ పిడి జైపాల్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాల్య వివాహం అడ్డగింత

## పీటల మీద నిలిచిపోయిన పెళ్లి

## వధూవరుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్

**రాజోలి / అయిజ, మే 14 (జనంసాక్షి)**

: తాళి కట్టే సమయంలో చైల్డ్‌లైన్ అధికారులు బాల్య వివాహాన్ని అడ్డుకున్న ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధి లక్ష్మిదేవి తెలిపిన వివరాల ప్రకారం..వడ్డేపల్లి మండలంలోని పైపాడు గ్రామానికి చెందిన బాలికకు అయిజ మండలంలోని చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి నిర్ణయించారు. బుధవారం ఉదయం 9.30 గ్రామంలోని రామాలయం ఆలయం వద్ద పెళ్లి జరగాల్సి ఉంది. అయితే పెళ్లికుమార్తె మైనర్ అని సమాచారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం ఉదయం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నెంబరుకు ఫోన్ చేశారు. వెంటనే జిల్లా చైల్డ్‌లైన్ అధికారులు పోలీసులతో అక్కడికి చేరుకున్నారు. అప్పటికి యువకుడు తాళి కట్టే సమయంలో అధికారులు అడ్డుకున్నారు. పెళ్లికుమార్తె వయస్సు ధ్రువీకరణ వివరాలను కుటుంబసభ్యుల నుంచి ఆరాతీశారు. ఆధార్ కార్డుతో పాటు పాఠశాల రికార్డుల్లోనూ బాలికకు 16 ఏళ్ల 11 నెలలుగా గుర్తించారు. దీంతో మైనర్‌కు పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని, వివాహాన్ని నిలిపివేయాలని బాలిక తల్లిదండ్రులకు సూచించారు. పెళ్లికి తాము అంతా సిద్ధం చేసుకున్నామని, కొద్దీక్షణాల్లో పెళ్లి నిలిపివేయడం సరికాదని, పెళ్లికి అవకాశం ఇవ్వాలని అధికారులను వేడుకున్నారు. అధికారులు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు బాలికను, కుటుంబ సభ్యులను గద్వాల జిల్లాకు తరలించి బాలల పరిరక్షణ కమిటీకి అప్పగిం చారు. వారు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం బాలికను సఖి కేంద్రానికి తరలించారు. 18ఏళ్లు దాటితే వివాహం చేయాలని సూచించామన్నారు. బాల్యవివాహాలపై 1098కు సమాచారం ఇస్తే, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

# తునికి ఆకు సేకరణలో గాయపడిన వారికి నష్టపరిహారం అందించాలి

## తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెల రాము

**కొత్తగూడ మే 14 (జనంసాక్షి)**



: వేసవి కాలం లో ఏజెన్సీ లో రెండో పంటగ భావించే తునికి ఆకు సేకరణలో ఇటీవల గాయపడిన వారికీ 5 లక్షలు నష్ట పరిహారం అందించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ డిమాండ్ చేస్తుంది.కొత్తగూడ మండల కేంద్రంలో తుడుం దెబ్బ మండల అధ్యక్షులు పూనెం సందీప్ ఏర్పాటు చేసిన సమావేశానికి తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల రాము పాల్గొని మాట్లాడుతూ...ఏజెన్సీ ప్రాంతంలో నివసించే ఆదివాసులు వేసవి కాలంలో తునికాకు సేకరణని రెండవ పంటగా భావిస్తారు.ఇది మే నెలలో తునికి ఆకు సేకరించడం జరుగుతుంది.ఈ ఆకు సేకరించే క్రమంలో వారికి అడవిలో మృగాల నుండి ప్రాణ హాని ఉంటుంది. కావున వారు ఆకు సేకరణ సమయంలో గాయపడటం జరుగుతుంది. ఇటీవల ఉమ్మడి కొత్తగూడ మండల పరిధిలో తునికి ఆకు సేకరణలో భాగంగా కొత్తగూడ మండలం లక్ష్మీపురం గ్రామంలో ఇద్దరు మహిళలు తునికి చెట్టు ఎక్కి ఆకు కొస్తున్న సమయంలో ప్రమాదవశాస్తూ కిందపడి గాయాలపాలు కావడం జరిగింది.అలాగే గంగారం మండలం కొడిశాల మిట్ట గ్రామం లో ఒక యువకుడికి, మామిడి గూడెం గ్రామం లో ఒక మహిళ కు అడవి దున్న ఎదురు పడి తీవ్రంగా గయా పర్చడం జరిగింది.ఆయా యూనిట్ల కాంట్రాక్టర్స్ అలాగే ప్రభుత్వం స్పందించి తునికి ఆకు సేకరణలో గాయపడిన వారికీ ఒక్కొక్కరికి 5 లక్షల నష్ట పరిహారం అందించాలని ఈ సందర్భంగ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో కొత్తగూడ, మల్లెల సారయ్య ప్రధాన కార్యదర్శి, చుంచ నరేష్, కుంజ సాయి తేజ, కుంజ ముకేష్, కోరం సతీష్, కోరం సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసంకు సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదు

## టిపిసిసి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎండి. అజీజ్ పాషా

**హుజూర్ నగర్, మే 14 (జనంసాక్షి):**



నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపిక సిబిల్ స్కోర్ ఆధారంగా జరుగుతుందని సోషల్ మీడియా చేస్తున్న ప్రచారం అవాస్తవమని టిపిసిసి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎండి. అజీజ్ పాషా, పట్టణ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జున్ లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులకు వరంగా రాజీవ్ యువ వికాసం పథకం ఉపయోగపడుతుందన్నారు. ఈనెల 15 నాటికి జిల్లా సెలక్షన్ కమిటీకి , 28 నాటికి శాంక్షన్ ప్రక్రియ పూర్తి చేసి, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నుంచి నియోజకవర్గాల వారిగా శాంక్షన్ లెటర్ల పంపిణీ జరుగుతుందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో 57 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం, అయినా ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు రానీ నిరుద్యోగుల కోసమే దేశంలో ఎక్కడ లేని విధంగా 9వేల కోట్ల రూపాయలతో నిరుద్యోగ యువత స్వయం శక్తితో ఎదిగేలా రాజీవ్ యువ వికాసం పథకం తోడ్పడుతుందన్నారు. యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకే రాజీవ్ యువ వికాసం పథకం. లబ్ధిదారుల ఎంపికకు సిబిల్ స్కోర్ తో సంబంధం లేదు.సిబిల్ స్కోర్ కావాలంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దు. సిబిల్ స్కోర్, ట్రాక్ రికార్డు, రికవరీ లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోరు అన్నారు. గత నాలుగేళ్లుగా ఎస్సీ ఇతర కార్పొరేషన్ల లోన్లు తీసుకునే వారికి కాకుండా కొత్తవారికి రుణాలు ఇవ్వాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమ్మెట సుబ్బరాజు, ఎడవల్లి వీరబాబు, పాశం రామరాజు, చెన్నం శ్రీనివాస్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రంలో తడిసిముద్దయిన వడ్లు

## కన్నీళ్లు పెట్టుకున్న రైతులు

**ఏటూరునాగారం, మే 14(జనంసాక్షి)**



: మండలం గోగుపల్లి గ్రామంలో అకాల వర్షం కారణంగా సరైన సమయంలో వడ్లను కొనుగోలు చేయక తడిసి ముద్దైన వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమ్మడానికి కొనుగోలు కేంద్రానికి తెచ్చిన వడ్లు, వడ్ల బస్తాలు వరదల్లో కొట్టుకపోవడంతో దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కన్నీళ్లు పెట్టుకుంటే ఈ ప్రభుత్వానికి కనబడడం లేదా! రైతు లేనిదే రాజ్యం లేదు అలాంటి రైతులను ఇబ్బందులు పెట్టుకుంటే మీకు పుట్టగతులు ఉండవని ఆమె హెచ్చరించారు. కొనుగోలు కేంద్రానికి తెచ్చిన వడ్లను ఎందుకు కొనుగోలు చేస్తలేరో చెప్పాలని మీ నిర్లక్ష్యం కారణంగా రైతులను నష్టపోతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఏటూరునాగారం మండల పార్టీ అధ్యక్షులు గడదాస్ సునీల్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ఎండి ఖజా పాషా, మాజీ వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ కోనేరు నాగేష్, పిఏసిఎస్ డైరెక్టర్ మాదరి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజాపూర్ గ్రామ తరలింపుకు చర్యలు చేపట్టాలి

## సింగరేణి సి అండ్ ఎండి బలరాం నాయక్ కు సూచించిన మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, (జనంసాక్షి) :**



పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రాజాపూర్ గ్రామాన్ని సింగరేణి నిర్వాసిత గ్రామంగా గుర్తించి గ్రామాన్ని తరలింపుకు తగు చర్యలు చేపట్టాలని సింగరేణి సీ అండ్ ఎం డి బలరాం నాయక్ కు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సూచించారు. హైదరాబాద్ లోని సచివాలయంలో రాజాపూర్ గ్రామస్తులు మంథని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్, రాజాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు పుల్లెల కొమురయ్య ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసి సింగరేణి ఓపెన్ కాస్ట్ తో ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. వెంటనే స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు సింగరేణి సిఎండి బలరామ్ నాయక్ తో ఫోన్ లో మాట్లాడి రాజపూర్ గ్రామానికి తరలించే ఫైల్ రెడీ చెయ్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రోడ్డ బాపన్న,మాజీ సర్పంచ్ ఎరుకల బాపూరావు, మాజీ సర్పంచ్ తీగల సమ్మయ్య, పొన్నం శ్రీనివాస్,,గ్రామ బీసీ సెల్ అధ్యక్షుడు మాటేటి సాగర్ పుల్లెల శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు పుల్లెల సతీష్ కలవేన శ్రీకాంత్, కన్నూరి పర్వతాలు, పాశం కొమురయ్య, కాశెట్టి తిరుపతి, చోటమియా గడ్డం రోహిత్ పుల్లెల రాజేశం పుల్లెల సదానందం, లింగం రాజయ్య, పుల్లెల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కమిటీల్లో సీనియర్ మహిళా నేతలకు ప్రాధాన్యం లేదు



**హైదరాబాద్ (జనంసాక్షి) :**

టీ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌పై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సునీత రావు సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ కమిటీల్లో సీనియర్ మహిళా నేతలకు ప్రాధాన్యం లేకుండా పోతుందని సునీత రావు ఆవేదన వ్యక్తం చేశారు. పదవులన్నీ తన చెల్లెళ్లు, మరదల్లకు మహేశ్ కుమార్ గౌడ్ ఇచ్చుకుంటున్నాడని ఆమె ఆరోపించారు. గాంధీ భవన్‌లో మహేశ్ కుమార్ గౌడ్ చాంబర్ ఎదురుగా.. మహిళా నేతలతో కలిసి సునీత రావు ధర్నా చేశారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ మహిళలకు అన్యాయం జరుగుతుందన్నారు. నామినేటెడ్ పోస్టులతో పాటు కమిటీల్లో మహిళలకు అవకాశం కల్పించడం లేదని సునీతా రావు ఆవేదన వ్యక్తం చేశారు. “రాహుల్ గాంధీ నారీ న్యాయం నినాదం ఏం అయ్యింది? గతంలో మహిళ కాంగ్రెస్‌కి పెద్దగా ప్రియారిటీ లేకుండే.. మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నా కర్తవ్యం నిర్వహించాను.. 241 కార్యక్రమాలు నిర్వహించాం. గట్టిగా పని చేస్తుంది అని నమ్మి పార్టీ టిక్కెట్ ఇచ్చింది.. గోషామహల్ టిక్కెట్ వద్దన్న కూడా ఇచ్చారు.. నామినేటెడ్ పదవుల్లో మహిళలకు అన్యాయం జరిగింది. టిక్కెట్ ఇచ్చిన వారికి పదవులు లేవు అన్నారు. ఓడిపోయిన వారికి కూడా కార్పొరేషన్ పదవులు ఇచ్చారని సునీతా రావు గతంలో ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

# ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

## జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్

**హైదరాబాద్, మే 14 (జనంసాక్షి):**



చత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలుపుదల చేయాలని శాంతి చర్చల కమిటీ అధ్యక్షులు, విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చర్చలకు తాము సిద్ధమంటూ మావోయిస్టులు ప్రకటించినా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. ప్రకటన విడుదల చేసిన నెల రోజుల పరిధిలో 22 మంది ఆదివాసీలు, ముగ్గురు గ్రేహౌండ్ పోలీసులు, 15 మంది మావోయిస్టులు చనిపోయారని, ఇద్దరు ఎస్సైలు తీవ్రంగా గాయపడ్డారన్నారు. శాంతి చర్చలకు వస్తామని ప్రకటించిన వెంటనే కేంద్రం స్పందించి ఉంటే ఇంత మంది ప్రాణాలు పోయేవి కాదన్నారు. పాకిస్తాన్ లాంటి శత్రు దేశాలతో చర్చలు జరుపుతున్నారని, గోర్కా, బోడో ల్యాండ్ లాంటి సాయుధ తిరుగుబాటుదారులతో శాంతి చర్చలు నిర్వహించారని, వారిపై కేసులు కూడా రద్దు చేశారని, అయితే దేశంలో అంతర్భాగమైన వారితో ఎందుకు జరుపడం లేదని ప్రశ్నించారు. అభివృద్ధి కోసం చేస్తున్నామంటున్న కేంద్రం మావోయిస్టుల ప్రభావం లేని ఆదివాసీ ప్రాంతాలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తక్షణమే చర్చలకు పిలువాలని, ఆదివాసీ ప్రాంతంలో శాంతి నెలకొల్పాలని కోరారు. ఈ సమావేశంలో శాంతి చర్చల కమిటీ ఉపాధ్యక్షులు కందిమల్ల ప్రతాప్ రెడ్డి, సభ్యులు ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, జైసింగ్ రాథోడ్, న్యాయవాది వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప ఆలయానికి మంత్రముగ్ధులైన సుందరీమణులు

## అపూర్వ ఘన స్వాగతం పలికిన జిల్లా యంత్రాంగం

## ఆలయ విశిష్టతను తెలిపిన మంత్రి సీతక్క

**ములుగు/వెంకటాపూర్, మే14 (జనంసాక్షి):**



ములుగు జిల్లా రామప్ప ఆలయానికి సందర్శించిన ప్రపంచ సుందరిమణులు వీరికి మంత్రి సీతక్క,జిల్లా కలెక్టర్ దివాకర టీస్,ఎస్పీ శబరిష్,జిల్లా అధికారులు టూరిజం శాఖ అధికారులు ప్రపంచ సుందరి మహిళలకు ఘన స్వాగతం పలికారు.గుస్సాడీ నృత్య ప్రదర్శన ఒగ్గుడోలు ప్రదర్శన ద్వారా కళాకారులు ఆత్మీయ స్వాగతం పలికారు.అనంతరం దేవాలయంలోకి చేరుకున్న సుందరిమణులు ఎవరికి వారే స్వయంగా కాళ్లు కడుక్కొని పూజలు చేసేందుకు ఆలయంలోకి వెళ్లారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు సిబ్బంది, ఆలయ అర్చకులు హరిశ్ శర్మ,ఉమా శంకర్ పూర్ణ కుంభం తో వారికి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత చరిత్ర ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.పురాతన ఆలయం రామప్ప ఆలయాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఆలయ తీరుతన్నులను తనివి తీర తిలకించి ఫిదా అయ్యారు.తెలుగుదనం ఉట్టిపడేలా.. చీర కట్టుకొని తిలకం దిద్దుకొని అచ్చం తెలుగు అమ్మాయిల లాగా.. రామప్పలయం సందర్శించిన ప్రపంచ సుందరిమణులు, ఆలయ విశిష్టతను తెలుసుకున్న అందగత్తెలు, ఆలయానికి సంబంధించిన చిత్రాలను సెల్ఫోన్లో ఫోటోలు తీసుకున్న సుందరిమణులు అనంతరం రాణి రుద్రమదేవి వేషధారణలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్పర్సన్ అలేఖ్య పుంజరి ప్రదర్శించినారు.అనంతరం రంజిత్ పేరణి నృత్య కళా బృందం వారిచే పేరణి నృత్య ప్రదర్శన ను ప్రపంచ సుందరిమణులు తిలకించారు.

# కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు..!

- కంటితుడుపు చర్యగా అధికారుల పర్యవేక్షణ
- మిల్లర్ల యజమానులకు కఠినమైన ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌కు అభ్యర్థన

**కనగల్లు, మే 14 (జనం సాక్షి) :** ప్రభుత్వం రైతుల పండించిన ప్రతి గింజను కొంటామని ప్రకటనలు చేస్తున్నాయి తప్ప ఆచరణలో మాత్రం అమలు కాక అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. యాసంగిలో వరి ధాన్యం అంచనాలకు మించి పంట పండటం, ఈ సీజన్లో ఇంత ధాన్యం వస్తదని అధికారులు నివేదిక ప్రభుత్వానికి ఇచ్చినప్పటికీ వసతులు కల్పించడంలో విఫలమైంది. ప్రతి ఊరికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లలో చూపించిన శ్రద్ధ మిల్లుల కేటాయింపు, లారీల సమకూర్చడంలో ప్రభుత్వ పాలకులు, అధికారులు ఘోరంగా వైఫల్యం చెందారని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. కొనుగోలు ప్రారంభం అయిన దగ్గర్నుంచి ఎప్పటికప్పుడు కేంద్రాలతో పాటు, మిల్లులను మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ చేస్తూ ఏ మిల్లుకు ఇంత టార్గెట్ ఉంది అని తెలుసుకోవాల్సిన బాధ్యత ఉండగా ఈ విషయాలలో ఆలస్యం చేయడం కారణంగా పక్క రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొని రహస్యంగా మిల్లులలో దిగుమతి చేసుకున్నారని అందుకే మండలంలో పండించిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం మిల్లర్ల యజమానులు తాలు, తరుగు పేరుతో పలు రకాల కొరివిలు పెట్టి రోజుల తరబడి లారీలను దిగుమతి చేసుకోకుండా మాకు ఇచ్చిన టార్గెట్ పూర్తి అయిందని నికచ్చితంగా చెబుతూ లారీల నుంచి వడ్ల బస్తాలను దించుకోకుండా వెనుకకు



పంపుతుండడంతో లారీ యజమానులు వెయిటింగ్ చార్జి కింద అదనపు కిరాయి లు వసూల్ చేయడం జరుగుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఒక్కొక్క కేంద్రాలను మాచర్ వచ్చిన వేల కొద్ది క్వింటాల ధాన్యం నిల్వ ఉండటం, తూకం వేసిన బస్తాలు కేంద్రాలలో మూడు నుంచి నాలుగు రోజులు లారీల కోసం ఎదురు చూడడం జరుగుతుంది. గత వారం రోజుల క్రితం అకాల వర్షాలకు తకం వేసిన బస్తాలు తడిసి మొలకెత్తడంతో బస్తాలను దిగుమతి చేసుకోవడంలో మిల్లర్లు ముందుకు రావడం లేదు. వడ్ల కొనుగోలు చురుకుగా జరిగేలా చూడడంతో పాటు లారీల బస్తాలను వెంటనే దిగుమతి అయ్యేలామిల్లర్ల యజమానులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో పాటు, లారీల కొరత లేకుండా చూడాలని మండల రైతులు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని వేడుకుంటున్నారు.

# ఈ నెల 22 నుండి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

- పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు.
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 14 (జనంసాక్షి) : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలను శుభ్రం చేయించాలని, తాగునీటి వసతి కల్పించాలని, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. వైద్య సిబ్బంది వద్ద మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా పెట్టుకోవాలని,పరీక్షలు నిర్వహించే రోజుల్లో ఆర్టీసీ వారు బస్ లను సమయానుకూలంగా నడిపించాలని, సెస్ అధికారులు విద్యుత్ కోతలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. పరీక్ష పత్రాలు పోలీస్ బందోబస్తు మధ్య తరలించాలని, చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సీసీ కెమెరాలు ఉండాలని తెలిపారు.

### ఉదయం.. మధ్యాహ్నం వేళల్లో పరీక్షలు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ,ప్రైవేటు కళాశాలలకు చెందిన విద్యార్థులు ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్నారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 2385 మంది,సెకండ్ ఇయర్ పరీక్షలకు 1478 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇంటర్మీడియట్



పరీక్షలు ఈ నెల 22 నుంచి 29వ తేదీ దాకా నిర్వహించనున్నారు. ఫస్ట్ ఇయర్ వారికి పరీక్షలు ఉదయం 9 గంటలకు మొదలై పగలు 12 గంటల దాకా, సెకండ్ ఇయర్ వారికి 2.30 గంటలకు మొదలై 5.30 గంటల దాకా చేపట్టనున్నారు. జిల్లాలో మొత్తం 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

### 144 సెక్షన్ అమలు..

ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఎస్బీ డీఎస్పీ మురళి, డీఈఐఓ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ రజిత, ఆర్టీసీ, పోస్టల్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు

- మిల్లర్లు ధాన్యంను వెంటనే దిగుమతి చేసుకోవాలి
- ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన
- వన మహోత్సవం నాటికి మొక్కలు సిద్ధం చేయాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట ప్రతినిధి, మే 14 (జనంసాక్షి) : జిల్లాలో చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయటం జరుగుతుందని రైతులకి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ భరోసా ఇచ్చారు. బుధవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తిరుమలగిరి మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా తిరుమలగిరి ఎస్ఆర్ రైస్ మిల్లును ఆకస్మితంగా తనిఖీ చేశారు. మిల్లర్లను కొనుగోలు సెంటర్ నుంచి వచ్చిన లారీలను వెంటనే దిగుమతి చేసుకోవాలని హమాలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. అనంతరం రాజన్న కోక్యా నాయక్ తండాలోని నర్సరీని సందర్శించి, బెడ్ లో ఉన్న ఖాళీలను అందులో నూతన విత్తనాలను వేసి వన మహోత్సవం నాటికి మొక్కలను సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. రాజన్న కొక్య



నాయక్ తండాలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. ఇసుక సకాలంలో అందుతుందా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం చేసే మేస్త్రిని ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఇంటి నిర్మాణం పూర్తిచేయాలని అన్నారు. తొండలోని ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలు కేంద్రంలోని సీరియల్ రిజిస్టర్ లను తనిఖీ చేసి సీరియల్ ప్రకారమే కాంటా వేసి మిల్లులకి తరలించాలని నిర్వాహకులకి సూచించారు. నాణ్యత కలిగిన ధాన్యమును కొనుగోలు చేసి గ్రేడింగ్ ను ముందే రైతులకు తెలియజేయాలని నిర్వాహకులకు చెప్పారు. ఇప్పటి వరకు తొండ ఐకేపీ కొనుగోలు కేంద్రం నుండి 5539.20 క్వింటాల్ ధాన్యం మిల్లులకి తరలించటం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. తొండ గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థుల యూనిఫాంల కుట్టు కేంద్రాన్ని సందర్శించారు. యూనిఫాములను పరిశీలించి నాణ్యతగా కుట్టాలని మహిళలను కోరారు. తొండ గ్రామపంచాయతీ రికార్డులను ఆకస్మితంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న తిరుమలగిరి మున్సిపల్ కార్యాలయం పరిశీలించి నిర్మాణం త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని అధికారులకి సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శానిటేషన్, తాగు నీరు సరఫరా, టాక్స్ వసూలు, బిల్డింగ్ అనుమతులు, ఎల్ఆర్ఎస్ పై పలు విషయాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై మేనేజర్ ప్రసాద్, తహసిల్దార్ బి.ప్రసాద్, ఎంపీడీవో లాజర్, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఏపిఎం మధుసూదన్, ఆర్ఐలు, పంచాయతీ కార్యదర్శులు, యాకుబ్ రెడ్డి, కిరణ్, వివోఏ సంధ్య, సులోచన అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలు అందించడం కోసం కృషి చేయాలి

- పోలీస్ యూనిఫాం అనేది సమాజంలో ఒక గుర్తింపు
- ప్రజల రక్షణ..గురుతర బాధ్యత
- సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి, మే 14 (జనంసాక్షి) :** జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల నందు పని చేస్తూ 5 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న 64 మంది కానిస్టేబుల్ లకు కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ పోలీస్ యూనిఫాంకు సమాజంలో ప్రత్యేకమైన స్థానం ఉందని, ప్రజల దృష్టి పోలీసులపై ఉంటుందని అన్నారు. ఉత్తమ సేవలు అందించడానికి కృషి చేయాలని అన్నారు. సమాజ రక్షణ, పౌరుల రక్షణ మన ప్రధాన విధి, గురుతరమైన బాధ్యత అన్నారు. జిల్లా పోలీస్ సిబ్బంది కష్టపడి పని చేస్తారని పేరు ఉందని, ఆ పేరును, పోలీసు శాఖ, యూనిఫాం గౌరవాన్ని కాపాడుతూ పని చేయాలని పేర్కొన్నారు. కష్టపడి పని చేస్తూ తోటి సిబ్బందికి పనిలో సలహాలు ఇస్తూ ఆదర్శంగా ఉండాలని కోరారు. స్టేషన్ పరిధిలో జరిగే సాంఘిక కార్యకలాపాలు గుర్తించి నిరోధించడంలో కృషి చేయాలని సూచించారు. మంచి ఆహార అలవాట్లు కలిగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, సమయం దొరికినప్పుడు వ్యాయామం చేయడం, యోగ చేయడం లాంటి చేయాలన్నారు. అదనపు ఎస్పీ నాగేశ్వర రావు మాట్లాడుతూ కోరుకున్న పోలీస్ స్టేషన్ కు పోస్టింగ్ ఇచ్చారని, అధికారుల అంచనాలకు అనుగుణంగా పని చేయాలని అన్నారు. పోలీసు సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ సిబ్బందికి అందరికీ అనుకూలంగా బదిలీ చేశారని జిల్లా ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, ఏఆర్ డీఎస్పీ నరసింహ చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగభూషణరావు, పోలీసు సంఘం అధ్యక్షులు రామచందర్, ఆర్ఎస్ఐ మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించిన జిల్లా గ్రంథాలయ చైర్మన్



**బొంరాస్‌పేట, మే 14 (జనం సాక్షి) :** మండల పరిధిలోని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వము నిర్దేశించిన కొలతల ప్రకారం ఇండ్లను నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింలు గౌడ్, మండల ,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం దిగుమతిని వేగవంతం చేయాలి

- మిల్లర్లు హమాలీల సంఖ్యను పెంచాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట ప్రతినిధి, మే 14 (జనంసాక్షి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, మిల్లర్లు మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి వేగవంతంగా జరుపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లో సంబంధిత అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి వేబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దాన్యం కొనుగోలు సెంటర్ నుండి ఎగుమతి అయి వచ్చిన లారీలను వెంటనే మిల్లర్లు మిల్లుల వద్ద వేగంగా దిగుమతి చేసుకోనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిల్లర్లు తప్పనిసరిగా హమాలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద లారీలు వచ్చిన వెంటనే ధాన్యం ఎగుమతి త్వరగా అయ్యేలా చూడాలని సెంటర్ ఇన్చార్జ్ లను ఆదేశించారు. గన్ని బ్యాగుల కొరకు సెంటర్ ఇంచార్జీలు ముందు రోజే వివరాలు పంపాలని తెలిపారు. ఎండలు బాగా ఉన్నందున సాయంత్రం నుండి రాత్రి వేళలో ధాన్యం కొనుగోలు సెంటర్ల వద్ద లైట్లు ఏర్పాటు చేసి ధాన్యం ఎగుమతి జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. హమాలీలు గ్రామంలోని ఒక ధాన్యం కొనుగోలు సెంటర్ పూర్తయిన వెంటనే వెళ్ళిపోకుండా ప్రక్కనే ఉన్న మరొక దాన్యం కొనుగోలు సెంటర్ వద్దకు వెళ్లి ఎగుమతి దిగుమతులలో పాల్గొనాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సెంటర్ ఇన్చార్జీలు జాగ్రత్తగా వ్యవహరించాలని,




ధాన్యం లోడు త్వరగా అయ్యేలా చూడాలని సూచించారు. సెలవు రోజుల్లో కూడా మిల్లుల వద్ద దిగుమతి జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాల వారీగా ధాన్యం కొనుగోలు, అలాగే మిల్లుల వద్ద దిగుమతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు ప్రతిరోజు కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని, త్వరగా ధాన్యం ఎగుమతి దిగుమతులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వారం రోజులలోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి వివి అప్పారావు, డిసిఓ పద్మ, డిఎం సివిల్ సప్లై ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్ నాయక్, డిఎం మార్కెటింగ్ శర్మ, అధికారులు, అన్ని మండలాల కొనుగోలు కేంద్ర సెంటర్ల ఇన్చార్జీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# అందాల పోటీలు ప్రారంభించడం కాదు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి

- సన్న వడ్లు కొనండి...మక్క కొనుగోలు చేయండి
- రైతు బోనస్ బోగస్ అయింది
- అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు
- హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**హుజురాబాద్, మే 14 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచ అందాల పోటీలను ప్రారంభించడం మానుకొని రైతుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఎద్దేవా చేశారు. బుధవారం ఇల్లంతకుంట మండలం కనపర్తి గ్రామంలో అకాల వర్షం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రైతులను అన్ని విధాల ఆదుకుంటామని ఎన్నికల సందర్భంగా చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రైతులను అన్ని విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తుందని ఆయన అన్నారు. రైతులు పూర్తిస్థాయిలో కోతలు జరిగినప్పటికీ ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. రైతుల కొనుగోలు చేసిన ధాన్యానికి బోనస్ ఇస్తామని ముఖ్యమంత్రి బోగస్ మాటలు చెప్పారని అన్నారు. రైతులు పండించిన పంటలకు బోనస్ ఇవ్వడం పక్కన పెడితే కనీసం కొనుగోలు చేసే దుస్థితి కూడా లేదని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వానికి నష్టం వచ్చిన పరవాలేదని కెసిఆర్ ప్రతి గింజను కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నారని గుర్తు చేశారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచ అందాల పోటీలలో ఎంజాయ్ చేస్తున్నారని అన్నారు. అకాల వర్షాలతో ధాన్యం మొత్తం తడిసి రైతన్నలు ఏడుస్తున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అకాల వర్షాలతో తెలిసిన ధాన్యాన్ని రైతులు రోడ్లపైనే ఆరబోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను అన్ని విధాల ఆదుకోవాలని వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని రకాల ధాన్యాలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

# ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు

- డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు

**మధిర, మే 14 (జనం సాక్షి) :** ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు మధిర నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా ఎర్రుపాలెం మండల కేంద్రంలో 50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లిడిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూలి దశాబ్దాల కాలంగా ప్రజల ఆకాంక్ష మేరకు ఎర్రుపాలెం మండల హెడ్ క్వార్టర్ లో 22 కోట్ల రూపాయలతో 50 పడకల ఆసుపత్రిని ప్రజా ప్రభుత్వం మంజూరు చేసి నేడు శంకుస్థాపన చేసుకుంటున్నామని అన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి వేగవంతంగా పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. గత సంవత్సర కాలంలో వైద్యశాఖ ద్వారా ప్రజా ప్రభుత్వం 11 వేల 600 కోట్ల రూపాయలను ఖర్చు పెట్టిందని అన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన దాదాపు 90 లక్షల కుటుంబాలకు వైద్యం కోసం ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితి రావద్దని ఆరోగ్య శ్రీ పథకం క్రింద కార్పొరేట్ ఆసుపత్రులలో 10 లక్షల వరకు వైద్యం చేయించుకునేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని



అన్నారు. పేదలకు 100 రోజుల ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, పేదల పిల్లల చదువు కునేందుకు వీలుగా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్వహిస్తున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నూతనంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు 11 వేల 600 కోట్లతో ప్రారంభించామని అన్నారు. ఎర్రుపాలెం మండలంలో 50 పడకల ఆసుపత్రిని నిర్మించడం ద్వారా ఇక్కడి ప్రజలకు అనారోగ్యం సమయాలలో ప్రైవేటు వైద్యశాలలకు పోవాల్సిన అవసరం ఉండదని అన్నారు. జిల్లా పెద్ద ఆసుపత్రి అభివృద్ధికి 30 కోట్ల రూపాయల నిధులను డిప్యూటీ సీఎం కేటాయించారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి లోనే నాణ్యమైన వైద్యం అందించడం ద్వారా ప్రజల ఆదాయం కాపాడటంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా 34 మంది కళ్యాణలక్ష్మి పథక లబ్ధిదారులకు రూ. 34,03,944 విలువ గల చెక్కుల పంపిణీ చేశారు.

అనంతరం ఎర్రుపాలెం మండలం కండ్రిక గ్రామంలో 2 కోట్ల 62 లక్షలతో కండ్రిక నుండి పెద్ద గోపవరం వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, బనిగండ్లపాడు గ్రామంలో బనిగండ్లపాడు నుండి బంజర రోడ్డు వరకు 5 కోట్ల 74 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, బోనకల్ మండలం కలకోట గ్రామంలో కలకోట నుండి మోటమర్రి వరకు 20 కోట్ల రూపాయలతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు, 10 లక్షల రూపాయలతో నిర్మించనున్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులకు, 12 లక్షల రూపాయలతో నిర్మించనున్న మత్స్య సంఘ భవన నిర్మాణ పనులకు, రావినూతల గ్రామంలో 280 లక్షల రూపాయలతో రావినూతల నుండి అళ్లపాడు వరకు రోడ్డు నిర్మాణ పనులకు, 800 లక్షల రూపాయలతో రావినూతల నుండి గోవిందాపురం వరకు బిటి రోడ్ రెనివల్ పనులకు డిప్యూటీ సి.ఎం. శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ట్రాన్స్కో ఎస్ఇ శ్రీనివాసా చారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. బి. కళావతి బాయి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, ఏడిఏ విజయ్ చందర్, తహశీల్దార్లు ఉషా శారద, పున్నంచందర్, ఎంపిడివో లు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# విపణి

## బీమా రంగంలో అడుగు పెట్టిన అపోలో 24/7



- త్వరలో 'హెల్త్-ఫస్ట్ క్రెడిట్ కార్డ్' విడుదల
- ముందస్తు ఆరోగ్య సంరక్షణలో భాగంగా 'అల్టిమేట్ హెల్త్ ప్రోగ్రామ్' ప్రారంభం

**హైదరాబాద్(జనంసాక్షి):** నాణ్యమైన ఆరోగ్య సేవలు మరింత మందికి అందించాలన్న లక్ష్యంతో బీమా రంగంలో అడుగు పెట్టామని అపోలో హెల్త్‌కో సీఈఓ మాధివనన్ బాలకృష్ణన్ తెలిపారు. ఈ మేరకు బంజారా హిల్స్ లో ఉన్న తాజ్ కృష్ణలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపోలో హెల్త్‌కోకు చెందిన అపోలో 24×7 ఇప్పుడు ఇన్సూరెన్స్ రంగంలో కూడా సేవలు అందించ నుందని చెప్పారు. త్వరలోనే హెల్త్, లైఫ్, జనరల్ ఇన్సూరెన్స్ పాలసీలు అందుబాటులోకి రానున్నాయన్నారు. అపోలో హెల్త్‌కో వినియో గదారుల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకమైన ఇన్సూరెన్స్ ప్లాన్లు అందించడమే అపోలో 24×7 లక్ష్యమన్నారు. కంపెనీకి ఉన్న డేటా, కస్టమర్ల ఆరోగ్యంపై అవగాహన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో పెట్టుబడులు దీన్ని మరింత విశిష్టంగా తయారు చేయనున్నాయన్నారు. రాబోయే రెండు నెలల్లో 12 బీమా సంస్థల నుంచి బీమా ఉత్పత్తులను ప్రారంభించాలని యోచిస్తున్నామన్నారు. ప్రతి ప్లాన్ కూడా అపోలో ప్రత్యేక ప్రయోజనాలతో ఉంటుందన్నారు. భవిష్యత్‌లో ఔట్‌పేషెంట్ కవరేజ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టనున్నా మన్నారు. మొదటి ఏడాదిలో రూ.80 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

## ఈ మారుతీ సుజుకీ వాహనాలపై భారీ డిస్కౌంట్

- రూ.1.15 లక్షల వరకు ఆదా

ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ నెక్సా మోడళ్లపై పెద్దఎత్తున డిస్కౌంట్ అందిస్తోంది. బాలెనో, జిమ్నీ, ఫ్రాంక్స్‌తో పాటు పలు వాహనాలపై రాయితీ ఇస్తోంది. కొన్ని వాహనాలపై ఏకంగా రూ.1.15 లక్షల వరకు తగ్గింపు అందిస్తోంది. వివిధ మోడళ్లపై నగదు తగ్గింపుతో పాటు ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ ప్రయో జనాలు కూడా అందిస్తోంది.



**బాలెనోజీ:**మారుతీ తీసుకొచ్చిన ప్రీమియం హ్యాచ్‌బ్యా క్‌పై రూ.45 వేల వరకు డిస్కౌంట్ ఇస్తోంది. మేన్యువల్ ట్రాన్స్‌మిషన్ వెర్షన్‌పై రూ.25 వేలు, ఏజీఎస్ వెర్షన్‌పై రూ.30 వేలు వరకు తగ్గింపు ఇస్తోంది. ఎక్స్ఛేంజ్ బోన స్ రూ.15వేలు అందిస్తోంది. దీంతోపాటు ఆప్షనల్ రీగల్ ఎడిషన్ యాక్సెసరీస్ కిట్‌పై కూడా తగ్గింపు ఇస్తున్నట్లు ప్రకటించింది.

**ఫ్రాంక్స్:** పెట్రోల్- డీజిల్ ఇంజిన్ వేరియంట్లపై రూ.10 వేల వరకు తగ్గింపు అందిస్తోంది. సిగ్మా వేరియంట్లపై ఈ రాయితీ లభించదు. ఫ్రాంక్స్ ఏజీఎస్ వెర్షన్‌లపై రూ.15 వేల తగ్గింపుతో పాటు రూ.15 వేల వరకు అదనపు ఎక్స్ఛేంజ్ బోనస్ పొందొచ్చు. ఇక టర్బో పెట్రోల్ వేరియంట్‌లో వచ్చిన ఫ్రాంక్స్‌పై కూడా రూ.30 వేల వరకు తగ్గింపు, రూ.43 వేల విలువైన వెలాసిటీ యాక్సెసరీస్ కిట్, రూ.15వేల ఎక్స్ఛేంజ్ బోనస్ ఇస్తోంది.

**జిమ్నీజి:**జిమ్నీ ఎస్‌యూవీపై రూ.లక్ష వరకు రాయితీ ఇస్తోంది. అయితే ఈ ఆఫర్ ఆల్ఫా వేరియంట్‌కు మాత్రమే.

**ఎక్స్‌ఎల్ 6:**నెక్సా ఔట్‌లెట్లలో విక్రయించే ఎక్స్‌ఎల్ 6పై రూ.25 వేల వరకు స్క్రాపేజ్ బోనస్ ఇస్తోంది. ప్రస్తుతం దీని ప్రారంభ ధర రూ.11.84 లక్షలు (ఎక్స్- షోరూమ్)గా ఉంది. 1.5 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో వస్తోంది.

**ఇన్విక్టో:**ఈ కారు ప్రారంభ ధర రూ.25.51 లక్షలు (ఎక్స్- షోరూమ్)గా ఉండగా.. ప్రస్తుతం రూ.25 వేల తగ్గింపు ధరకు అందిస్తున్నారు. దీనిపై రూ.లక్ష ఎక్స్ఛేంజ్ బోనస్ లేదా రూ.1.15 లక్షల వరకు స్క్రాపేజ్ ప్రయోజనాలు పొందొచ్చు.

**విటారాజి:**మారుతీ హైబ్రిడ్ ఎస్‌యూవీ అయిన గ్రాండ్ విటారా ప్రారంభ ధర రూ.11.42 లక్షలు (ఎక్స్- షోరూమ్)గా ఉంది. దీనిపై రూ.25వేల వరకు డిస్కౌంట్, రూ.50వేల వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ అందిస్తోంది. ఇక 6 ఎయిర్‌బ్యాగ్స్ వెర్షన్ ఎస్‌యూవీపై రూ.15వేల వరకు క్యాష్ డిస్కౌంట్, రూ.30వేల వరకు ఎక్స్ఛేంజ్ బోనస్ పొందొచ్చు.

**ఫోక్స్‌వ్యాగన్ :** భారత్‌లో విక్రయిస్తున్న టైగన్, వర్టస్ వాహనాలపై ఫోక్స్‌వ్యాగన్ రాయితీ ప్రకటించింది. టైగన్‌పై రూ.2 లక్షల వరకు తగ్గింపు ప్రకటించింది. 1.5 బీఎస్‌జీ జీటీ లైన్ ట్రిమ్‌పై ఈ రాయితీ పొందొచ్చు. టైగన్ 1.0జీటీ లైన్ ట్రిమ్‌పై రూ.1.45 లక్షల తగ్గింపు అందిస్తోంది.వర్టస్ కంఫర్ట్‌లైన్ వాహనంపై రూ.1.12 లక్షల తగ్గింపు అందిస్తోంది. అంటే రూ.11.56 లక్షల (ఎక్స్- షోరూమ్)గా ఉన్న కారుని రూ.10.99 లక్షలకు కొనుగోలు చేయొచ్చు. ఇక వర్టస్ క్రోమ్‌పై రూ.1.9 లక్షలు, వర్టస్ 1.5 డీఎస్‌జీ జీటీపై రూ.1.3 లక్షలు, వర్టస్ 1.0 జీటీపై రూ.80వేల వరకు తగ్గింపు పొందొచ్చు.

## లాభాల్లో ఎయిర్‌టెల్

### క్యూ4లో రూ. 11,022 కోట్లు

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి (క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 రెట్లు జంప్‌చేసి రూ. 11,022 కోట్లను తాకింది. వన్‌టైమ్ పన్ను లబ్ధి, టారిఫ్‌ల పెంపు ప్రధానంగా ప్రభావం చూపాయి. కొన్ని పన్నుసంబంధిత అంశాలలో రూ. 5,913 కోట్లు అందుకుంది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 2,072 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 27% ఎగసి రూ. 47,876 కోట్లను అధిగమించింది.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.00 | ₹ 5.02 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 88,050 (22 క్యారెట్లు) | ₹ 96,060 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,09,000

## 'బాయ్‌కాట్ తుర్కియే'





### 250% పెరిగిన క్యాన్సలేషన్లు!

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు మద్దతిచ్చిన తుర్కియే, అజర్ బైజాన్‌లపై మన దేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మన ట్రావెల్ ఏజెన్సీలు కూడా ఆ రెండు దేశాలకు ఆన్‌లైన్ బుకింగ్‌లను నిలిపివేస్తున్నట్లు ఇటీవల ప్రకటించాయి. దీంతో కొత్త బుకింగ్‌లు 60శాతం పడిపోయాయని, క్యాన్సలేషన్‌లు 250 శాతానికి చేరినట్లు ట్రావెల్ సంస్థ 'మేక్ మై ట్రిప్' వెల్లడించింది. ''తుర్కియే, అజర్‌బైజాన్‌లకు బాయ్‌కాట్ నినాదం ప్రభావం గత వారం రోజులుగా స్పష్టంగా కనిపిస్తోంది. ఈ రెండు దేశాలకు బుకింగ్‌లు 60శాతం తగ్గగా.. రద్దు చేసుకునే వారి సంఖ్య 250 శాతం పెరిగింది. మన దేశానికి సంఘీభావంతోపాటు పాటు మన సాయుధ బలగాలపై గౌరవంతో పర్యటకుల నిర్ణయాన్ని మేమూ గౌరవిస్తున్నాం" అని మేక్‌మైట్రిప్ వెల్లడించింది. అత్యవసర ప్రయాణాలను మాత్రమే సూచిస్తున్నాం. మరోవైపు ఈజీమైట్రిప్ సంస్థ కూడా ఈ రెండు దేశాలకు సంబంధించి ఇటువంటి ప్రకటనే చేసింది. గత వారం రోజులుగా తుర్కియేకు 22శాతం, అజర్‌బైజాన్‌కు 30శాతం క్యాన్సలేషన్‌లు నమోదైనట్లు పేర్కొంది. అయితే, ఇప్పటికే చేసుకున్న బుకింగ్‌లకు రద్దు చేసుకోవద్దని ఆయా ట్రావెల్ ఏజెన్సీ సంస్థలు పేర్కొన్నప్పటికీ.. పర్యటకులు మాత్రం అక్కడికి వెళ్లేందుకు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది.

## మోస్తరు లాభాల్లో సూచీలు..

- రాణించిన ఐటీ, మెటల్ స్టాక్స్

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మోస్తరు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో స్వల్ప లాభాలకు పరిమితమయ్యాయి.ముఖ్యంగా మెటల్, రియల్ ఎస్టేట్, టెక్నాలజీ స్టాక్స్ రాణించాయి. భారత్- పాక్ మధ్య ఉద్రిక్తతలు చల్లారడం, రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడంతో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించొచ్చన్న అంచనాలు ఇందుకు కారణం. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక శాతానికి పైగా లాభడ్డాయి.సెన్సెక్స్ ఉదయం 81,278.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,148.22) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీ.. 80,910.03 - 81,691.87 మధ్య కదలాడింది. చివరికి 182.34 పాయింట్ల లాభంతో 81,330.56 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 88.55 పాయింట్ల లాభంతో 24,666.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.27గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఎటర్నల్, టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఏషియన్ పెయింట్స్, టాటా మోటార్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 65.77 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3237 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.


## ఉక్రెయిన్ ఈడ్చుకెళ్లి సైన్యంలో చేర్పిస్తోంది: పుతిన్

మరికొన్ని గంటల్లో శాంతి చర్చలు మొదలుకానున్న వేళ.. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉక్రెయిన్ సైన్యంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆ దేశం ప్రజలను బలవంతంగా సైన్యంలో చేరుస్తోందన్నారు. బిజినెస్ రష్యా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పుత్నిక్ న్యూస్ కథనంలో పేర్కొంది. కానీ, రష్యా తరపున యుద్ధంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్న వాలంటీర్ల సంఖ్య క్రమంగా పెరుగుతోందని చెప్పారు. తమ సైన్యం భయపెట్టడం కంటే.. స్వచ్ఛందంగా చేర్చుకోవడాన్నే నమ్ముతుందని పుతిన్ చెప్పారు. ఉక్రెయిన్ యువతలో సైన్యంలో చేరాలన్న ఉత్సాహం ఏమాత్రం లేదని.. కానీ రష్యన్స్ మాత్రం మిలిటరీపై ఆసక్తిగా ఉన్నారనే విషయం చెప్పేందుకు ఈ రకంగా స్పందించారని సదరు పత్రిక పేర్కొంది. "కీవ్‌లో అధికారులు బలవంతంగా సైన్య సమీకరణ చేపడితే మాత్రం.. ప్రజలను వీధి శునకాల వలే పట్టుకొని ఈడ్చుకెళతారు. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో ఇలా 30,000 మందిని తీసుకెళ్లారు. కానీ, ఇక్కడ అలాకాదు.. వారే స్వచ్ఛందంగా వస్తారు. దాదాపు 60,000 మంది ముందుకొచ్చారు" అని పుతిన్ పేర్కొన్నారు.ఉక్రెయిన్‌తో సం క్షోభం మొదలైన వేళ.. 18-60 ఏళ్ల మధ్య పురుషులు దేశం వీడకూడదని రష్యా ఆదేశాలు జారీ చేసింది. 27ఏళ్ల వయసు కలిగిన వారు తప్పనిగాసరిగా చేరాలని నిబంధనలు విధించారు.

## ఇప్పటికీ.. ఎప్పటికీ.. పాకిస్తాన్‌కు అండగా ఉంటాం

- మన 'దోస్తీ జిందాబాద్'!..
- పాక్ ప్రధానికి తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ భరోసా

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు సాయం చేసిన తుర్కియేపై భారత్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అక్కడి నుంచి వస్తువుల దిగుమతి నిలిపివేయాలంటూ 'బాయ్‌కాట్ తుర్కియే' నినాదంతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలోనే కీలక పరిణామం చోటుచేసుకుంది. కాల్పుల విరమణ నేపథ్యంలో తుర్కియేకు ధన్యవాదాలు తెలిపిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను అభినందించిన ఎర్డోగాన్.. పాకిస్థాన్ తమకు నిజమైన మిత్రదేశమన్నారు. గతంలో మాదిరిగా భవిష్యత్తులోనూ అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా పాక్ ప్రధానిని విలువైన మిత్రుడిగా ఎర్డోగాన్ అభివర్ణించడం గమనార్హం."నా విలువైన మిత్రుడు షహబాజ్ షరీఫ్.. తుర్కియే-పాకిస్థాన్‌ల మధ్య సోదరభావం



అనేది నిజమైన స్నేహానికి నిదర్శనం. ప్రపంచంలో కొన్నిదేశాలు మాత్రమే దీన్ని కొనసాగిస్తాయి. తుర్కియేలో మాదిరిగానే పాకిస్థాన్‌లో శాంతి, స్థిరత్వాన్ని కోరకుంటున్నాం. వివాదాల పరిష్కారంలో చర్చలు, రాజీకి ప్రాధాన్యం ఇస్తున్న పాక్ ప్రభుత్వ విధానాన్ని అభినందిస్తున్నాం. గతంలో మంచి, చెడు సమయాల్లో మాదిరిగా.. భవిష్యత్తులోనూ పాక్‌కు అండగా ఉంటాం. పాకిస్థాన్-తుర్కియే దోస్తీ జిందాబాద్!" అంటూ అధ్యక్షుడు ఎర్డోగాన్ పేర్కొన్నారు. పాకిస్థాన్ ఉగ్రస్థావరాలే

## భారత్‌పై విషం కక్కిన తుర్కియే!

### భారత్‌పై దాడిలో పాక్‌కు డ్రోన్లే కాదు.. మిలిటరీ సిబ్బందినీ పంపించి...

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌పై తుర్కియే విషం కక్కిన విషయం తెలిసిందే. భారత్‌పై దాడులు చేసేందుకు పాకిస్థాన్‌కు డ్రోన్లు అందించి సాయం చేసింది.తాజాగా మరో విస్తుగొలిపే విషయం వెలుగులోకి వచ్చింది. డ్రోన్ల సాయమే కాకుండా.. ఇస్లామాబాద్‌కు తుర్కియే తమ సైనిక సిబ్బంది ని కూడా పంపినట్లు వార్తలు వస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ చేపట్టిన దాడుల్లో చనిపోయిన వారిలో ఇద్దరు తుర్కియే సైనికులు ఉన్నట్లు సమాచారం.పాకిస్థాన్-తుర్కియేల మధ్య వ్యూహాత్మక రక్షణ సంబంధాలు ఇటీవల భారీగా పెరిగాయి. భారత్‌పై దాడికి పాకిస్థాన్.. తుర్కియేకు చెందిన వందల డ్రోన్లను ఉపయోగించింది. అయితే.. వాటి వినియోగంపై అవగాహన కల్పించడానికి తమ మిలిటరీకి చెందిన వ్యక్తులను ఇస్లామాబాద్‌కు తుర్కియే పంపించినట్లు వార్తలు వస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ భారీస్థాయిలో భారతపై డ్రోన్ దాడులు చేసింది. దాదాపు 300 నుంచి 400 డ్రోన్లను ప్రయోగించింది. వాటిని భారత్ కూల్చివేసింది. ఆ శకలాలను ఫోరెన్సిక్ నిపుణులు పరీక్షించారు. అవన్నీ తుర్కియేకు చెందిన 'అసిస్ గార్డ్ సోనగర్' డ్రోన్లుగా ధ్రువీకరించారు.తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌కు తొలి నుంచీ భారత్ అంటే విపరీతమైన ద్వేషం. ఆ విషయాన్ని అనేక సందర్భాల్లో ఆయన బహిరంగంగా వ్యక్తం చేశారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన తర్వాత ప్రపంచమంతా ఉగ్రవాదుల చర్యలను ఖండిస్తున్న సమయంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను ఎర్డోగాన్ కలిశారు. ఆ దేశానికి వత్తాసు పలికారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించలేదు సరికదా.. మృతి చెందిన పర్యాటకుల కుటుంబాలకు సానుభూతి కూడా వ్యక్తం చేయడానికి ఆయన ఇష్టపడలేదు. పహల్గాం ఉగ్ర దాడి జరిగిన తర్వాత ముస్లిం దేశాల్లో తుర్కియే, అజర్ బైజాన్ మాత్రమే పాక్‌కు మద్దతిస్తూ ప్రకటనలిచ్చాయి. కశ్మీర్ అంశంలో గతంలో ఎర్డోగాన్ అనేక సార్లు అంతర్జాతీయ వేదికలపై బహిరంగంగా భారత్‌పై విమర్శలు గుప్పించారు.

## 'ఆపరేషన్ సిందూర్'పై దుష్ప్రచారం.. భారత్‌లో గ్లోబల్ టైమ్స్ ఖాతా బ్లాక్

చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని మీడియా సంస్థ గ్లోబల్ టైమ్స్‌కు చెందిన ఎక్స్ ఖాతాను భారత్ నిలిపివేసింది. ఆపరేషన్ సిందూర్ గురించి అసత్య సమాచారాన్ని ప్రచురిస్తుందని పేర్కొంటూ దానిని బ్లాక్ చేసింది.ఆ ఖాతాను ఓపెన్ చేయగానే అకౌంట్ విత్‌హెల్డ్ అని కనిపిస్తోంది. అలాగే మరో చైనా మీడియా సంస్థ షిన్హువా సామాజిక మాధ్యమ ఖాతాను కూడా నిలిపివేసింది. అంతేగాకుండా తుర్కియేకు చెందిన 'టీఆర్‌టీ వరల్డ్'ను ఎక్స్ అకౌంట్‌పై కూడా వేటు వేసింది. పహల్గాం ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్‌తో భారత్ బలగాలు బదులు ఇచ్చాయి. పాక్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే మన మిలిటరీ ఆపరేషన్‌పై గ్లోబల్ టైమ్స్ కవరేజ్‌ను ఉద్దేశించి చైనాలోని భారత దౌత్య కార్యాలయం ఇప్పటికే స్పందించింది. డియర్ గ్లోబల్ టైమ్స్ అంటూ నేరుగా పోస్టు పెట్టింది. ఈరకమైన తప్పుడు సమాచారాన్ని ప్రచురించే ముందు వాస్తవాలను ధ్రువీకరించుకోవాలని సిఫారసు చేస్తున్నామని రాసుకొచ్చింది. "ఆపరేషన్ సిందూర్ విషయంలో పాకిస్థాన్ అనుకూల ఖాతాలు నిరాధార కథనాలు వ్యాప్తి చేస్తున్నాయి. ధ్రువీకరణ లేకుండా సమాచారాన్ని షేర్ చేయడం బాధ్యతారాహిత్యాన్ని ప్రతిబింబిస్తుంది" అని పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో నెట్టింట్లో చక్కర్లు కొట్టిన అసత్య ప్రచారానికి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోఎప్పటికప్పుడు చెక్ పెట్టింది. ఫ్యాక్ట్‌చెక్ చేస్తూ వాస్తవాలను బయటపెట్టిన సంగతి తెలిసిందే.

## ట్రంప్ తెచ్చిన 'ఉచిత' తంటా

### ఫ్రీ గిఫ్ట్‌తో నిఘా సంస్థలకు నిద్ర కరవు..!





ఓ 'ఉచితం' కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుచితంగా ఆశించడంతో అమెరికా నిఘా సంస్థలకు నిద్ర కరవవ్వనుంది. ఖతార్ రాజకుటుంబం నుంచి ఆయన గిఫ్ట్ రూపంలో అందుకోనున్న బోయింగ్ 747 విమానం ఇంటెలిజెన్స్ వర్గాల్లో గుబులు రేపుతోంది. అమెరికా రక్షణ సంస్థలు విదేశీ గిఫ్ట్‌లపై ఎప్పుడూ ఓ అనుమానపు చూపు చూస్తాయి. దీనికితోడు చట్టపరమైన, నైతికపరమైన ప్రశ్నలు కూడా ట్రంప్‌ను సవాలు చేస్తున్నాయి.89 సీట్లతో.. ఫ్రెంచి ఇంటీరియర్ డిజైన్‌తో రూపొందించిన ఈ విమానం ఓ రాజమందిరాన్ని తలపించినా.. దీనిలో సాంకేతికపరమైన భద్రతా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి విదేశీ గిఫ్ట్‌లతో కేవలం అమెరికా అధ్యక్షుడి పైనే కాకుండా ఆయనతో ప్రయాణించేవారిపై నిఘా, ట్రాకింగ్, కమ్యూనికేషన్లలోకి చొరబడే అవకాశాలు ప్రత్యర్థులకు ఇచ్చినట్లు అవుతుందనే వాదనలున్నాయి. "విదేశీ ప్రభుత్వానికి గిఫ్ట్‌గా వెళ్లనున్న విమానాన్ని అమెరికానే నిర్మిస్తే.. దానిలో నిఘా పరికరాలు అమర్చే అవకాశం ఉంది" అని మాజీ సీఐఏ స్టేషన్ చీఫ్ థాడ్ ట్రాయ్ పేర్కొన్నారు. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో మాస్కోలోని అమెరికా భవనాన్ని కూల్చేసేటప్పుడు నిఘా పరికరాలను తొలగించేందుకు ఒక్కో ఇటుకను తొలగించిన విషయాన్ని గుర్తు చేశారు.వాస్తవానికి ట్రంప్ 3.9 బిలియన్ డాలర్లతో రెండు సరికొత్త ప్రెసిడెన్షియల్ విమానాల కొనుగోలుకు ప్రయత్నిస్తున్నారు. కానీ, వాటి డెలివరీల్లో ఆలస్యం జరగడంతో ఆయన అసహనానికి గురవుతున్నారు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కన్ను ఖతార్ విమానాలపై పడింది. అప్పట్లో గిఫ్ట్‌గా వాటిని ఆఫర్ చేయలేదు. ట్రంప్‌నకు ప్రస్తుతం గిఫ్ట్ రూపంలో లభించనున్న విమానాన్ని 2012లో హమద్ బిన్ జస్సిమ్ బిన్ జబెర్ అల్‌థాని కోసం తయారుచేశారు. ఆయన ఖతార్ ప్రధానిగా, ప్రభుత్వ వెల్త్‌ఫండ్ అధిపతిగా విధులు నిర్వహించారు. ఇక ఈ విమానం మొత్తం క్రీమ్, తెలుపు రంగులతో తీర్చిదిద్దారు. దీని ఇంటీరియర్‌ను పారిస్‌కు చెందిన ఆల్బర్టో పింటో రూపొందించారు. అత్యంత విలాసవంతమైన తాయ్ పింగ్ రంగ్స్ కార్పెట్లను వాడారు. దీనిలో అలెగ్జాండర్ క్లాడెర్ ఆర్ట్‌వర్క్‌ను వాడారు. విమానం అప్పర్‌డెక్‌లో మాస్టర్ బెడ్‌రూమ్, స్నానాల గది, గెస్ట్‌బెడ్‌రూమ్, ప్రైవేట్ లాంజ్, మెట్లు, ఆఫీస్, సిబ్బంది గదులు ఉన్నాయి. ఒకవేళ ఈ విమానం ట్రంప్ చేతికి వచ్చినా.. ఎయిర్‌ఫోర్స్ వన్ ప్రమాణాలకు తగ్గట్లు రెట్రో ఫిట్టింగ్ మళ్లీ చేయించుకోవాల్సి ఉంటుంది. దాడులు, పేలుళ్లను తట్టుకొనేటట్లు దాని ఉపరితలాన్ని కచ్చితంగా దృఢంగా తయారుచేయించుకోవాలి. గాల్లోనే రీఫ్యూయలింగ్, రహస్య కమ్యూనికేషన్లు, ఆయుధ వ్యవస్థలను అమర్చాల్సివస్తుంది.ఇక ఈ విమానంలో ఎటువంటి ట్రాకింగ్ పరికరాలు, నిఘా వస్తువులు లేవని నిర్ధరించుకొనేందుకు రక్షణశాఖ అధికారులు అణువణువూ క్షుణ్ణంగా తనిఖీ చేయడానికే కొన్ని నెలల సమయం పట్టొచ్చు. వాస్తవానికి ఎయిర్‌ఫోర్స్ వన్ తయారీ కన్నా దీనికే అధిక సమయం పడుతుందని సీఐఏ మాజీ అధికారి ట్రాయ్ పేర్కొన్నారు. సౌదీ పర్యటనకు ముందు ట్రంప్ మాట్లాడుతూ "మీరు దేశం కోసం బహుమతులు స్వీకరించవద్దు అని చాలామంది చెబుతున్నారు. నేను ఎందుకు స్వీకరించకూడదు. మేము అందరికీ ఇస్తున్నాం.. అలానే తీసుకుంటాం. గల్ఫ్ పాలకుల వద్ద మనకంటే పెద్ద విమానాలు ఉన్నాయి. అసలు అమెరికా వద్దే అందరికంటే మంచి విమానం ఉండాల్సింది" అని సమర్థించుకొన్నారు. మరోవైపు ట్రంప్ వ్యతిరేకులు మాత్రం అమెరికాపై తమ ప్రభావం పెంచుకోవడానికి గల్ఫ్ దేశాలు ఇచ్చే లంచంగా దీనిని అభివర్ణిస్తున్నారు. దీంతో ఆయన స్వరం కొంచెం మారింది. తాజాగా ఆయన సోషల్ మీడియాలో ఓ పోస్టు చేశారు. "ఆ విమానాన్ని ప్రభుత్వం కొత్త బోయింగ్ విమానాలు వచ్చేవరకు తాత్కాలిక ఎయిర్‌ఫోర్స్ వన్‌గా వాడుతుంది. నూతన విమానాల డెలివరీలు చాలా ఆలస్యమవుతున్నాయి" అని పేర్కొన్నారు.ఖతార్ సుదీర్ఘకాలంగా అమెరికా మిత్ర దేశం. గల్ఫ్‌లోని అతిపెద్ద అమెరికా సైనిక స్థావరం అక్కడే ఉంది. ఈజిప్ట్‌తో కలిసి హమాస్-ఇజ్రాయెల్ మధ్య రాజీ కోసం పనిచేస్తోంది. హమాస్ పొలిటికల్ ఆఫీస్ కూడా ఆ దేశంలోనే ఉంది. ఈనేపథ్యంలో ట్రంప్ ఆ విమానం గిఫ్ట్‌గా స్వీకరించి.. దానిలో నిఘా పరికరాలు ఉండి ఉంటే మాత్రం కీలక సమాచారం కొందరి చేతుల్లోకి వెళుతుందని, దానిని వారు సొంత అవసరాలకు వాడుకొంటారని సిడ్నీ విశ్వవిద్యాలయంలోని ఇంటర్నేషనల్ సెక్యూరిటీ స్టడీస్ అధిపతి జేమ్స్ డెర్ డెరియన్ అభిప్రాయపడ్డారు. ఖతార్ మరో సోవియట్ యూనియన్ కాకపోయినా.. దానికి బలమైన నిఘా వ్యవస్థ ఉందన్నారు. కాకపోతే ఇచ్చిన గిఫ్ట్ తీసుకోకపోతే.. అరబ్ దేశాధిపతులు నిరాశపడే అవకాశాలూ ఉన్నాయని పేర్కొన్నారు.

## సిరియా అధ్యక్షుడితో భేటీ కానున్న ట్రంప్..!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పశ్చిమాసియా పర్యటనలో అనుకోని కార్యక్రమం వచ్చి చేరింది. ఆయన సిరియా తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్ షరా(అబు మహమ్మద్ అల్ జులానీ)తో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు ఆంగ్లపత్రిక బీబీసీ పేర్కొంది. సౌదీ అరేబియాలో ఈ మీటింగ్ జరిగే అవకాశం ఉంది. ట్రంప్ పశ్చిమాసియా పర్యటన వేళ సిరియాపై ఉన్న ఆంక్షలను అమెరికా హఠాత్తుగా తొలగించింది.ప్రస్తుత తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్‌కు గతంలో ఉగ్ర సంస్థ అల్‌ఖైదాతో సంబంధాలున్నా.. ఆయన్ను కలిసేందుకు సిద్ధపడ్డారు. ఈ విషయాన్ని మంగళవారం శ్వేతసౌధం కూడా ధ్రువీకరించింది. గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్ సమావేశంలో వీరు కలుసుకోనున్నారు. గతేడాది డిసెంబర్ వరకు అల్ షరాపై అమెరికా ప్రభుత్వం 10 మిలియన్ డాలర్ల రివార్డు ఉంచడం గమనార్హం.మరోవైపు ఏళ్లతరబడి అమెరికా విధించిన ఆంక్షలు తొలగించడంతో.. సిరియా రాజధాని డమాస్కస్‌లో సంబరాలు చేసుకొంటున్నారు.

## స్వదేశీ కౌంటర్ డ్రోన్ వ్యవస్థ 'భార్గవాస్త్ర'

వద్ద గల సీవార్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఈ పరీక్షలు జరిగినట్లు ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ అధికారులు తెలిపారు. మొత్తం మూడు దశల్లో ట్రయల్స్ నిర్వహించగా, అన్నింటిలోనూ 'భార్గవాస్త్ర' తన లక్ష్యాలను కచ్చితంగా ఛేదించినట్లు వెల్లడించారు. మొదటి రెండు పరీక్షల్లో ఒక్కో మైక్రో రాకెట్‌ను ప్రయోగించగా, మూడో విడతలో రెండు రాకెట్లను కేవలం రెండు సెకన్ల వ్యవధిలో ప్రయోగించి, డ్రోన్ల సమూహాన్ని విజయవంతంగా నిర్వీర్యం చేశారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, డ్రోన్ల ద్వారా ఎదురవుతున్న భద్రతా సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఈ వ్యవస్థను రూపొందించారు. 'భార్గవాస్త్ర' వ్యవస్థ శత్రు డ్రోన్లను సుమారు 2.5 కిలోమీటర్ల దూరం నుంచే గుర్తించి, మైక్రో రాకెట్ల సాయంతో వాటిని కూల్చివేయగలదు. దీనిలోని శక్తివంతమైన రాడార్ వ్యవస్థ 6 నుంచి 10 కిలోమీటర్ల పరిధిలోని గగనతల ముప్పులను పసిగట్టగలదు.ఈ వ్యవస్థలో రెండు అంచెల రక్షణ ఉంటుంది. మొదటి అంచెలో అన్‌గైడెడ్ మైక్రో రాకెట్లు ఉంటాయి. ఇవి 20 మీటర్ల పరిధిలోని డ్రోన్ల గుంపును నాశనం చేస్తాయి. రెండో అంచెలో ఉండే గైడెడ్ మైక్రో క్షిపణులు నిర్దేశిత లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదిస్తాయి. తక్కువ ఖర్చుతో, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన 'భార్గవాస్త్ర' సముద్ర మట్టానికి 5000 మీటర్ల ఎత్తులోని పర్వత ప్రాంతాలు, కొండల ప్రదేశాల్లో కూడా సమర్థవంతంగా పనిచేస్తుంది

# సర్కారు భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, మే14 (జనంసాక్షి)**

నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సర్కారు భూములు ఆక్రమణకు గురవుతున్న విషయాలు గుర్తించామని, వాటిని రెవెన్యూ అధికారులు వెంటనే స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులకు సర్కారు భూములపై ఎటువంటి ఆక్రమణను అయినా కఠినంగా అణచివేయాలని సూచించడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటికే పలు మండలాల్లో రెవెన్యూ శాఖ సర్వేలు చేపట్టి,చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని,ఇకపై అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

# చల్లబడ్డ అగ్నిగుండం

## వాతావరణంలో మార్పులు

**ఆదిలాబాద్ ప్రతినిది (జనంసాక్షి):**



గత కొద్ది రోజుల నుంచి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎండలు దంచి కొడుతుండడంతో ఎండల దాటికి వాతావరణం అగ్నిగుండంలా మారిపోయిం ది. ఎండ దాటికి ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం వరకు సూర్యుడు సలసలా కాగుతూ తమ ప్రతాపం చూపిస్తుండడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి ఐపోతున్నారు. బుదవారం జిల్లాలో అనుకోకుండా వాతావరణం ఒక్కసారిగా చల్లబడడం కనిపించింది. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతంగా మారి వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఇన్ని రోజులు ఎండ వేడిని భరించలేక సతమతం అవుతున్న జిల్లా ప్రజలకు ఈ చల్లబడ్డ వాతావరణం కాస్త ఉపశమనం కలిగించింది. ఎండకు బదులు ఆకాశం పూర్తిగా మబ్బులు కమ్ముకుని నీడను తలపించింది. జిల్లా అటవీ ప్రాంతాల్లో వర్షాకాలం ప్రభావం కనిపించింది.

# ప్రతిష్టాత్మకంగా సరస్వతి పుష్కరాలు

## విధుల్లో పాల్గొనే సిబ్బందికి కలెక్టర్ దిశానిర్దేశం

**కాళేశ్వరం, మే 14 (జనంసాక్షి)**



సరస్వతి పుష్కర విధులు కేటాయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ 12 రోజులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాళేశ్వరం దేవస్థానంలోని కళ్యాణ మండపంలో విధులు కేటాయించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి కేటాయించిన విధుల పట్ల దిశానిర్దేశం చేశారు. ప్రతిరోజు లక్షకిపైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రం ఆసాంతం అప్రమత్తంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ప్రతి అధికారికి కేటాయించిన లొకేషన్స్ లో ముందస్తుగా పర్యటించి ఏర్పాట్లు పరిశీలన చేయాలని తెలిపారు. గైర్హాజరైన అధికారులకు, సిబ్బందికి ఆయా శాఖలకు తగు చర్యలు నిమిత్తం సిఫారసు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 15 ఉదయం పుష్కరాలు ప్రారంభమవుతాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పుష్కరాలను ప్రారంభించనున్నారని తెలిపారు. 15 సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి సరస్వతి మాత విగ్రహం ఆవిష్కరణ, పుష్కర స్నానం తదుపరి స్వామి వారి దర్శనం, గోదావరి హారతి కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారని అనంతరం టెంట్ సిటీ పరిశీలిస్తారని తెలిపారు. 12 సంవత్సరాలకు ఒకసారి జరుగుతున్న ఈ పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని అన్నారు. స్విమ్మర్లు లైఫ్ బాయ్స్, జాకెట్స్ ధరించాలని గోదావరిలో ఏ ఒక్కరు మిస్ అయిన విధులకు ఇబ్బంది కలుగుతుందని, అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ కమిషనర్ వెంకటరావు, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డిఓ రవి అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# ఓవైసీ, మజ్లిస్‌కు భయపడుతున్న కాంగ్రెస్

## సుందరీమణులను అమ్మవారి దేవాలయానికి ఎందుకు తీసుకెళ్లలేదు?

## బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ వ్యాఖ్యలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :**



మిస్ వరల్డ్ పోటీ సందర్భంగా 109 దేశాల నుంచి హైదరాబాద్ కు వచ్చిన సుందరీమణులను చార్మినార్, లాడ్ బజార్, ఫలక్‌నుమా ప్యాలెస్‌లకు తీసుకెళ్లిన ప్రభుత్వం, అదే చార్మినార్ ప్రాంగణంలో ఉన్న భాగ్యలక్ష్మి దేవాలయాన్ని మాత్రం చూపించకపోవడం పట్ల బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తారు. ఓవైసీ, మజ్లిస్ పార్టీకి భయపడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విదేశీ అతిథులను, సుందరీమణులను భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లేందుకు ధైర్యం చేయలేకపోయారని ఎస్. కుమార్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హిందూ సంస్కృతి, ఆలయాల పట్ల ఉన్న చులకనభావం మరోసారి స్పష్టమైందన్నారు. గతంలో భాగ్యలక్ష్మి అమ్మవారిని స్వయంగా దర్శించుకుని ఆలయ విశిష్టతను కొనియాడిన రేవంత్ రెడ్డి, అంతే కాదు.. ఇతర పార్టీల నాయకులకు చాలెంజ్ విసిరిన ముఖ్యమంత్రి.. ఇప్పుడు మాత్రం ఆ ఆలయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే అందుకు నిదర్శన మన్నారు. అందమైన చారిత్రక కట్టడాలుగా చెబుతూ నిజాం పాలనపై ప్రశంసలు గుప్పించిన ప్రభుత్వం, నిజమైన చారిత్రక ప్రాధాన్యత కలిగిన భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని ఎందుకు దర్శించుకోలేదని ప్రశ్నించారు. కేవలం ఒక వర్గం ఓట్ల కోసం

80 శాతం హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని ఎస్.కుమార్ మండిపడ్డారు.

# సరస్వతి పుష్కరాల కోసం ఉత్సవ కమిటీ ఏర్పాటు

**మంథని, (జనంసాక్షి) :**

మంథని నియోజక వర్గం పరిధిలోని మహదేవ్ పూర్ మండలం కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి ఆలయంలో మే 15 నుంచి మే 26 వరకు సరస్వతి పుష్కరాలను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సరస్వతి పుష్కరాలను విజయవంతం చేయడం కోసం ఉత్సవ కమిటీని దేవాదాయ శాఖ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. సరస్వతి పుష్కరాల ఉత్సవ కమిటీ సభ్యులుగా అవధానుల మోహన్ శర్మ, మంచినీళ్ళ దుర్గయ్య, జలవంచ సీతారాం, సుంకరి సీతయ్య, గండేరి సత్యనారాయణ, కుంభం పద్మ, బెక్కుని నర్సయ్య, బండారి నర్సింగ్ రావు, ముక్కెర రాజమల్లు గౌడ్, మేకల ఓదెలు యాదవ్, భూపెల్లి రాజయ్య, దండ ప్రశాంత్ రెడ్డి, ఓదెల కుమార స్వామి,
అడ్డూరి శ్రీధర్ రావు, ప్రత్యేక ఆహ్వానితులుగా కాటం సత్యం కుమ్మరి అంజయ్య, పొడ్ల అశోక్, శ్యామ్ సుందర్ దేవర లను నియమించారు. 13-05-2025 నుండి 26-05-2025 వరకు ఈ ఉత్సవ కమిటీ సభ్యులు సరస్వతి పుష్కరాలను ప్రశాంతంగా నిర్వహించడానికి తమ సేవలను అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# త్వరలో ఇసుక ట్యాక్స్ అమలు చేస్తాం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 14 (జనంసాక్షి)**

> ట్రాక్టర్ యజమానులు పూర్తి వివరాలు కలెక్టరేట్లో నమోదు చేసుకోవాలి
> రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

రాజన్న సిరిసిల్ల జిల్లాలో త్వరలో సాండ్ ట్యాక్స్ ద్వారా ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇసుక రవాణాను త్వరలో ఆన్లైన్ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ట్రాక్టర్ యజమానులు, బాధ్యులు తమ వాహనాల లైసెన్స్, ఇతర అన్ని పత్రాలు, డ్రైవర్ వివరాలు డ్రైవింగ్ లైసెన్సు తదితర పత్రాలను, జిల్లా కలెక్టర్ పేరిట రూ 10 వేల డీడీ తీయాలనీ ఆయా వివరాలు, పత్రాలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సీ సెక్షన్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయాలన్నారు. వాహన యజమానులు, బాధ్యులు ఈ వివరాలన్నీ వారం రోజుల్లోగా అందజేయాలని తెలిపారు. జిల్లాలో అనుమతి పొందిన ఇసుక (సాండ్) రీచ్ ల నుంచి మాత్రమే ఇసుక రవాణా చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# రోడ్ల విస్తరణ చేపట్టండి

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మెట్టు సాయికుమార్ విజ్ఞప్తి

**హైదరాబాద్ (జనంసాక్షి) :**



బేగంబజార్, సిద్ధింబర్ బజార్, బేగంబజార్ ఛత్రి ప్రాంతంలో రోడ్ వెడల్పు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ కి ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మెన్ మెట్టు సాయికుమార్ విన్నవించారు. గోషామహల్ నియోజకవర్గంలోని ప్రముఖ వ్యాపార కేంద్రం అయిన బేగంబజార్, సిద్ధింబర్ బజార్, బేగంబజార్ ఛత్రి ప్రాంతంలో రోడ్ వెడల్పు చేపట్టాలని కోరారు. త్వరలో ప్రారంభమయ్యే ఉస్మానియా హాస్పిటల్ ను గోషామహల్ పోలీస్ స్టేడియంలో నిర్మాణం చేపట్టడం వల్ల భవిష్యత్తులో ఈ మార్గాల్లో రద్దీ పెరిగే అవకాశం ఉన్నదని, దీనిపై స్థానిక ప్రజల అభిప్రాయాలను మంత్రి పొన్నం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందించినట్టు మెట్టు సాయికుమార్ చెప్పారు.

# వేములవాడ పట్టణ బంద్ విజయవంతం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 14 (జనంసాక్షి)**



దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయఅభివృద్ధి,విస్తరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం,స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతే పనులు మొదలు పెట్టాలని కోరుతూ రాజన్న ఆలయ పరిరక్షణ సమితి, బీజేపీ,బిఆర్ఎస్ పార్టీల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పట్టణ బంద్ విజయవంతంగా ముగిసింది. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగిన బందులో భాగంగా పట్టణంలోని అక్కడక్కడ టీ, టిఫిన్, మటన్,చికెన్ సెంటర్లు తప్పితే మిగతా దుకాణాలు చాలా వరకు తెరుచుకోలేదు. బంద్ సందర్భంగా బిజెపి బిఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామికంగా నియంతృత ధోరణితోని ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఆలయ అభివృద్ధి పేరిట ఆలయాన్ని మూసివేస్తామనడం సరైన పద్ధతి కాదన్నారు. ఆలయంలో ఉన్న దేవతల విగ్రహాలను వైశాల్యంలో భాగంగా తొలగిస్తాననడం రాజన్న భక్తులకు హిందుత్వవాదులకు తీవ్ర నిరాశ కల్పిస్తోందన్నారు. గత నెలలో ఎండోమెంట్ కమిషనర్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ, స్థానిక ఎమ్మెల్యే,ఈవో సమావేశంలో రెండు గంటలు చర్చలు చేసిన కూడా ఆగమ శాస్త్ర ప్రకారంగానే దేవాలయ పునర్నిర్మాణం చేస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న దర్గపై చర్చించకుండా కేవలం హిందుత్వ మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నంగా చేసే నిర్ణయాలను వ్యతిరేకిస్తా మన్నారు. ఈరోజు ప్రజల ఆలోచన విధానాని బందు ద్వారా తెలుపమన్నారు. దేవాలయంలో
ఉన్న ఏ విగ్రహాన్ని కూడా తొలగించ వద్దని, అభివృద్ధిలో భాగంగా దేవాలయం మూసి వేయకూడదన్నారు. ఇదిలా ఉండగా అభివృద్ధిని అడ్డుకోవడంలో భాగంగానే ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు బంద్ పేరిట పట్టణ ప్రజలను, రాజన్న భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని,
ఇది ముమ్మాటికి తప్పుదోవ పట్టించడమేనని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఏది ఏమైనా ఎట్టి పరిస్థితుల్లో ఆలయ అభివృద్ధి పనులను కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. పట్టణంలోని ముఖ్య ప్రాంతాల్లోనీ వ్యాపార సముదాయాల్లోకి వెళ్లి బందుకు సహకరించవద్దని యజమానులను కోరారు. మరోవైపు బంద్ సందర్భంగా పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసారు.

## పుష్కరాలలో ప్రత్యేక ఆకర్షణగా

# హ్యాండ్లూమ్ స్టాళ్లు



**కాళేశ్వరం, మే 14,( జనం సాక్షి)**

సరస్వతి పుష్కరాల సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్ స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పవిత్ర సరస్వతి పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో స్వయం సహాయక సంఘాల స్టాళ్లు, హ్యాండ్లూమ్, టెక్స్టైల్ ఉత్పత్తుల స్టాళ్లు పెద్ద ఎత్తున సందర్శకులను ఆకట్టుకునేలా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఏర్పాటు చేశారు. స్టాళ్లు. పర్యవేక్షణకు డిఆర్డీఓ నరేష్, పరిశ్రమల శాఖ జిఎం సిద్ధార్థలను ప్రత్యేక అధికారులుగా నియమించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు తమ కృషిని ప్రతిబింబించేలా నాణ్యమైన హస్తకళా ఉత్పత్తులు, సేంద్రీయ ఆహార పదార్థాలు, పచ్చడులు ఇతర గ్రామీణ ఉత్పత్తులను విక్రయాలు చేయనున్నారు. స్థానికంగా తయారైన ఈ ఉత్పత్తులు పుష్కర సందర్శకుల నుండి విశేష ఆదరణ లభించనుంది. అలాగే టెక్స్టైల్ మరియు హ్యాండ్లూమ్
స్టాళ్లలో పట్టు చీరలు, నూలు వస్త్రాలు, డిజైన్ దుస్తులు, చేనేత వస్త్రాలతో కూడిన ప్రత్యేక కలెక్షన్ ప్రదర్శించబడుతోందని పర్యవేక్షణ అధికారులు తెలిపారు. ఈ ప్రాంత హస్తకళల పరంపరను ప్రతిబింబిస్తూ పుష్కర సందర్శకులను ఆకర్షిస్తును న్నాయి. ప్రత్యేక ఆకర్షణగా మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు తక్కువ ధరల్లో, నేరుగా ఉత్పాదకుల నుంచి వినియోగదారులకు అందుబాటు లో ఉన్నాయని తెలిపారు. స్టాళ్లు ఏర్పాటు ద్వారా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలపడేం దుకు ఇలాంటి అవకాశాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

# వడ్ల కొనుగోలులో కామారెడ్డి జిల్లా తృతీయ స్థానం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 14 (జనం సాక్షి) :**



3.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుండి సేకరణ: జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రాష్ట్రం లో తృతీయ స్థానం 90 కొనుగోలు పూర్తి 735 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు గతేడాది తో పోలిస్తే జోరుగా కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు. జిల్లాలో 2024-25 రబీ సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలు జోరుగా కొనసాగుతున్నదని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 446 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వార ఇప్పటి వరకు 58655 మంది రైతుల నుండి 735 కోట్ల విలువైన 3.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ తో రాష్ట్రం లో కామారెడ్డి జిల్లా తృతీయ స్థానం లో నిలిచిందనీ తెలిపారు. దీంట్లో 1.49 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 1.67 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం కొనుగోలు చేశామని. ఇప్పటి వరకు 44204 రైతులకు గాను 616.10 కోట్ల వరకు డబ్బులు చెల్లింపులు కూడా పూర్తయ్యాయనీ తెలిపారు. గతేడాది పోలిస్తే అనగా రబీ 2023-24 ఇదే సమయానికి 45068 రైతుల నుండి 2.31 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయగా, అదేవిధంగా ఆ క్రిందటి ఏడాది అనగా రబీ 2022-23 సీజన్ లో 25167 రైతుల వద్ద నుంచి 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ను కొనుగోలు చేశామన్నారు. గత రెండు సీజన్ లతో పోలిస్తే ఈ రబీ సీజన్ లో ధాన్యం కొనుగోళ్ళు, రైతులకు చెల్లింపులు 40% అధికంగా చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు సన్న రకం ధాన్యం అమ్మిన 16109 మంది రైతులకు బోనస్ చెల్లింపులకు రూ.66.23 కోట్లు ప్రభుత్వానికి సిఫార్సు చేశామన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాలలో అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని కేంద్రాలలో
తగినన్ని టార్పాలిన్ లను ఏర్పాటు చేయాలనీ మార్కె టింగ్ శాఖ వారికి సూచిం చారు. అలాగే రైతులు తమ వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో అమ్ముకునే క్రమము లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# ధాన్యం కుప్పలకు ఢీకొని ఒక్కరు మృతి



**గంభీరావుపేట మే 14( జనం సాక్షి):**

గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామ సమీపాన బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లారెడ్డిపేటకు చెందిన ఖలీల్ (45) మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన శేఖర్ తీవ్ర గాయాల పాలయ్యాడు. మల్లారెడ్డిపేట నుండి లింగన్నపేట వెళ్లి స్పెండర్ ప్లస్ బైకుపై తిరిగి మల్లారెడ్డిపేటకు వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. రోడ్డుపై దాన్యం కుప్పలకు ఢీకొట్టడంతో ఖలీల్, శేఖర్ గాయపడ్డారు . 108 వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా ఖలీల్ మృతి చెందాడు. శేఖర్ తీవ్ర గాయాలతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రేమానందం తెలిపారు.



## విరాట్ కోహ్లి టెస్టు రిటైర్మెంట్‌పై అనుష్క శర్మ ఎమోషనల్ స్టోరీ

స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంతో ఆయన సతీమణి అనుష్క శర్మ ఇన్స్టాగ్రామ్‌లో భావోద్వేగ స్టోరీని పంచుకున్నారు. టెస్టు క్రికెట్‌లో కోహ్లి సాధించిన విజయాలను, ఈ ఫార్మాట్ పై ఆయన చూపిన అంకితభావాన్ని ఆమె కొనియాడారు. స్టాండప్ కమెడియన్ వరుణ్ గ్రోవర్ రాసిన కవిత నుంచి కొన్ని లైన్లను షేర్ చేస్తూ అనుష్క రాసుకొచ్చారు: "కథను అందంగా చెప్పగలిగేవారే టెస్టు క్రికెట్‌లో విజయం సాధిస్తారు. ఆ కథ సుదీర్ఘమైనది, లోతైనది. పిచ్ పరిస్థితులు, స్వదేశమా-విదేశమా అనే విషయాలను పట్టించుకోని కథ అది." వరుణ్ గ్రోవర్ తన కవితలో టెస్టు క్రికెట్‌ను సాహిత్య నవలతో పోల్చారు. "ఐదు రోజులు, నాలుగు ఇన్నింగ్స్‌లు, 22 మంది స్పెషలిస్ట్‌లు ఆడే ఈ ఆటలో వాతావరణం, పిచ్ కండిషన్స్, టాస్ అదృష్టం, మానసిక లెక్కలు కీలకం. టెస్టు క్రికెట్ ఒక కవితాత్మక, వర్ణనాత్మక ఆట," అని ఆయన రాశారు. ఈ పోస్ట్‌ను అనుష్క షేర్ చేయడంతో అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

రిటైర్మెంట్ ప్రకటన రోజున కూడా అనుష్క భావోద్వేగంతో రాసుకొచ్చారు: "అందరూ రికార్డులు, మైలురాళ్ల గురించి మాట్లాడతారు. నాకు మాత్రం నీ కన్నీళ్లు, ఎవరూ చూడని యుద్ధాలు, టెస్టు ఫార్మాట్‌పై నీ అచంచలమైన ప్రేమ గుర్తుంటాయి. ప్రతి సిరీస్ తర్వాత నీవు మరింత గొప్పగా, వినయంగా తిరిగొచ్చేవాడివి. నీ ప్రస్థానాన్ని పక్కనుండి చూడటం నా అదృష్టం." టెస్టు క్రికెట్‌లో అనేక మరుపురాని క్షణాలను అందించిన కోహ్లి రిటైర్మెంట్ అభిమానులను కలిచివేసినప్పటికీ, అనుష్క స్టోరీ ఆయన ప్రస్థానాన్ని మరింత హృద్యంగా ఆవిష్కరించింది.




# మేం ఆడలేం




### ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌కు దక్షిణాఫ్రికా ఆటగాళ్లు దూరం

దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు జూన్ 11, 2025న లార్డ్స్‌లో ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌లో తలపడనున్నాయి. అయితే, ఈ మ్యాచ్‌లో ఆడే దక్షిణాఫ్రికా ఆటగాళ్లు ఐపీఎల్ 2025 ప్లే ఆఫ్స్‌కు దూరమయ్యే అవకాశం ఉంది. పహల్గాంలో ఉగ్రదాడి కారణంగా భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపీఎల్ అర్ధంతరంగా వాయిదా పడింది. కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత, బీసీసీఐ మే 17 నుంచి ఐపీఎల్‌ను పునఃప్రారంభించి, జూన్ 3న ఫైనల్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

ఈ షెడ్యూల్ కారణంగా డబ్ల్యూటీసీ ఫైనల్ సన్నాహకాలకు ఆటంకం కలగనుంది. దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు (సీఎస్ఏ) తమ ఆటగాళ్లను మే 26 నాటికి స్వదేశానికి తిరిగి రావాలని బీసీసీఐని కోరింది, డబ్ల్యూటీసీ ఫైనల్‌ను తమ ప్రథమ ప్రాధాన్యంగా పేర్కొంది. సీఎస్ఏ డైరెక్టర్ ఈనాక్ నిక్వే ఇలా అన్నారు: "మా మొదటి ప్రాధాన్యం డబ్ల్యూటీసీ ఫైనల్. మా టెస్ట్ జట్టు ఆటగాళ్లు మే 26 నాటికి తిరిగి రావాలని బీసీసీఐని కోరాం." ప్రధాన కోచ్ షుక్రి కాన్రాడ్ కూడా ఈ వైఖరిని సమర్థించారు: "ఐపీఎల్‌తో మా ఒప్పందం ప్రకారం ఆటగాళ్లు మే 26న తిరిగి రావాలి. డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం మే 30న బయలు దేరాల్సి ఉంది. దీనిపై వెనక్కి తగ్గే ఆలోచన లేదు."

**డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆడే ఐపీఎల్ ఆటగాళ్లు:**

కగిసో రబాడ (గుజరాత్ టైటాన్స్), లుంగి ఎంగిడి (రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు), ట్రిస్టన్ స్టబ్స్ (ఢిల్లీ క్యాపిటల్స్), ఐడెన్ మార్క్రమ్ (లక్నో సూపర్ జెయింట్స్), ర్యాన్ రికెల్టన్ (ముంబై ఇండియన్స్), కార్బిన్ బాష్ (ముంబై ఇండియన్స్), మార్కో యాన్సెన్ (పంజాబ్ కింగ్స్), వియాన్ ముల్డర్ (సన్‌రైజర్స్ హైదరాబాద్) ఈ ఆటగాళ్ల జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తే, వారి అనుపస్థితి ఆయా ఫ్రాంచైజీలపై ప్రభావం చూపవచ్చు.

## టెస్టు ర్యాంకింగ్స్‌లో టాప్ పొజిషన్

### చరిత్ర సృష్టించిన జడేజా



టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా నయా చరిత్ర సృష్టించాడు. వరల్డ్ క్రికెట్‌లో ఇప్పటివరకు ఎవరికీ సాధ్యం కాని రికార్డు తన పేరిట లిఖించుకున్నాడు. బుధవారం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ విడుదల చేసిన టెస్టు ర్యాంకింగ్స్‌లో టాప్ పొజిషన్? పదిలం చేసుకున్నాడు. ప్రస్తుతం జడ్డూ 400 రేటింగ్స్‌తో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఈ క్రమంలోనే జడేజా టెస్టు చరిత్రలోనే అరుదైన రికార్డ్ సాధించాడు. టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆల్‌రౌండర్ విభాగంలో అత్యధిక రోజులు టాప్ ప్లేస్‌లో ఉన్న ప్లేయర్‌గా ఘనత సాధించాడు. గత 1151 రోజుల నుంచి జడేజానే టెస్టు ఆల్‌రౌండర్ల విభాగంలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టెస్టు చరిత్రలో టాప్ ప్లేస్‌లో కొనసాగడం ఇదే అత్యధికం. కాగా, 2022లో రవీంద్ర జడేజా టెస్టు ఆల్‌రౌండర్ల లిస్ట్‌లో అగ్ర స్థానంలోకి దూసుకొచ్చాడు. అప్పుడు వెస్టిండీస్ మాజీ కెప్టెన్ జేసన్ హోల్డర్‌ను వెనక్కినెట్టి జడ్డూ టాప్‌లో స్థిరపడ్డాడు. అప్పట్నుంచి మూడేళ్లకుపైగా ఆ స్థానాన్ని పదిలం చేసుకుంటూ వస్తున్నాడు. గతేడాది అద్భుతమైన గణాంకాలతో జడ్డూ ఆకట్టుకున్నాడు. 2024లో 29.27 యావరేజ్‌తో 527 పరుగులు బాదాడు. అలాగే బౌలింగ్‌లోనూ రాణించిన జడేజా 24.29 సగటుతో 48 వికెట్లు నేలకూల్చాడు. ఈ క్రమంలోనే 2024 ఐసీసీ టెస్టు టీమ్ ఆఫ్ ది ఇయర్‌లో చోటు దక్కించుకున్నాడు. ఈ జట్టులో భారత్ నుంచి యశస్వీ జైస్వాల్, జడేజా, జస్ప్రీత్ బుమ్రా ముగ్గురికే చోటు దక్కింది. 2012లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన జడేజా టీమ్‌ఇండియాకు ఇప్పటిదాకా 80 మ్యాచ్?ల్లో ప్రాతినిధ్యం వహించాడు. ముఖ్యంగా భారత్ పిచ్‌లపై బంతిని గింగిరాలు తిప్పుతూ ప్రత్యర్థుల వికెట్లు నేలకూల్చుతాడు. ఇప్పటివరకు జడ్డూ 3370 పరుగులు బాదాడు. ఇందులో 4 సెంచరీలు, 22 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అటు బంతితోనూ అదరగొట్టి 323 వికెట్లు నేలకూల్చాడు. ఇందులో మూడుసార్లు 10 వికెట్లు, 15సార్లు 5 వికెట్లు ప్రదర్శనలు ఉన్నాయి.

## భారత్-పాక్ వివాదంలో హేజిల్‌వుడ్

భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తాత్కాలికంగా చల్లారినప్పటికీ, సామాజిక మాధ్యమాల్లో ఫేక్ పోస్టుల పరంపర కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ ఫేక్ న్యూస్ బారిన పడ్డారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఐపీఎల్ మ్యాచ్‌లు వాయిదా పడటంతో హేజిల్‌వుడ్ సహా ఆసీస్ ఆటగాళ్లు స్వదేశానికి వెళ్లారు. ఈ సమయంలో హేజిల్‌వుడ్ పేరిట ఓ ఫేక్ పోస్ట్ వైరల్ అయింది, ఇందులో ఆయన భారత సాయుధ దళాలకు మద్దతుగా, పాకిస్థాన్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా వ్యాఖ్యానించినట్లు ఉంది. "మీ పోరాటం భారత్ కోసం మాత్రమే కాదు, సురక్షిత ప్రపంచం కోసం" అని ఆ పోస్టులో రాసుంది. ఈ ఫేక్ న్యూస్‌పై ఆస్ట్రేలియా మీడియాలో




## ఉత్తమ గ్రామ పోలీసుగా తొడిమె గీత

**జిల్లా ఎస్పీ చేతుల మీదుగా రివార్డ్**
**ఉద్యోగం పొందిన సంవత్సర కాలంలోనే.. ఉత్తమ ప్రతిభ**

మర్రిగూడ, మే 14 (జనం సాక్షి)
ఉత్తమ గ్రామ పోలీసుగా తొడిమె గీత ఎంపికయ్యారు. నల్లగొండ జిల్లా ఎస్పీ చేతుల మీదుగా రివార్డ్ అందుకున్నారు, నల్లగొండ జిల్లా, పెద్దవూర మండలం,చాలకుర్తి గ్రామానికి చెందిన తొడిమె గీత 2024లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సంపాదించి, మొదటి పోస్టింగ్ లో మర్రిగూడ పోలీస్ స్టేషన్లో విధుల్లో చేరారు, ఉద్యోగం పొందిన సంవత్సర కాలంలోనే ఉత్తమ ప్రతిభ కనబరిచారు,మర్రిగూడ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్న తొడిమె గీత దామర భీమనపల్లి గ్రామ పోలీస్‌గా ఉత్తమ సేవలు అందించినందుకు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ చేతుల మీదుగా బుధవారం ఎస్పీ కార్యాలయంలో రివార్డును అందుకున్నారు, ఈ సందర్భంగా నాంపల్లి సిఐ దూది రాజు, మర్రిగూడ ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి ఉద్యోగం పొందిన సంవత్సర కాలంలోనే ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా ఎస్పీ నుండి రివార్డు అందుకున్నందుకు మర్రిగూడ మండల వాసులు అభినందిస్తున్నారు,

## వైకల్యం శరీరానికి మాత్రమే, మనస్సుకు కాదు

**రెట్రో ఫి టెడ్ మోటార్ వాహనాలు పంపిణీ చేసిన మంత్రి దనసరి అనసూయ సీతక్క**

**ములుగు ప్రతినిధి,మే 14(జనంసాక్షి) :**
వైకల్యం శరీరానికి మాత్రమే,మనస్సుకు కాదని, దివ్యాంగులు ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేయడానికే ఈ సహాయ ఉపకరణాల పంపిణీ చేయడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయం లో జిల్లా సంక్షేమ అధికారిణి కె శిరీష అధ్యక్షతన మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన 6 దివ్యాంగులకు బ్యాటరీ తో నడిచే ట్రై సైకిళ్లను అందించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి సీతక్క మాట్లాడుతూ వైకల్యం శరీరానికి మాత్రమేనని మనస్సుకు కాదని, దివ్యాంగులు ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేయడానికే ఈ ఉపకరణాలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగులు సకలాంగులకు ఏమాత్రం తీసిపోరని వారు ఇంకా విభిన్న సామర్థ్యాలను కలిగి ఉంటారని కొనియాడారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో, సంక్షేమ పథకాల్లో రిజర్వేషన్లు ఇవ్వడం జరుగుతుందని అన్నారు.దివ్యాంగుల చేతికి ఊతకర్రలా మన ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, దివ్యాంగులు ప్రభుత్వం అమలు



చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకంలో దివ్యాంగులకు తొలి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని, జిల్లాలోని దివ్యాంగులకు ప్రభుత్వం ద్వారా అన్ని విధాలుగా సహకారం అందించడం జరుగుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి చిత్రా మిశ్రా మాట్లాడుతూ దివ్యాంగులకు మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో ఈ సహాయ ఉపకరణాలను ఉచితంగా అందించడం ఎంతో గొప్ప విషయం అని అన్నారు. దివ్యాంగులు, ఈ సహాయ ఉపకరణాలను సక్రమంగా వినియోగించుకొని తమ వైకల్యాన్ని అధిగమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మహేందర్, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహారాష్ట్ర సీఎంతో రోహిత్ భేటీ

టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ మహారాష్ట్ర ముఖ్య మంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో మర్యాదపూర్వకంగా కలిశాడు. మంగళవారం ముఖ్యమంత్రి అధికారిక నివాసం 'వర్ష'లో సీఎంతో రోహిత్ ముచ్చటించాడు. అయితే రోహిత్ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన వారంలోనే ముఖ్యమంత్రిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎం ఫడణవీస్ క్రికెటర్ హిట్‌మ్యాన్‌కు బొకే ఇచ్చి స్వాగతం పలికారు. రోహిత్‌ను ఆయన శాలువాతో సత్కరించారు. తర్వాత కాసేపు ఇద్దరు సరదాగా మాట్లాడుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలను సీఎం ఫడణవీస్ తన అఫీషియల్ ఎక్స్ అకౌంట్‌లో పోస్ట్ చేశారు. 'భారత క్రికెటర్ రోహిత్ శర్మను నా అధికారిక నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశాను. టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ఇచ్చిన సందర్భంగా అతడికి నా అభినందనలు. అలాగే ఫ్యూచర్ కెరీర్‌కు ఆల్ ది బెస్ట్' అని ఫడణవీస్ రాసుకొచ్చారు.

సీఎంతో రోహిత్ భేటీ అయిన ఫొటోలు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అయ్యాయి. టెస్టుల్లోంచి రిటైర్ అయ్యాక వారంలోనే ముఖ్యమంత్రిని కలువడం వల్ల రోహిత్ రాజకీయంలోకి చేరబోతున్నాడా అంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు. అయితే అలాంటిది ఏమీ లేదని తెలుస్తోంది. ఈ భేటీలో కేవలం రోహిత్ ప్రొఫెషనల్ కెరీర్ గురించి మాట్లాడుకున్నట్లు సమాచారం.

## ఆలయ విస్తరణపై అపోహలు వద్దు

- శృంగేరి పీఠాధిపతి సూచనల మేరకే విస్తరణ చేపడతాం
- ఏ దేవతా విగ్రహాలను ముట్టుకోము
- భీమేశ్వరాలయంలోనే భక్తులకు పూజలు
- రూ.150 కోట్లతో పట్టణ, ఆలయ అభివృద్ధి : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 14 (జనంసాక్షి)**
వేములవాడ రాజన్న ఆలయ విస్తరణపై ఎలాంటి అపోహలు వద్దని, శృంగేరి పీఠాధిపతి సూచనల మేరకే విస్తరణ చేస్తామని, ఏ దేవత విగ్రహాలను తొలగింపు ఉండదని, ఆలయ అభివృద్ధి జరుగుతున్న క్రమంలో భక్తులకు భీమేశ్వరాలయంలోనే పూజలు చేసుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆయన బుధవారము హైదరాబాదులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధికి నోచుకొని వేములవాడ పట్టణంతో పాటు రాజన్న ఆలయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ సహాకారంతో రూ.76 కోట్లతో అభివృద్ధి చేస్తామంటే బీజేపీ, బిఆర్ఎస్ నాయకులు అడ్డు తగులుతున్నారన్నారు. మేము చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేకనే రెండు పార్టీలు వేములవాడ బంద్ కు పిలుపునిచ్చాయన్నారు. గత సీఎం కేసీఆర్ తన లగ్గం ఇక్కడే అయిందని చెప్పుకుంటూ ఏటా వంద కోట్లు ఇస్తానని చెప్పి ఒక్క రూపాయి ఇవ్వని బిఆర్ఎస్ పార్టీ కేసీఆర్ ఒక్కవైపు, మూడుసార్లు కేంద్రంలో అధికారంలోకి ఉండి ఆలయానికి ఒక్కపైసా ఇవ్వని బీజేపీ పార్టీ నాయకులు మరోవైపు అభివృద్ధికి అడ్డుపడడం బాధాకరంగా ఉందన్నారు.

**సుప్రభాత సేవ నుండి మొదలుకొని..**
అభివృద్ధిలో భాగంగా స్వామి వారికి జరిగే సుప్రభాత సేవ నుండి మొదలుకొని రాత్రి జరిగే నిధి పూజ వరకు నిత్య పూజలు యధావిధిగా జరుగుతాయన్నారు. దేవాలయం బంద్ అనేది లేదనీ, మూసివేత అనేది ఉండదనీ, దేవాలయం తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని చెబుతున్నా నన్నారు. భక్తులకు స్వామి వారి అర్జిత సేవలను దూరం చేయకుండా ఉండేందుకే శృంగేరి పీఠాధిపతుల సూచనల మేరకు భీమేశ్వరాలయంలో ఏర్పాటు చేస్తే రాజన్నకు చేసే పూజలు భీమన్నకు ఎలా చేస్తారని వితండ వాదం చేస్తే ఎలా అని ప్రశ్నించారు. రాజన్న ఆలయంలో పరమ శివుడు ఉన్నాడు..భీమన్న ఆలయంలో పరమ శివుడే ఉన్నాడన్నారు. అభివృద్ధి చేయాలని సంకల్పంతో సిఎం రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు రూ 76 కోట్లతో విస్తరణ చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. ఆలయ అంతర్భాగాన్ని మొద టి విడతలుగా విస్తీర్ణం చేయడానికి పనులు ప్రారంభించేందుకు సిద్దమయ్య మన్నారు. బంద్ పేరిట రాజకీయాలు చేయకూడదన్నారు. ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం 2024-25 బడ్జెట్ లో 50కోట్లు, 2025- 26 బడ్జెట్లో 100 కోట్లు పెట్టుకున్నామని, మొత్తం కలిపి రూ 150 కోట్లతో దేవాలయ అభివృద్ధి,పట్టణ అభివృద్ధి విటిఏడిఏతో అభివృద్ధి చేయాలనుకు న్నామన్నరు. దీనికి సంబంధించి ఇప్పటికే రూ 47 కోట్లు విటిఏడిఏ వైస్ చైర్మన్ గా ఉన్నా జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. రోడ్డు విస్తరణలో ఎవరైతే ఆస్తులు కోల్పోతున్నారో వారే బందులో పాల్గొన్నట్లు తెలిసిందని, నష్టపోతున్నవారికి నష్టపరిహారం కొరకు పోరాడుదామన్నరు.

**పట్టణ బంద్‌పై దేవాదాయశాఖ మంత్రి ఆరా**
రాజన్న ఆలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం వేములవాడ పట్టణ బంద్ నిర్వహించారు. వ్యాపార,వాణిజ్య సంస్థలు బందుకు పూర్తిస్థాయిలో సహకరించాయి. ఈ విషయంపై దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ దేవాదాయ శాఖ కమిషనర్, రాజన్న ఆలయ ఈవోను ఆమె వివరణ కోరారు. ఆలయ విస్తరణలో భాగంగా రాజన్న ఆలయంలో దర్శనాలను రద్దుచేసి భీమేశ్వర ఆలయంలో ఏర్పాటు చేస్తున్న క్రమంలో వీరికి అపోహలు ఉన్నాయని వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలేతకుండా పట్టణంలోని పుర ప్రముఖులకు పూర్తిస్థాయిలో సమాచారం అందజేసి ఆలయ అభివృద్ధి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.



## పిల్లర్ గుంతలో పడి ఇద్దరు చిన్నారుల మృతి

**ఉప్పల్, మే 14 (జనం సాక్షి):**
ఉప్పల్ భగాయత్‌లో విషాద ఘటన చోటు చేసుకుంది. కుల సంఘాల భవన నిర్మాణం కోసం తవ్విన పిల్లర్ గుంతలోని నీటిలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. సుజాత, వెంకటేశ్ దంపతుల కుమారులు అర్జున్ (8), మణికంఠ (15) నిన్న అదృశ్యమై, ఈ గుంతలో విగతజీవులుగా కనిపించారు. డీఆర్ఎఫ్ బృందాలు మృతదేహాలను బయటకు తీశాయి. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీ నిధి నిధుల దుర్వినియోగంపై విచారణ




**పెన్ పహాడ్. మే13 (జనం సాక్షి) :** మండల పరిధిలోని నాగులపహాడ్ గ్రామంలో 2023 అక్టోబర్ నెలలో నిర్వహించిన సోషల్ ఆడిట్ లో 15 లక్షల 25 వేల రూపాయల శ్రీ నిధి నిధులు వివోఏ కుర్రి ప్రమీల సొంత ఖర్చులకు వాడుకొని దుర్వినియోగం చేసినట్లు అప్పటి విచారణలో తేలింది. కానీ ఇప్పటివరకు ఆ నిధులను ఆమె ఆ నిధులు శ్రీనిధికి చెల్లించలేదు . ఈ విషయమై గ్రామానికి చెందిన నక్క సందీప్ సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన గ్రీవెన్స్ లో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పై స్పందించిన అధికారులు మంగళవారం గ్రామానికి విచ్చేసి మరల విచారణ చేపట్టారు. గ్రామంలో శ్రీ నిధి రుణాలు తీసుకున్న 25 సంఘాలకు గాను మంగళవారం 6 సంఘాలను విచారణ చేయడం జరిగింది. ఇట్టి విచారణలో మరో 5 లక్షల రూపాయలు దుర్వినియోగంకు పాల్పడినట్లు తేలిందని ఏపిఎం అజయ్ నాయక్ తెలిపారు. మరో రెండు రోజులుఆ గ్రామంలో మిగతా సంఘాలను విచారణ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. శ్రీ నిధి నిధులు దుర్వినియోగం చేసిన వివోఏ అట్టి నిధులను చెల్లించకపోయిన యెడల ఆర్ఆర్ యాక్ట్ చట్ట ప్రకారం చర్యలు తీసుకొని రికవరీ చేయనున్నట్లు ఏపీఎం తెలిపారు. ఇట్టి విచారణ బృందం సభ్యులు శ్రీ నిధి మేనేజర్ జ్యోతి, సీసీలు పద్మావతి, శైలజ, స్వరూప, సంఘ బంధం అధ్యక్షురాలు జయమ్మ తదితరులు పాల్గొన్నారు...

## వికారాబాద్ జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

**వికారాబాద్, మే 14 (జనంసాక్షి):**
భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ గ్రామసభల ద్వారా దరఖాస్తులు స్వీకరించి, భూ భారతి చట్టం ప్రకారం చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం ధరూర్ మండలంలోని కేరెల్లి, కుకింద గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రైతు సదస్సుల్లో ఆయన పాల్గొని, రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. రైతులు ఈ సదస్సుల్లో ఉచితంగా దరఖాస్తులు సమర్పించవచ్చని, ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. భూ భారతి చట్టాన్ని రాష్ట్రవ్యాప్తంగా కఠినంగా అమలు చేస్తూ, భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ధరూర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నేపథ్యంలో, సమస్యలున్నవారు ఈ సదస్సుల్లో పాల్గొని, దరఖాస్తులు సమర్పించాలని కోరారు. గతంలో ప్రజలు తహసీల్దార్, ఆర్‌డీఓ లేదా కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు అధికారులే గ్రామాలకు వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. భూ భారతి చట్టం కింద వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించాలని రెవెన్యూ బృందాలకు ఆదేశించారు. విచారణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా







జరగాలని, అవకతవకలకు తావులేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలు, నూతన ఆర్ఓఆర్ చట్ట నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

దరఖాస్తులను ముందుగా రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి, తర్వాత క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని ఆదేశించారు. భూ భారతి చట్టం ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం కావడంతో, విచారణలో నిబద్ధత, నిజాయితీతో పనిచేయాలని, ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగకుండా శాశ్వత పరిష్కారం కోసం కృషి చేయాలని కలెక్టర్ రెవెన్యూ అధికారులకు హితవు పలికారు. తప్పిదాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అప్పీల్ వ్యవస్థ అమలులో ఉన్నందున, ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. సాదాబైనామా, పీఓటీ దరఖాస్తులకు సంబంధించి హైకోర్టు స్టే తొలగిన తర్వాత, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం క్రమబద్ధీకరణ జరుగుతుందని దరఖాస్తుదారులకు స్పష్టం చేయాలన్నారు. ఒకే దరఖాస్తులో బహుళ సమస్యలుంటే, ప్రతి సమస్యను విడిగా పరిశీలించాలని ఆదేశించారు.

వారం రోజుల్లో దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేయాలని, రెవెన్యూ బృందాలు సమన్వయంతో నిర్ణీత గడువులోపు పని పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్‌డీఓ వాసు చంద్ర, తహసీల్దార్లు దీపక్, శ్రీనివాస్, సజీదా బేగం, నెమత్ అలీ, వెంకటేశ్వరి, సంధ్య, రైతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధిత కుటుంబానికి అండగా సీఎం రేవంత్ రెడ్డి

**చికిత్సకు రూ.12 లక్షలు అందజేత**



**హైదరాబాద్:** క్యాన్సర్ బారిన పడిన వ్యక్తి చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. సిద్దిపేటకు చెందిన సిరిసిల్ల సాయిచరణ్ (35) అక్యూర్డ్ మైలాయిడ్ లుకేమియా (బ్లడ్ క్యాన్సర్) బారిన పడ్డారు. ఆయనకు భార్య లక్ష్మిప్రసన్న, కుమార్తెలు లక్ష్మి సుసజ్ఞ (6), స్మయ (2 నెలలు), తల్లిదండ్రులు రాము, సునీత ఉన్నారు. ఇంటికి ఆధారమైన సాయిచరణ్ క్యాన్సర్ బారినపడడంతో అతని చికిత్సకు కుటుంబ సభ్యులు సిద్దిపేట మండలం ఎన్సాన్‌పల్లిలోని తమ ఇంటిని విక్రయించారు. అయినప్పటికీ చికిత్సకు అవసరమైనంత డబ్బులు సరిపోకపోవడంతో వారు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని గతంలో కలిసి తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చలించిన ముఖ్యమంత్రి సాయిచరణ్ చికిత్సకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. దాంతో హైదరాబాద్ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో సాయిచరణ్‌కు స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ పూర్తయింది. చికిత్సకు అదనంగా వ్యయమైన మరో రూ.7 లక్షలను సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో ఆ మొత్తాన్ని అధికారులు అందజేశారు. చికిత్స చేయించుకున్న సాయిచరణ్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయానికి వచ్చి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ధైర్యంగా ఉండాలని సీఎం సాయిచరణ్‌కు సూచించారు.

# బేగంపేట పైవంతెనకు త్వరలో మరమ్మతులు

- రూ.14.6 కోట్లతో మరమ్మతులు చేపట్టనున్న బల్దియా



హైదరాబాద్, మే 14 (జనంసాక్షి) : బేగంపేట పైవంతెనకు మంచి రోజులు రాబోతున్నాయి. వాహనదారులు బయటికి వెళ్లే సమయంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉండడం అలాగే అక్కడి రోడ్లు బాగోలేకపోవడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అక్కడ జరిగే ప్రమాదాలను తగ్గించేందుకు రూ.14.6 కోట్లతో మరమ్మతులు చేపట్టాలని బల్దియా నిర్ణయించింది. బేగంపేట పైవంతెన నిర్మించేందుకు పనులు మొదలు పెట్టాలని, దీంతో ప్రాజెక్టుల విభాగం టెండరు నోటిఫికేషన్ విడుదల చేశారు. కంటోన్మెంట్‌లోని ఆర్.కె.పురం ఆర్వోబీ మరమ్మతులకూ టెండరు నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పైవంతెన పనులను ఏడాదిన్నర లోగా పూర్తి చేయాలనుకుంటోంది. పనుల సమయంలో వంతెనపై వాహనాల రాకపోకలు నిలిపివేసి ట్రాఫిక్‌కి ఎలాంటి ఇబ్బందులు రాకుండా దారి మళ్లింపు చేపట్టాల్సి ఉంది. బేగంపేట రైల్వేస్టేషన్ వద్ద 1980లో పైవంతెనకు అప్పటి సీఎం టి.అంజయ్య శంకుస్థాపన చేశారు. మూడేళ్లకు పూర్తయింది. సికింద్రాబాద్, బేగంపేట మధ్య రాకపోకలకు అడ్డంకి తొలగినా రోజురోజుకూ రద్దీ పెరిగిపోయింది. దీంతో కొన్నేళ్లకు పాత సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ఆర్వోబీని అనుసంధానం చేస్తూ మరో వంతెనను నిర్మించారు. 40 ఏళ్ల కిందటి పిల్లర్ల మధ్య స్లాబుల అంచులు దెబ్బతిన్నాయి. స్లాబుల మధ్య ఎక్కువ దూరం పెరగడం, పిల్లర్లపై బేరింగులు బాగా దెబ్బతినడంతో ప్రమాదకరంగా మారింది. సికింద్రాబాద్ వైపు వెళ్లే వాహనాలు తరచూ అదుపుతప్పి పడిపోతున్నాయి. బేగంపేట వైపు వచ్చే వాహనాలు విభాగినిని ఢీకొంటున్నాయి. బేరింగులను మార్చి స్లాబులు, గడ్డర్లను చక్కదిద్దుతామని, ఇంజక్షన్ విధానంలో ఫైన్ సిమెంట్‌ను దెబ్బతిన్న కాంక్రీటు దిమ్మెల్లోకి జొప్పించి మైక్రో కాంక్రీటింగ్‌తో పగుళ్లను త్వరలో పూర్తి చేస్తామని ఇంజినీర్లు తెలిపారు. బేగంపేట ఆర్వోబీ కింద రెండు నిరాశ్రయుల కేంద్రాలున్నాయి. దాదాపు 200 మంది వాటిలో ఆశ్రయం పొందుతున్నారు. కొంతమందిని వేరే కేంద్రాలకు తరలించాలని కోరుతూ యూసీడీ(అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్) అధికారులకు బల్దియా ఇంజినీర్లు లేఖ రాశారు. కొత్త పైవంతెనపై ఈ రెండేళ్లపాటు ఆయా కేంద్రాలను ఇతర ప్రాంతాల్లో నిర్వహించడం లేదా పూర్తిగా తొలగించే మార్గాలపై జీహెచ్‌ఎంసీ ఆలోచిస్తోంది. ఈసీఐఎల్, సైనిక్‌పురిని కంటోన్మెంట్‌తో కలిపే ఆర్.కె.పురం ఆర్వోబీ వరకు కొన్ని సంవత్సరాల నాటిది. పగుళ్లు, స్లాబుల మధ్య ఎక్కువ దూరం పెరగడంతో వాహనాల రాకపోకలకు సమస్యగా మారింది. లాలాపేట, అడిక్‌మెట్ ఆర్వోబీల మాదిరి ఆర్.కె.పురం ఆర్వోబీకి రూ.4.6 కోట్లతో మరమ్మతులు నిర్వహిస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు.

# పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని జరపాలి

- సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ డిమాండ్




హైదరాబాద్ (జనంసాక్షి) : పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి, 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం, ఆపరేషన్ సిందూర్ వంటి అంశాల గురించి వాస్తవాలను ప్రజలకు చెప్పేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని జరపాలని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం బుధవారం హైదరాబాద్లోని ఎంబీ భవన్లో నిర్వహించారు. గురు, శుక్రవారాల్లో రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతాయి. గతనెల రెండు నుంచి ఆరో తేదీ వరకు తమిళనాడులోని మధురైలో ఆ పార్టీ అఖిల భారత మహాసభల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎంఏ బేబీ తొలిసారిగా హైదరాబాద్కు వచ్చారు. ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఐ(ఎం) పొలిట్బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఎ విజయరాఘవన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీతో కలిసి ఎంఏ బేబీ మీడియాతో మాట్లాడారు. పార్టీ మహాసభల్లో రాజకీయ, సంస్థాగత లక్ష్యాలను నిర్దేశించుకున్నామని అన్నారు. వామపక్ష, ప్రజాతంత్ర పార్టీలు, సామాజిక శక్తులను ఐక్యం చేసి ముందుకెళ్తున్నామని చెప్పారు. పార్టీ సొంతం పెంచుకోవడంపై దృష్టిసారించామన్నారు. ఇటీవల పార్టీ కేంద్ర కమిటీ సమావేశం జరిగిందనీ, మహాసభలో చేసిన నిర్ణయాలను నిర్దిష్ట కాలపరిమితిలోగా అమలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. గతనెల 22న పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను కాపాడే ప్రయత్నంలో ఓ కాశ్మీరీ కూడా బలయ్యాడని అన్నారు. ఉగ్రవాదుల దాడి దేశం, ప్రజలు, రాజకీయ పార్టీలన్నీ ఖండించాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందంటూ ప్రకటించారని అన్నారు. ఆర్మీయేతర చర్యలు చేపట్టాలంటూ సీపీఐ(ఎం) రాజ్యసభ పక్షనేత జాన్బ్రిటాస్ కేంద్రాన్ని డిమాండ్ చేశారని చెప్పారు. న్యాయపరంగా ఎదుర్కొనే చర్యలు చేపట్టాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి వేదికల్లో పాకిస్తాన్పై ఒత్తిడి పెంచేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాలని కోరారు.

### మతకలహాలు రెచ్చగొట్టేలా సైబర్ దాడి

టీఆర్పీ పోటీ ప్రపంచంలో ఎలక్ట్రానిక్ మీడియా ఉందని ఎంఏ బేబీ అన్నారు. ఇండియాపాకిస్తాన్ యుద్ధ సమయంలో మతకలహాలు రెచ్చగొట్టేలా కొన్ని మీడియా సంస్థలు వ్యవహరించాయని విమర్శించారు. ప్రజలంతా ఐక్యంగా ఉండాల్సిన సమయంలో ఇలాంటివి ప్రసారం చేయడం సరైంది కాదన్నారు. కేరళకు చెందిన ఉగ్రదాడి బాధితుడు రామచంద్రన్ కుమార్తె ఆరతి చెప్పిన విషయాలను ఆయన గుర్తు చేశారు. ఇద్దరు ముస్లిం సోదరులు వారికి అన్ని విధాలుగా సహాయం చేశారనీ, మతకలహాలు రెచ్చగొట్టేలా కొందరు సైబర్ దాడులకు పాల్పడ్డారని అన్నారు. ఒలింపిక్స్ జావెలింగ్ త్రో విజేత నీరజ్ చోప్రాపైనా సైబర్ దాడులు జరిగాయన్నారు. ప్రధాని మోడీ సహచరులతో మాట్లాడి పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించే తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు సభ్యులకు అనేక ప్రశ్నలుంటాయనీ, వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఎంఏ బేబీ సమాధానమిచ్చారు. మావోయిస్టులతో చర్చలు జరపాలని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ మాట్లాడుతూ హామీల అమలు గురించి అడిగితే డబ్బుల్లేవంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పించుకునే సమాధానం చెప్తున్నారని అన్నారు. ఆరు గ్యారంటీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల ముందు వాగ్దానాలు ఇచ్చినపుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలుసని చెప్పారు.

# వైసీపీకి మరో బిగ్ షాక్..!

- మండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ రాజీనామా

రాయచోటి, మే14 (జనంసాక్షి) : వైఎస్ఆర్ సీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఏపీలో ఇదివరకే ఐదుగురు వైసీపీ ఎమ్మెల్సీలు ఇదివరకే పార్టీని వీడారు. తాజాగా వైసీపీకి మరో ఎమ్మెల్సీ రాజీనామా చేశారు. ఏపీ శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియా ఖానం వైఎస్ఆర్సిపి కి రాజీనామా చేశారు. మరోవైపు ఎమ్మెల్సీ పదవికి సైతం ఆమె రాజీనామా చేశారు, ఈ మేరకు మండలి చైర్మన్ కు లేఖ సైతం రాశారు. వ్యక్తిగత సిబ్బంది ద్వారా తన రాజీనామా లేఖను మండలి చైర్మన్ కు ఆమె పంపినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో 2020 జూలైలో ఎమ్మెల్సీగా జాతీయ ప్రాణం ను గవర్నర్ నామినేట్ చేశారని తెలిసింది. రాయలసీమలోని అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన జకియాఖానం గత కొంతకాలం నుంచి వైసీపీలో అసంతృప్తిగా ఉన్నారు.

# లక్డీకపూల్‌లో మాజీ సీఎం రోశయ్య కాంస్య విగ్రహం!

- మెట్రో స్టేషన్ సమీపంలో ప్రతిష్ఠాపనకు నిర్ణయం



హైదరాబాద్, మే 14 (జనంసాక్షి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దివంగత కొణిజేటి రోశయ్య స్మారకార్థం ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) నిర్ణయించింది. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నగరంలోని లక్డీకపూల్ మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న కూడలిలో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠాపించనున్నారు. తొమ్మిది అడుగుల ఎత్తు ఉండే ఈ కాంస్య విగ్రహం ఏర్పాటుకు సంబంధించి జీహెచ్‌ఎంసీ అధికారులు ఇప్పటికే టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. అర్హులైన కాంట్రాక్టర్ల నుంచి బిడ్‌లను ఆహ్వానిస్తున్నారు. జూలై 4వ తేదీన కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించాలని జీహెచ్‌ఎంసీ భావిస్తోంది. ఈ దిశగా ఏర్పాట్లు ముమ్మరం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘకాలం పాటు ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత తమిళనాడు గవర్నర్‌గా కూడా విశేష సేవలు అందించారు. ఆయన రాజకీయ అనుభవం, పరిపాలనా దక్షత తెలుగు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

# రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- అకాల వర్షాలకు తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొంటది
- ప్రతి రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ
- తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన మంత్రి సీతక్క



ఏటూరునాగారం, మే 14(జనంసాక్షి) : అకాల వర్షాలకు తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొంటుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సీతక్క తెలపారు. మండలం గోగుపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని మంత్రి సీతక్క పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్నీ కూడా ప్రభుత్వంమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఆరుగాలం కష్టం చేసి రైతులు పండించిన వరి ధాన్యం అకాల వర్షాలకు తడిసిన ముద్ద కావడం తో రైతులు ఆందోళన చెందుతున్నారని, ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. పంట నష్ట పరిహారం ఎంతైనా ప్రభుత్వంమే చెల్లిస్తుందని, నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తుందని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఇంకా ఎక్కడెక్కడ వరి ధాన్యం ఉన్న యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లే అవుట్‌ను పరిశీలించిన హైడ్రా కమిషనర్



హైదరాబాద్ (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ మండలం కొహెడ గ్రామంలోని రాజాజీ నగర పేరిట వేసిన లే ఔట్‌ను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దాదాపు 17 ఎకరాల విస్తీర్ణంలో 190 వరకు ప్లాట్లతో ఉన్న లేఅవుట్ లోని పార్కులు, రహదారులు కలిపేసి సమ్మిరెడ్డిబాల్ రెడ్డి తప్పుడు ధ్రువపత్రాలతో తమ ప్లాట్లను కబ్జా చేశారంటూ అక్కడి ప్లాట్ యజమానులు గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసారు. ఆక్రమణలను, రహదారులకు అడ్డంగా నిర్మించిన కట్టడాలను హైడ్రా తొలగించింది. ప్లాట్ యజమానులు ఊపిరి పీల్చుకున్నారు. మళ్ళీ అక్కడ సమ్మిరెడ్డి బాల రెడ్డి నిర్మాణాలు చేపట్టగా ప్లాట్ యజమానులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో సమ్మిరెడ్డి వాళ్ళ మీద దాడి చేసి తరిమేశాడు అని ప్లాట్ యజమానులు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ క్షేత్ర స్థాయి పర్యటన చేసి అక్కడ పరిస్థితిని తెలుసుకున్నారు. రాజాజీ నగర లేఔట్ ప్రకారం రహదారులు, పార్కులను కబ్జాల చేరా నుంచి విడిపిస్తామని. ఆక్రమణలకు పాపాడిన వాళ్ళపై లోతుగా పరిశీలించి వాళ్ళ మీద క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట ఇవ్వడంతో మాటివ్వడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం కొహె డ విలేజ్ లోని కొత్త చెరువును కమిషనర్ సందర్శించారు. చెరువులో తమ స్థలాలు మునిగిపోయాయి అనే పిర్యాదుల విషయమై క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సమ్మిరెడ్డి బాల్ రెడ్డి తనపై దాడి చేయగా నెత్తిమీద గాయం అయ్యిందని.. 12 కుట్లు పడ్డాయని కమిషనర్‌కు బాధితుడు వివరించారు. కబ్జాలు తొలగించి రహదారులు, పార్కులు రక్షిస్తామని.. ఆక్రమణలకు పాల్పడిన సమ్మిరెడ్డి బాలరెడ్డిపై కేసులు పెడతామని బాధితులకు హైడ్రా కమిషనర్ తెలిపారు.

# సమాచార కమిషనర్ల ప్రమాణం

- అభినందించిన సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మే14 (జనంసాక్షి) : కొత్తగా నియమితులైన రాష్ట్ర సమాచార కమిషనర్లు బుధవారం ప్రమాణం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమిషనర్లుగా బోరెడ్డి అయోధ్యరెడ్డి, పీవీ శ్రీనివాసరావు, మొహ్సినా పర్వీన్, దేశాల భూపాల్ ప్రమాణస్వీకారం చేసారు. వీరిని సిఎం రేవంత్ రెడ్డి అభినందించారు.

# సిఎంను కలిసిన సందీప్ సుల్తానియా



హైదరాబాద్, మే14 (జనంసాక్షి) : ఫైనాన్స్ సెక్రటరీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సచివాలయంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని సందీప్ సుల్తానియా మర్యాద పూర్వకంగా కలిసారు. వివిధ హోదాల్లో పనిచేసిన సందీప్ అపార అనుభం గడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గడ్డుగా ఉన్న సందర్భంగా ఆయన ఫైనాన్స్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ ఆయనకు అభినందనలు తెలిపారు.

# నీరజ్ చోప్రాకు విశిష్ట గౌరవం

**టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్ హెూదా**

న్యూఢిల్లీ, మే14 (జనంసాక్షి) : భారత జావెలిన్ త్రో స్టార్, ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా అరుదైన గౌరవం దక్కింది. భారత ప్రాదేశిక సైన్యం (టెరిటోరియల్ ఆర్మీ) అతడికి గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హెూదాను ప్రదానం చేసింది. ఈ నియామకం ఏప్రిల్ 16 నుంచి అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత ప్రభుత్వ అధికారిక పత్రిక అయిన 'ది గెజిట్ ఆఫ్ ఇండియా' ఈ నియామకానికి సంబంధించిన వివరాలను ప్రచురించింది. "టెరిటోరియల్ ఆర్మీ రెగ్యులేషన్స్, 1948లోని పారా–31 ద్వారా సంక్రమించిన అధికారాలను అనుసరించి, రాష్ట్రపతి మాజీ సుబేదార్ మేజర్ నీరజ్ చోప్రా, పీవీఎస్‌ఎం, పద్మశ్రీ, వీఎస్‌ఎం (గ్రామం, పోస్ట్ ఆఫీస్ ఖాంద్రా, పానిపట్, హర్యానా)కి 2025 ఏప్రిల్ 16 నుంచి ఈ గౌరవ హెూదాను ప్రదానం చేస్తున్నారు" అని మిలిటరీ వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీ, మేజర్ జనరల్ జీఎస్ చౌధరి పేరిట విడుదలైన ప్రకటనలో స్పష్టం చేశారు. గతంలో పలువురు ప్రముఖ క్రీడాకారులకు కూడా ఇటువంటి గౌరవ హెూదాలు లభించాయి. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్లు మహేంద్ర సింగ్ ధోనీ, కపిల్ దేవ్‌లకు టెరిటోరియల్ ఆర్మీలో గౌరవ హెూదాలు దక్కాయి. అదేవిధంగా, 2008 బీజింగ్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత, షూటర్ అభినవ్ బింద్రాకు 2011లో టెరిటోరియల్ ఆర్మీలో గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హెూదాను, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు 2010లో భారత వైమానిక దళం గ్రూప్ కెప్టెన్ గౌరవ హెూదాను ప్రదానం చేశారు. నీరజ్ చోప్రా 2016 ఆగస్టు 26న భారత సైన్యంలో నాయబ్ సుబేదార్ హెూదాలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీఓ)గా చేరారు. జావెలిన్ త్రో క్రీడాంశంలో తన ప్రతిభతో భారత్ కు అంతర్జాతీయంగా గుర్తింపు అందించాడు.






# కడప జిల్లాలో తీవ్ర విషాదం

- చెరువులో గల్లంతైన ఐదుగురు చిన్నారులు



కడప, మే14 (జనంసాక్షి) : వేసవి సెలవులకు బంధువుల ఇంటికి వచ్చిన చిన్నారులు ప్రమాదవశాత్తూ చెరువులో మునిగిపోయారు. ఈతకు వెళ్లి నీళ్లలో గల్లంతయ్యారు. కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం మల్లేపల్లెలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుందీ విషాదం. ఐదుగురు చిన్నారులలో నలుగురు బంధువుల ఇంటికి వచ్చిన వారే కావడం గమనార్హం. ఆడుకోవడానికి వెళ్లిన బాలురు చీకటి పడుతున్నా తిరిగి రాకపోవడంతో మల్లేపల్లెలో కలకలం రేగింది. వారిని వెతుక్కుంటూ వెళ్లిన కుటుంబ సభ్యులు, బంధువులకు చెరువు ఒడ్డున పిల్లల బట్టలు కనిపించాయి. దీంతో వెంటనే అధికారులకు సమచారం అందించగా.. హుటాహుటిన అక్కడికి చేరుకున్న అధికారులు గజ ఈతగాళ్లను పిలిపించి చెరువులో గాలింపు చేపట్టారు. రాత్రి వరకు నాలుగు మృతదేహాలు బయటపడగా.. మరో బాలుడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దుర్ఘటనలో చనిపోయిన వారిని దీక్షిత్, తరుణ్, పార్థు, చరణ్ గా గుర్తించారు. మరో బాలుడు హర్ష ఆచూకీ ఇంకా దొరకలేదని వివరించారు. చనిపోయిన పిల్లలంతా పన్నెండేళ్లలోపు చిన్నారులేనని తెలిపారు. కాగా, మృతదేహాలు బయటపడడంతో చిన్నారుల తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. చెరువులో ఈత కోసం మొత్తం ఏడుగురు బాలురు వెళ్లారని గ్రామస్థులు తెలిపారు. అయితే, మార్గమధ్యలో ఓ బాలుడు ఏడ్వడం మొదలుపెట్టాడు. దీంతో ఏడుస్తున్న ఆ బాలుడిని తీసుకుని మరొక బాలుడు వెనుతిరిగారు. దీంతో వారిద్దరు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.






Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370